


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 197

శనివారం 8-10-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLIGUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**వచ్చే ప్రపంచకప్ చివరిది**

ఆ తర్వాత గుడ్‌బై చెబుతానన్న అర్జెంటీనా ఫుట్‌బాల్ కెప్టెన్ మెస్సీ - 15లో



**పతన బాటలోనే రూపాయి**

డాలర్ మారకంలో రూ.82.30కి చేరిన రూపాయి విలువ - 15లో



## న్యూస్‌రీల్

### 'జేసీ'లపై బిగుస్తున్న ఉచ్చు!



నకిలీపత్రాలతో వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫోర్జరీ ఎన్‌ఓసీలతో వాహనాల కొనుగోలు, అమ్మకాల బాగోతానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) జేసీ కుటుంబ సభ్యులపై ఉచ్చుబిగుస్తోంది. ఈడీ ఆదేశాల మేరకు జేసీ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం విచారణకు హాజరయ్యారు.

వివరాలు 2లో ▸


### రాష్ట్రంలో ఎడతెగని వర్షాలు



రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వైఎస్సార్ జిల్లా దువ్వూరులో అత్యధికంగా 13.98 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పలు జిల్లాల్లో వాగులు, వంకలు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మరో 3 రోజులు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

వివరాలు 12లో ▸

### సోనియా రిమోట్‌ను కాను



'నేనేం సోనియాగాంధీ రిమోట్ కంట్రోల్‌ను కాదు. కాంగ్రెస్‌లో అన్నీ సర్వామోదంతోనే జరుగుతాయి. బీజేపీ అధ్యక్ష ఎన్నికలను ఎన్నిసార్లు నిర్వహించారు? బీజేపీలో రిమోట్ కంట్రోల్ ఎక్కడుందో అందరికీ తెలుసు' అని కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే అన్నారు.

వివరాలు 6లో ▸

మూడు రాజధానుల కోసం..

# ముందడుగు

## వికేంద్రీకరణకు మద్దతుగా గళం విప్పిన అన్ని వర్గాల ప్రజలు

- అనకాపల్లి జిల్లాలో భారీ బైక్ ర్యాలీ
- పి.జగ్గంపేట నుంచి గన్నవరం వరకు వికేంద్రీకరణ నినాదాలు
- దానితోనే బీసీల అభివృద్ధి అంటూ రాష్ట్ర బీసీ సంఘం తీర్మానం.. రాష్ట్ర కార్యాలయంలో 30 బీసీ కులాల నేతల భేటీ
- ఉత్తరాంధ్ర వెనుకబాటుకు చంద్రబాబే కారణం
- సీఎం వైఎస్ జగన్ అనుమతిస్తే వికేంద్రీకరణకు మద్దతుగా రాజీనామా : మంత్రి ధర్మాన
- తాత్కాలిక రాజధానికి వేల కోట్లు వృథా చేసిన చరిత్ర హీనుడు బాబు: కృష్ణదాస్
- అన్ని ప్రాంతాలూ బావుండాలి.. అందులో అమరావతి ఉండాలి
- భార్యలే పాదయాత్రలు.. భర్తలెందుకు బయటకు రావట్లేదు? : కారుమూరి



అనకాపల్లి జిల్లా నాతవరం వద్ద భారీ బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, ప్రజలు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు వికేంద్రీకరణ వైపే మొగ్గు చూపుతున్నారు. వికేంద్రీకరణ ద్వారానే అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి సత్వర రీతిలో సాధ్యమవుతుందని విశ్వసిస్తున్నారు. గతంలో అభివృద్ధి అంతా ఒకే ప్రాంతంలో కేంద్రీకరించడం వల్ల ఏ రీతిన నష్టపోయామో కళ్లారా చూశామని, ఇకపై అలాంటి తప్పిదం చోటుచేసుకోకుండా ఇప్పుడే జాగ్రత్త పడాలని హెచ్చరిస్తున్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధిని కాంక్షిస్తూ ముందుకు అడుగులు వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని విధాలా మద్దతుగా నిలుస్తామని ఊరూ వాడా ఎలుగెత్తి చాటుతున్నారు. కేవలం 29 గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధిగా భావిస్తూ పాదయాత్ర పేరుతో ప్రాంతాల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్న టీడీపీ తీరును ఎండగడుతున్నారు. మూడు రాజధానులకు మద్దతుగా బైక్ ర్యాలీలు.. దీక్షలు.. పూజలు.. ఇలా ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ప్రజలు తమ వాణి వినిపిస్తున్నారు. తమ ప్రశ్నలకు సమాధానం చెప్పి ముందుకు కదలండని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు ప్రశ్నల బాణాలు సంధిస్తున్నారు.

- వివరాలు 12లో



అలెస్ బియాల్‌యాస్కీ



రష్యాకు చెందిన 'మెమోరియల్' సంస్థ




సెంటర్ ఫర్ సివిల్ లిబర్టీస్ (ఉక్రెయిన్)

మానవ హక్కుల పోరాటాలకు

# శాంతి నోబెల్

## బెలారస్ ఉద్యమకారుడు అలెస్ బియాల్‌యాస్కీతోపాటు రష్యా, ఉక్రెయిన్ సంస్థలకు సంయుక్తంగా అత్యున్నత గౌరవం

మానవ హక్కుల పరిరక్షణ కోసం కొనసాగుతున్న ఉద్యమాలకు నోబెల్ కమిటీ అత్యున్నత గౌరవాన్ని కల్పించింది. బెలారస్ మానవ హక్కుల ఉద్యమకారుడు అలెస్ బియాల్‌యాస్కీ, రష్యా మానవ హక్కుల సంస్థ 'మెమోరియల్', ఉక్రెయిన్‌కు చెందిన 'సెంటర్ ఫర్ సివిల్ లిబర్టీస్'కు సంయుక్తంగా నోబెల్ శాంతి బహుమతిని శుక్రవారం ప్రకటించింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రెండు దేశాల్లోని సంస్థలు ప్రపంచ ప్రతిష్టాత్మక బహుమానానికి ఎంపిక కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. బెలారస్, రష్యా, ఉక్రెయిన్‌లో మానవ హక్కులు, ప్రజాస్వామ్యం, శాంతియుత సహజీవనం వంటి అంశాల్లో గొప్ప ఛాంపియన్లు అయిన ముగ్గురిని(ఒక వ్యక్తి, రెండు సంస్థలు) శాంతి బహుమతితో గౌరవిస్తుండడం ఆనందంగా ఉందని నోబెల్ కమిటీ చైర్మన్ బెరిట్ రీస్–ఆండర్సన్ చెప్పారు. జైలులో ఉన్న అలెస్ బియాల్‌యాస్కీని విడుదల చేయాలని బెలారస్ పాలకులకు విజ్ఞప్తి చేశారు.

6లో

# శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

## నగర, పట్టణ పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత

## చెత్త శుద్ధి నిర్వహణలో ఉత్తమ విధానాలు పాటించాలి

- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం జగన్
- ప్రతి మున్సిపాలిటీలోను వేస్ట్ ప్రాసెసింగ్ ప్రక్రియ అమలు తప్పనిసరి.. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బాగు చేయండి
- జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి
- నియోజకవర్గానికి ఒక జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ తప్పనిసరి
- చేయూత లబ్ధిదారులను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాలి
- ప్లాస్టిక్ ఫ్లెక్సీ వ్యాపారులు వస్త్రం వైపు వెళ్లేందుకు ప్రభుత్వ సహకారం



**సాక్షి, అమరావతి:** నగరాలు, పట్టణాల్లో పారిశుధ్యంపై మరింత దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పురపాలక శాఖ అధికారులను ఆదేశించారు. గార్బేజ్ స్టేషన్ల కారణంగా పరిసరాల్లోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏమాత్రం ఉండకూడదని, ఇలాంటి ప్రాంతాల్లో సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. చెత్త నిర్వహణలో ఎలాంటి ప్రమాణాలు పాటిస్తున్నామో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నగరాల్లో పరిశుభ్రత, వేస్ట్ మేనేజ్‌మెంట్, మురుగునీటి శుద్ధి, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌తో పాటు సుందరీకరణ పనులు, పచ్చదనం పెంపు, టిడ్కో ఇళ్లు, వైఎస్సార్ అర్బన్ క్లినిక్స్, జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్స్ తదితర అంశాలపై శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే

మిగతా 2వ పేజీలో ▶

# టీడీపీ నేత ఇంతియాజ్ అరెస్ట్

- ఇంటర్ విద్యార్థిని సంధ్యారాణిని వేధించడంతో ఆమె ఆత్మహత్య
- బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు.. వివరాలు వెల్లడించిన కదిరి రూరల్ సీఐ



టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతో రాళ్లపల్లి ఇంతియాజ్ (ఫైల్‌ఫొటో)

**తనకల్లు:** ఇంటర్ విద్యార్థిని సంధ్యారాణి ఆత్మహత్యకు కారణమైన శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి ఇంతియాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో కదిరి రూరల్ సీఐ శంకర్‌నాయక్ వివరాలు వెల్లడించారు. తనకల్లు మండలం ఎర్రబల్లికి చెందిన కురబ శ్రీనివాసులు, రాధమ్మ కుమార్తె సంధ్యారాణి.. అన్నమయ్య జిల్లా మొలకలచెరువులోని మోడల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అయితే నల్లచెరువు మండల కేంద్రానికి చెందిన ఇంతియాజ్ ఫేస్‌బుక్‌లో ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. కొన్ని రోజులుగా తనను ప్రేమించాలంటూ ఆమెను వేధించడం మొదలెట్టాడు. లేకుంటే ఆమె ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో పెడతానంటూ బెదిరించాడు. ఇంతియాజ్ వేధింపులు అధికం కావడంతో బుధవారం సంధ్యారాణి

మిగతా 16వ పేజీలో ▶

అక్రమ వ్యాపారాలకు కేరాఫ్

### అచ్చెన్న అనుచరుడు!

- తాజాగా నకిలీ పోలీసు నేమ్ బోర్డుతో ఒడిశాలో ప్రయాణం
- బరంపురంలో అదుపులోకి తీసుకున్న ఒడిశా పోలీసులు

- వివరాలు 16లో



టీడీపీ నేత అచ్చెన్నాయుడుతో నిందితుడు కోరాడ సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

మరో 2,091 ఆలయాల్లో

### 'నిత్య నైవేద్యం'



- ఒకేసారి పెద్ద సంఖ్యలో ఆలయాలకు డీడీఎన్‌ఎస్ పథకం అమలు
- దేవదాయ శాఖ ఉత్తర్వులు
- గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం తక్కువున్న ఆలయాలకు నెలకు రూ. 5,000 చొప్పున సాయం
- వచ్చే నెల నుంచి పూజారుల ఖాతాల్లో నగదు జమ
- నైవేద్య ఖర్చులకు రూ. 2,000, పూజారి గౌరవ వేతనం రూ. 3,000.. ఏడాదికి రూ.30 వేల లోపు ఆదాయం ఉండే ఆలయాలకే వర్తింపు
- 2008లో డీడీఎన్‌ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టిన వైఎస్సార్
- ఒక్క ఆలయానికి కూడా పథకాన్ని వర్తింపజేయని టీడీపీ ప్రభుత్వం
- జగన్ సీఎం అయ్యాక కొత్తగా 2,747 ఆలయాలకు వర్తింపు
- మొత్తం 4,367 ఆలయాలకు లబ్ధి

5లో



## ఇదండీ సంగతి



ఆ వాస్ ఏదో ఆయన భార్యకు ఇవ్వొచ్చుగా!!

పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై..

# మళ్లీ అధ్యయనం కుదరదు

## ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణకు తేల్చిచెప్పిన సీడబ్ల్యూసీ.. అన్ని ప్రాజెక్టుల్లాగే దీనిపైనా అధ్యయనం చేశాం

- అక్కడలేని అభ్యంతరం 'పోలవరం'పైనే ఎందుకు?
- సీడబ్ల్యూసీ అధ్యయనానికి క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేదన్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్.. జూలై వరదలకు భద్రాచలం సహా 103 గ్రామాలు ముంపునకు గురయ్యాయన్న తెలంగాణ ఈఎన్‌సీ
- మీరూ రాజకీయ నేతల్లా మాట్లాడితే ఎలా అంటూ సీడబ్ల్యూసీ చైర్మన్ చురకలు.. వరదలకు ఎక్కడ ఎంత నీటి మట్టం పెరిగిందో 19లోగా వివరాలివ్వండి
- వాటిని విశ్లేషించి నిర్ణయం తీసుకుంటామన్న సీడబ్ల్యూసీ
- ముంపు ప్రాంతాలపై సంయుక్త సర్వే, కరకట్టల నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణకు ఛత్తీస్‌గఢ్ ఓకే
- బ్యాక్‌వాటర్ ప్రభావంపై అధ్యయనం చేస్తేనే సహకరిస్తామన్న ఒడిశా.. సీడబ్ల్యూసీ చైర్మన్ తీవ్ర అభ్యంతరం.. ట్రిబ్యునల్‌కు లోబడే నిర్మిస్తున్నామని స్పష్టీకరణ



**సాక్షి, అమరావతి:** గోదావరికి గరిష్టంగా 50 లక్షల క్యూసెక్కుల వరద వస్తుందని ఐఐటీ–హైదరాబాద్, 58 లక్షల క్యూసెక్కుల వరద వస్తుందని ఐఐటీ–రూర్కీ అధ్యయనంలో వెల్లడైందని.. వాటిని పరిగణలోకి తీసుకుని పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంపై అధ్యయనం చేయాలని ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ఈఎన్‌సీలు చేసిన ప్రతిపాదనను సీడబ్ల్యూసీ చైర్మన్ డాక్టర్ ఆర్కే గుప్తా తోసిపుచ్చారు. గరిష్ట వరదలవల్ల బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపు ఉంటుందన్న

మిగతా 2వ పేజీలో ▶

తిరుమలలో శ్రీవారి ధ్వజస్తంభానికి మొక్కుతున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్‌మిశ్రా దంపతులు. చిత్రంలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి



# శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

## స్వామివారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు సీజే, ముగ్గురు జడ్జిలు

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి, సింగపూర్ మంత్రి కూడా...

5లో

## క్లుప్తంగా

### నిబంధనలు అతిక్రమిస్తే రూ.25 లక్షల జరిమానా

సాక్షి, అమరావతి: ఇన్‌సర్వీస్ కోటా కింద వైద్య విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన అభ్యర్థులు నిబంధనలు అతిక్రమిస్తే రూ.25 లక్షల జరిమానా విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ వైద్య కళాశాలలు (మెడికల్ పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు) 1997 నిబంధనలు సవరిస్తూ వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌సర్వీస్ విద్యార్థులు ఎండీ/ఎంఎస్ కోర్సులు ఆరేళ్లలో, పీజీ మెడికల్/డిప్లొమా కోర్సులు నాలుగేళ్లలో పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### కుష్టు వ్యాధి నియంత్రణపై సమీక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కుష్టు వ్యాధి నియంత్రణ కార్యకలాపాలపై రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అనిల్‌కుమార్ శుక్రవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో సమీక్ష నిర్వహించారు. వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో కుష్టు వ్యాధి, టీబీ నిర్మూలన జేడీ డాక్టర్ జె.యాస్మిన్ పాల్గొన్నారు.

### రిజిస్ట్రేషన్ శాఖలో సంస్కరణలకు కమిటీ

**నలుగురు సీనియర్ ఐఏఎస్‌లతో ఏర్పాటు**

సాక్షి, అమరావతి : స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖలో సంస్కరణల అమలు కోసం అవసరమైన సిఫారసులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి కన్వీనర్‌గా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, సభ్యులుగా సీనియర్ ఐఏఎస్ అధికారులు నీరబ్‌కుమార్ ప్రసాద్, ఎంటీ కృష్ణబాబు, ఎస్.గుల్జార్ ఉంటారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రిజిస్ట్రేషన్ సేవలను సులభతరం చేయడంతోపాటు ఆదాయాన్ని పెంచుకునే మార్గాలపై ఈ కమిటీ అధ్యయనం చేసి అక్టోబర్ 15వ తేదీలోపు నివేదిక ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో 20 శాతం ఆదాయ వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను తెలియజేయాలని సూచించారు. భూముల మార్కెట్ ధరలను కాలానుగుణంగా నిర్ధారించేందుకు నైపుణ్య సంస్థ సేవలను ఉపయోగించుకోవడంతోపాటు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లపై మూడేళ్లుగా పెంచిన ధరల ప్రభావం ఎలా ఉందనే విషయాలపై అధ్యయనం చేసి నివేదికలో పొందుపరచాలని పేర్కొన్నారు. భూముల ధరలు వివిధ రాష్ట్రాల్లో, మన దగ్గర ఎలా ఉన్నాయి, ఇంకా మెరుగైన మార్కెట్ ధరల స్థిరీకరణను ఎలా చేపట్టాలనే విషయాన్ని సూచించాలని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలపై అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించడం వంటి అంశాలపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### ఐసీఎస్‌ఈ స్కూల్స్ జాతీయ కార్యదర్శిగా సుందరి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఐసీఎస్‌ఈ, ఐఎస్‌ఈ పాఠశాలల అసోసియేషన్ జాతీయ కార్యదర్శిగా ఉడుముల సుందరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

● తెలంగాణ

### రూ.4 కోట్ల విలువైన బంగారం పట్టివేత

శంషాబాద్ (హైదరాబాద్): దుబాయ్ నుంచి ముగ్గురు వేర్వేరు ప్రయాణికులు అక్రమంగా తీసుకొచ్చిన రూ.4కోట్ల పైచిలుకు విలువైన బంగారాన్ని శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ ఈకే –528 విమానంలో వచ్చిన ఒక ప్రయాణికుడి లగేజీని తనిఖీ చేయగా అందులో సిల్వర్ కోటింగ్ చేసి ఉన్న ఎయిర్‌కంప్రెసర్ కనిపించింది. దాన్ని పరిశీలించగా 4895 గ్రాముల బరువున్న ఇరవైనాలుగు క్యారట్ల బంగారం బ్లాకు బయటపడింది. దీని విలువ రూ.2.57 కోట్లు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. మరో ఇద్దరి నుంచి.. రూ.1.47 కోట్ల విలువైన బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు.




### ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజుతో 'సాక్షి' స్ట్రెయిట్ టాక్

జనసేనతో కలిసి 2024 ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు బీజేపీ ఏపీ అధ్యక్షుడు సోము వీర్రాజు. తనను బీజేపీ అధ్యక్షుడిగా 3 రోజుల్లో తొలగించేస్తారంటూ చంద్రబాబు వర్గానికి చెందిన పత్రికలు చాలా కాలంగా ప్రచారం చేస్తున్నాయని, వాటిని లెక్క చేయనని సాక్షి టీవీ స్ట్రెయిట్ టాక్ ఇంటర్వ్యూలో తెలిపారు. సోము వీర్రాజుతో స్ట్రెయిట్ టాక్ శనివారం రాత్రి 7.30 గంటలకు, తిరిగి ఆదివారం ఉదయం 11.30 గంటలకు సాక్షి టీవీలో ప్రసారమవుతుంది.

# 'స్వచ్ఛ' అవార్డు గ్రహీతలకు ముఖ్యమంత్రి అభినందన



అవార్డు గెల్చుకున్న విశాఖపట్నం డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, సతీష్, కమిషనర్ రాజాబాబు తదితరులను అభినందించిన సీఎం



అవార్డు గెల్చుకున్న విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్, ఏసీ సత్యవతిని అభినందిస్తున్న సీఎం వైఎస్ జగన్

- సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు
- అవార్డుల గురించి సీఎంకు వివరించిన పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి
- వచ్చే ఏడాది మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించిన సీఎం

సాక్షి, అమరావతి: స్వచ్ఛ అమృత్ మహోత్సవ్ కింద కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్–2022లో 11 జాతీయ అవార్డులు గెల్చుకున్న పట్టణ స్థానిక సంస్థ (యూఎల్బీ)ల అధికారులు, పాలకమండలి సభ్యులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. శుక్రవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు పొందిన కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపాలిటీల చైర్మన్లు, కమిషనర్లు, ఇతర అధికారులు కలిశారు. తాము సాధించిన అవార్డులను సీఎంకు చూపించారు. ఈ సందర్భంగా పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై. శ్రీలక్ష్మి ఏయే విభాగాల్లో జాతీయ అవార్డులు వచ్చాయో సీఎం వైఎస్ జగన్‌కు వివరించారు.

**వచ్చే ఏడాది మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలి**

ఈ ఏడాది గార్బేజ్ ఫ్రీ సిటీస్ కేటగిరీలో 5 స్టార్ రేటింగ్‌తోపాటు జాతీయ స్థాయిలో సఫాయి మిత్ర సురక్షిత్ షెహర్ అవార్డును తిరుపతి గెలుచుకుందని శ్రీలక్ష్మి.. సీఎం వైఎస్ జగన్‌కు తెలిపారు. ఇదే విభాగంలో బిగ్ క్లీన్ సిటీ కేటగిరీలో విశాఖపట్నం 5 స్టార్ రేటింగ్‌తోపాటు అవార్డును గెలుచుకుందన్నారు. క్లీన్ స్టేట్ క్యాపిటల్ కేటగిరీలో విజయవాడ అవార్డుకు ఎంపికైందన్నారు. 50 వేల నుంచి లక్ష లోపు జనాభా విభాగంలో పులివెందుల మున్సిపాలిటీ ఇన్నోవేషన్ అండ్ బెస్ట్ ప్రాక్టీసెస్ కేటగిరీలో అవార్డును, పుంగనూరు మున్సిపాలిటీ సిటిజన్ ఫీడ్ బ్యాక్ అవార్డును సొంతం చేసుకున్నాయని తెలిపారు. ఇండియన్ స్వచ్ఛతా లీగ్ కేటగిరీలో శ్రీకాకుళం (లక్ష నుంచి 3 లక్షల లోపు జనాభా), పొదిలి (15 వేల లోపు జనాభా) 'స్పెషల్ మెన్షన్ అవార్డులు' సాధించాయని చెప్పారు. సాలూరు మున్సిపాలిటీ (25 వేల నుంచి 50 వేల లోపు జనాభా) ఇన్నోవేషన్ అండ్ బెస్ట్ ప్రాక్టీసెస్ కేటగిరీలో అవార్డు గెల్చుకున్నట్టు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఆయా యూఎల్బీల చైర్మన్లు, మేయర్లు, కమిషనర్లను అభినందించారు. వచ్చే ఏడాది స్వచ్ఛతా కార్యక్రమాలను మరింత సమర్థంగా చేపట్టి మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) ప్రవీణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీయూఎఫ్ఐడీసీ) ఎండీ లక్ష్మీశ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవసేన, ఎండీ డాక్టర్ పి.సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన ఐఏఎస్ ప్రొబేషనర్లు

- సామాన్యులకు అందుబాటులో ఉండాలని మార్గనిర్దేశం
- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారితోనూ భేటీ
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించిన సీఈవో

సాక్షి, అమరావతి : తొమ్మిది మంది 2021 బ్యాచ్ ఐఏఎస్ ప్రొబేషనర్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. పాలనా పరమైన అవగాహన పెంపొందించుకునేందుకు వారు వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులను కలిసి.. సూచనలు, సలహాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం వారు సీఎం జగన్‌తో సమావేశమయ్యారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసేలా పని చేస్తూ, సామాన్యుడికి సైతం అందుబాటులో ఉంటూ ముందుకు సాగాలని సీఎం వారికి మార్గనిర్దేశం చేశారు. 'ఆల్ ద వెరీ బెస్ట్' అంటూ అభినందనలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో పి.ధాత్రిరెడ్డి, వై.మేఘ స్వరూప్, ప్రఖర్ జైన్, గొబ్బిళ్ల విద్యాధరి, శివ నారాయణ్ శర్మ, అశుతోష్ శ్రీవాత్సవ, అపూర్వ భరత్, రాహుల్ మీనా, సూరపాటి ప్రశాంత్ కుమార్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు వారు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనాతో సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ విధానాన్ని వారికి వివరించారు. ఈ క్రమంలో వారు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్.రావత్, రాష్ట్ర జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తదితరులను కలిశారు. అనంతరం తాడిగడపలో పర్యటించి ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ పర్యటనలో డిప్యూటీ సీఈవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఐఏఎస్ ప్రొబేషనర్లు

## అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రవేశాలు

**10న ఏలూరు ఖేలో ఇండియా సెంటర్లో సామర్థ్య పరీక్షలు**

సాక్షి, అమరావతి: ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలోని రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా కేంద్రంలో వెయిట్ లిఫ్టింగ్ (బాలికలు), అథ్లెటిక్స్ (బాలబాలికలు)లో ప్రవేశాలు కల్పిస్తున్నట్టు సెంటర్ ఇన్‌చార్జి వినాయక ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న క్రీడా సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 12 నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులని తెలిపారు. వయసు ధ్రువీకరణ, ఆధార్ కార్డు, మెరిట్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు. ఎంపికైనవారికి ఉచిత శిక్షణ, వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

# 'జేసీ'లపై బిగుస్తున్న ఉచ్చు!

- ఈడీ విచారణకు జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన తనయుడు హాజరు
- 'సుప్రీం' తీర్పును ఉల్లంఘించి అక్రమంగా 154 వాహనాల రిజిస్ట్రేషన్
- బీఎస్–3వి కొని.. బీఎస్–4గా మార్పు
- పోలీసు సంతకాల ఫోర్జరీతో ఎన్‌ఓసీ.. దర్జాగా అమ్మకాలు
- దర్యాప్తులో బట్టబయలైన అక్రమాలు

సాక్షి, అమరావతి/హైదరాబాద్: నకిలీపత్రాలతో వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫోర్జరీ ఎన్‌ఓసీలతో వాహనాల కొనుగోలు, అమ్మకాల వెనుక భారీగా నల్లధనం చేతులు మారిన బాగోతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జేసీ కుటుంబ సభ్యులపై ఉచ్చుబిగుస్తోంది. దీనికి సంబంధించి మనీ లాండరింగ్ చట్టాలను ఉల్లంఘించిన వ్యవహారంలో విచారణకు హాజరుకావాలని ఈడీ అధికారులు జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఈడీ నోటీసులు జారీచేయడంతో ఆయన హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో శుక్రవారం విచారణకు హాజరయ్యారు. ఆయనతోపాటు ఆయన కుమారుడు అస్మిత్‌రెడ్డి కూడా ఉన్నారు. దాదాపు 5 గంటలపాటు అధికారులు ప్రశ్నించారు. విచారణానంతరం ప్రభాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, అధికారులు విచారణకు రమ్మని నోటీసులివ్వడంతో వచ్చానని, లారీల కొనుగోలుపై వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పానన్నారు. విచారణకు సహకరిస్తానని, ఎప్పుడు పిలిచినా తాను విచారణకు హాజరవుతానన్నారు.

**అక్రమాల బాగోతం ఇలా..**

టీడీపీ సీనియర్ నేతలు జేసీ దివాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి బ్రదర్స్ సుప్రీంకోర్టు నిషేధించిన బీఎస్–3 కేటగిరికి చెందిన 154 లారీలు, బస్సులను తుక్కు కింద జటాధర ఇండస్ట్రీస్ పేరున 50, సి. గోపాల్‌రెడ్డి అండ్ కో పేరున 104 వాహనాలను కొన్నారు. నకిలీపత్రాలతో వాటిని బీఎస్–4 వాహనాలుగా చలామణిలోకి తీసుకొచ్చారు. అనంతరం వాటిని నాగాలాండ్ రాజధాని కోహిమాలో రిజిస్ట్రేషన్ చేయించి, ఎన్‌ఓసీ పొందారు. ఆ తర్వాత 15 రోజుల్లోనే వాటిని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్‌లలో మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించారు. ఆంధ్రప్రదేశ్‌లో 101 వాహనాలు, తెలంగాణలో 33 వాహనాలు, కర్ణాటకలో 15 వాహనాలు, తమిళనాడులో ఒకటి, ఛత్తీస్‌గఢ్‌లో ఒక బస్సు నిర్వహిస్తున్నారు. మరో మూడు బస్సులు ఎక్కడ ఉన్నాయన్నది తెలియలేదు. ఆ వాహనాల లైసెన్సులకు కూడా ఫోర్జరీ పత్రాలు సమర్పించారు. అంతేకాక.. వాహనాల బీమాలోనూ వీరు ఫోర్జరీకి పాల్పడ్డారు. వీటిని కొద్దిరోజులపాటు తిప్పి ఆ తర్వాత పోలీసుల 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లతో (ఎన్‌ఓసీ) వాటిని ఇతర రాష్ట్రాల వారికి విక్రయించేశారు. కానీ, వీటిని కొనుగోలు చేసినవారు తాము మోసపోయామని గుర్తించి ఫిర్యాదు చేశారు. సమగ్ర సమాచారం కోసం పోలీసులు 'నేషనల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎన్ఐసీ)' రికార్డులను పరిశీలించారు. జేసీ కుటుంబం సమర్పించిన బీమా పత్రాలు నకిలీవని తేలింది. దీంతో అనంతపురం డిప్యూటీ రవాణా శాఖ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు 2020 జూన్‌లో జేసీ ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డితోపాటు 23 మందిపై వివిధ సెక్షన్ల కింద 35 కేసులు నమోదు చేశారు. ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డిలను అరెస్టు చేశారు. అనంతరం బెయిల్‌పై విడుదలయ్యారు.

**ప్రత్యేక దర్యాప్తునకు కేంద్రానికి లేఖ**

ఆ తర్వాత జేసీ కుటుంబం అక్రమాలపై ప్రత్యేకంగా దర్యాప్తు జరపాలని సూచిస్తూ రాష్ట్ర పోలీసులు కేంద్రానికి లేఖ రాశారు. దీంతో జేసీ కుటుంబం వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు కోసం ఈడీని రంగంలోకి దింపింది. కొన్ని నెలల క్రితం ఈడీ అధికారులు అనంతపురం రవాణా శాఖ అధికారుల నుంచి ఆధారాలు, కీలక పత్రాలను తీసుకున్నారు. ఆ తర్వాత జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు జేసీ అస్మిత్ రెడ్డి, వారి వ్యాపార భాగస్వామి సి. గోపాల్‌రెడ్డి నివాసాలు, కార్యాలయాలతోపాటు తాడిపత్రి, హైదరాబాద్, బెంగళూరు తదితర చోట్ల నిర్వహించిన సోదాల్లో కీలక ఆధారాలు సేకరించి ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డి ఫోన్లను జప్తుచేసినట్టు సమాచారం.

# శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ



టిడ్కో ఇళ్లు, వైఎస్సార్ అర్బన్ క్లినిక్స్, జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్స్‌పై సమీక్షలో మాట్లాడుతున్న సీఎం జగన్

> గార్బేజ్ స్టేషన్ల నిర్వహణలో అత్యుత్తమ విధానాలు పాటించాలి. ఆయా పట్టణాలు, నగరాల్లో చెత్తను, మురుగు నీటిని శుద్ధి చేసేందుకు ఇప్పటికే ఉన్న సౌకర్యాలు, వసతులు.. ఇంకా కల్పించాల్సిన సదుపాయాలపై నివేదిక తయారు చేయాలి. అవసరమైన వసతులు లేని చోట్ల వెంటనే కల్పించి సమర్థవంతంగా నిర్వహించాలి. మురుగునీటి శుద్ధి, వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ప్రతి మున్సిపాలిటీ నూరు శాతం పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

▶ మొదటి పేజీ తరువాయి

చేపట్టిన పనుల ప్రగతి, మెరుగైన ఫలితాలు వచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి మున్సిపాలిటీలోను వేస్ట్ ప్రాసెసింగ్ ప్రక్రియ అమలు తీరుపై శ్రద్ధ పెట్టాలని చెప్పారు. అన్ని యూఎల్బీల్లోనూ (అర్బన్ లోకల్ బాడీస్) ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో ఉందా? లేదా? అన్నదానిపై సంబంధిత అధికారులు నిరంతరం పరిశీలించాలని సూచించారు. ఈ సమీక్షలో సీఎం ఇంకా ఏమన్నారంటే..

**కృష్ణా వరద గోడకు సుందరీకరణ**

- ఏటా వచ్చే వరదలకు కృష్ణా నది పొంగి విజయవాడ నగర పాలక సంస్థలోని పలు ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యేవి. ఈ ఇబ్బందులను తప్పించేందుకు యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం రిటైనింగ్ వాల్‌ను నిర్మించింది. ఈ నేపథ్యంలో ఈ గోడకు ఆనుకుని ఉన్న ప్రాంతాల నుంచి మురుగు నీరు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలి. రిటైనింగ్ వాల్ బండ్‌ను చెట్లు, విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దాలి.
- విజయవాడ నుంచి గన్నవరం విమానాశ్రయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా చేపట్టిన సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. అంబేడ్కర్ పార్కుకు వెళ్లే రోడ్లను సైతం అందంగా తీర్చిదిద్దాలి. విశాఖపట్నం నగరంలో సైతం సుందరీకరణ పనులు చేపట్టాలి.
- వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బాగు చేయండి. మళ్లీ డ్రైవ్ చేపట్టి, మే 31 నాటికి అన్ని రోడ్లనూ బాగు చేయాలి.

> రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ ఫ్లెక్సీలను పూర్తిగా నిషేధించింది. నవంబర్ నుంచి ఇది అమల్లోకి వస్తుంది. దీన్ని సంపూర్ణంగా అమలు చేసేందుకు సంబంధిత వ్యాపారులతో కలెక్టర్లు సమావేశాలు నిర్వహించాలి. వ్యాపారులు ప్లాస్టిక్ నుంచి వస్త్రం వైపు మళ్లేందుకు కావాల్సిన ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు వారికి రుణాలు ఇప్పించి అండగా నిలవాలి. ఇచ్చిన రుణాలను సకాలంలో చెల్లించే వారికి ప్రభుత్వం నుంచే వడ్డీ రాయితీ కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి.
> – సీఎం వైఎస్ జగన్

**జగనన్న కాలనీల్లో నీరు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం**

- ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో మురుగు నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. కాలనీల నిర్మాణం పూర్తయ్యేలోగా వాటిలో మౌలిక సదుపాయాలను కూడా కల్పించాలి. ప్రాధాన్యత క్రమంలో నీరు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి తర్వాత మురుగు నీటి శుద్ధి కేంద్రాలను అందుబాటులోకి తేవాలి.
- రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లపై అధికారులు శ్రద్ధ పెట్టాలి. ప్రతి నియోజకవర్గానికి ఒక లే అవుట్‌ను తీర్చిదిద్దాలి. ఈ పనుల ప్రగతిపై ఉన్నతాధికారులు జిల్లాల వారీగా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించాలి. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష కార్యక్రమం పట్టణ ప్రాంతాల్లో చేపట్టడంపై దృష్టి సారించాలి.
- వైఎస్సార్ చేయూత లబ్ధిదారుల్లో సాధికారత కోసం కృషి చేయాలి. ఏటా 45 ఏళ్లు నిండిన మహిళల్లో అర్హత ఉన్న వారికి ఈ పథకం కింద నేరుగా వారి ఖాతాల్లో డబ్బు జమ చేయాలి. ఈ డబ్బుతో వారు స్వయం ఉపాధి పొందేలా తగిన చర్యలు తీసుకోవాలి. అర్హత సాధించిన తొలి ఏడాదిలోనే వారికి స్వయం ఉపాధి మార్గాలు చూపించడం ద్వారా వారిలో సంపూర్ణ సాధికారతకు కృషి చేయాలి.

ఈ సమీక్షలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ పి.సంపత్ కుమార్, ఏపీ టిడ్కో ఎండీ సీహెచ్ శ్రీధర్, ఏపీయూఎఫ్ఐడీసీ ఎండీ లక్ష్మీశా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై.. మళ్లీ అధ్యయనం కుదరదు

▶ మొదటి పేజీ తరువాయి

మూడు రాష్ట్రాల వాదనను కొట్టిపారేశారు. గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారమే పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే డిజైన్‌ను ఆమోదించామని.. ప్రాజెక్టు గరిష్ట వరద ప్రవాహం (పీఎంఎఫ్), ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేసే గరిష్ట వరద ప్రవాహం (స్టాండర్డ్ ప్రాజెక్ట్ ఫ్లడ్–ఎస్పీఎఫ్)లను పరిగణలోకి తీసుకుని బ్యాక్‌వాటర్ ప్రభావంపై ఆదిలోనే అధ్యయనం చేశామని గుర్తుచేశారు. తాము నిర్వహించిన అధ్యయనాల్లో బ్యాక్‌వాటర్ ప్రభావం ఉంటే ఆయా ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని సూచించామని.. ఆ మేరకు ఏపీ ప్రభుత్వం కరకట్టల నిర్మాణానికి సిద్ధమైందని వివరించారు. పోలవరం ప్రాజెక్టువల్ల ఆంధ్రప్రదేశ్‌తోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు ప్రయోజనం ఉంటుందని.. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టుకు సహకరించాలని కోరారు. ముంపు ప్రాంతాలను గుర్తించడానికి ఏపీతో కలిసి సంయుక్త సర్వేకు సిద్ధమవ్వాలని ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ఈఎన్సీలను ఆదేశించారు. శబరి, సీలేరు నదులపై కరకట్టలు నిర్మించడానికి వీలుగా.. ఆ ప్రాంతాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పోలవరం ముంపు, బ్యాక్‌వాటర్ ప్రభావంపై అనుమానాలను నివృత్తి చేయడానికి గత నెల 29న కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్, కేంద్ర అటవీ పర్యావరణ శాఖ కార్యదర్శి రామేశ్వర్ గుప్తాలు నాలుగు రాష్ట్రాల సీఎస్‌లతో భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో సాంకేతిక అంశాలపై చర్చించి.. ముంపు, బ్యాక్‌వాటర్‌పై అనుమానాలను పూర్తిస్థాయిలో నివృత్తి చేయడానికి నాలుగు రాష్ట్రాల ఈఎన్సీలతో సమావేశాన్ని నిర్వహించాలని సీడబ్ల్యూసీ చైర్మన్ డాక్టర్ ఆర్కే గుప్తాను కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ ఆ సమావేశంలో ఆదేశించారు. దీంతో శుక్రవారం ఢిల్లీలో నాలుగు రాష్ట్రాల ఈఎన్సీల నేతృత్వంలోని సాంకేతిక బృందాలు, పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ) సీఈఓ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని సాంకేతిక నిపుణులతో ఆర్కే గుప్తా సమావేశమయ్యారు.

**రాజకీయ నాయకుల్లా మాట్లాడితే ఎలా?**

పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంపై సీడబ్ల్యూసీ అధ్యయనంలో తేలిన అంశాలకూ.. ఈ ఏడాది ఆగస్టులో వచ్చిన వరదలవల్ల జరిగిన ముంపునకూ క్షేత్రస్థాయిలో పొంతన కుదరడంలేదని.. ఈ నేపథ్యంలో మరోసారి బ్యాక్‌వాటర్ ప్రభావంపై అధ్యయనం చేయాలని ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ఈఎన్సీలు ఆర్కే గుప్తాను కోరారు. గోదావరికి గరిష్ఠంగా 36 లక్షల క్యూసెక్కుల వరదే వస్తుందన్న అంచనాతో తాము ఏకీభవిస్తున్నామని.. కానీ, దాన్ని పరిగణలోకి తీసుకుని పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సీడబ్ల్యూసీ అధ్యయనంలో తేలిన అంశాలు.. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు సరిపోవడంలేదని తెలంగాణ ఈఎన్సీ మురళీధర్ చెప్పారు. జూలైలో వచ్చిన వరదలవల్ల భద్రాచలం సహా ఏడు మండలాల పరిధిలోని 103 గ్రామాలు ముంపు బారిన పడ్డాయని.. 11 వేల మందిపై ప్రభావం పడిందని.. 150 గ్రామాల పరిధిలో 50 వేల ఎకరాల భూమి ముంపునకు గురైందని ఫొటోలు చూపుతూ వివరించారు. దీనిపై గుప్తా స్పందిస్తూ.. ఇంజనీర్‌లైన మీరు రాజకీయ నాయకుల్లా మాట్లాడటం తగదని చురకలంటించారు. దేశవ్యాప్తంగా ఇతర ప్రాజెక్టులకు చేసిన తరహాలోనే పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై అధ్యయనం చేశామని.. ఎక్కడా తమ అధ్యయనంపై ఎవరూ అభ్యంతరం తెలిపిన దాఖలాల్లేవన్నారు. బ్యాక్‌వాటర్ ప్రభావంపై మళ్లీ అధ్యయనం చేసే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. గోదావరికి వరద వచ్చినప్పుడు.. ఏ ప్రాంతంలో నీటి మట్టం ఎంత పెరిగిందన్న వివరాలను ఈనెల 19లోగా రాతపూర్వకంగా అందిస్తే.. వాటిని విశ్లేషించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

**అప్పుడు రెండన్నారు.. ఇప్పుడు 35?**

ఇక పోలవరం ప్రాజెక్టు వెనుక భాగంలో గోదావరిలో కిన్నెరసాని, ముర్రేడువాగు సహా 35 వాగులు కలుస్తాయని.. బ్యాక్‌వాటర్ ఈ వాగుల్లోకి ఎగదన్నడంతో ముంపునకు దారితీస్తోందని.. దీనిపై అధ్యయనం చేయాలని.. ముంపు ముప్పు తప్పించడానికి కరకట్టలు నిర్మించాలంటూ తెలంగాణ ఈఎన్సీ మురళీధర్ వివరిస్తుండగా.. ఆర్కే గుప్తా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆదిలో కేవలం కిన్నెరసాని, ముర్రేడువాగుల ద్వారా బ్యాక్‌వాటర్ ప్రభావంపై అధ్యయనం చేస్తే చాలని కోరారని.. ఇప్పుడేమో 35 వాగులపై అధ్యయనం చేయాలని కోరుతున్నారంటూ వ్యాఖ్యానించారు. ఈ సమయంలో ఏపీ ఈఎన్సీ సి.నారాయణరెడ్డి జోక్యంచేసుకుని.. కిన్నెరసాని, ముర్రేడువాగులపై అధ్యయనం చేశామని.. చెప్పుకోదగ్గ ప్రభావం ఉండదని తేలిందని.. ఆ అంశాలను తెలంగాణకు అందజేశామన్నారు.

## సంయుక్త సర్వే, ప్రజాభిప్రాయ సేకరణకు ఒడిశా నో

మరోవైపు.. ముంపు ప్రభావం ఉండే ప్రాంతాలను గుర్తించడానికి ఏపీ ప్రభుత్వంతో కలిసి సంయుక్త సర్వే నిర్వహించాలని, కరకట్టలు నిర్మించడానికి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని సీడబ్ల్యూసీ చైర్మన్ గుప్తా ఆదేశాలను అమలుచేస్తామని ఛత్తీస్‌గఢ్ ఈఎన్సీ అంగీకరించారు. ఏపీ ప్రభుత్వంతో కలిసి ఇప్పటికే 150 అడుగుల కాంటూర్ పరిధిలోని ముంపు ప్రాంతాలను గుర్తించడానికి సంయుక్త సర్వే నిర్వహించామని.. 175 అడుగుల కాంటూర్ పరిధిలో కూడా గుర్తించడానికి సంయుక్త సర్వే నిర్వహించాలని కోరారు. కానీ.. ఒడిశా ఈఎన్సీ ఇందుకు సహకరించబోమన్నారు. దీనిపై సీడబ్ల్యూసీ చైర్మన్ గుప్తా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. గోదావరి ట్రిబ్యునల్ అవార్డుకు లోబడే ప్రాజెక్టును నిర్మిస్తున్నామనే అంశాన్ని గుర్తించాలని.. ఆ అవార్డు ప్రకారమే తమ కార్యాచరణ ప్రణాళిక ఉంటుందని స్పష్టంచేశారు.

## వచ్చే ఏడాది విశాఖలో ఐసీఐడీ సమావేశం



సాక్షి, అమరావతి/నెల్లూరు (సెంట్రల్): వచ్చే ఏడాది విశాఖపట్నంలో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రెయినేజ్ (ఐసీఐడీ) కాంగ్రెస్, ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఐఈసీ) సమావేశాలకు 78 దేశాల ప్రతినిధులను జల వనరులు, వ్యవసాయ శాఖ మంత్రులు అంబటి రాంబాబు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం ఆహ్వానించింది. ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో జరుగుతున్న ఐసీఐడీ 24వ కాంగ్రెస్‌లో పాల్గొనడానికి శుక్రవారం వెళ్లిన రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం వచ్చే ఏడాది విశాఖలో నిర్వహించే 25 కాంగ్రెస్‌కు సభ్య దేశాల ప్రతినిధులు, నీటి పారుదల, వ్యవసాయరంగ నిపుణులను ఆహ్వానించింది. 72 ఏళ్ల తర్వాత తిరిగి మన దేశంలో సీఎం వైఎస్ జగన్ సిద్ధమయ్యారు. ప్రపంచానికి జలభద్రత చేకూర్చడం, తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటల సాగుకు దోహదం చేసే అత్యాధునిక నీటి పారుదల విధానాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. తద్వారా నీటి వనరులను సమర్థంగా ఉపయోగించుకుని.. అత్యధిక ఆయకట్టుకు నీరందించి రాష్ట్రాన్ని సుభిక్షం చేసే దిశగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా సౌత్ ఆస్ట్రేలియా పార్లమెంట్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు.


Reliance
Reliance digital
PERSONALISING TECHNOLOGY
NEVER BEFORE PRICES
iPhone
NEW LAUNCH
iPhone 14 Plus
Available Now
Starting from
₹84900*
మై కెండ్ అఫ్ ఫెస్టివ్ ఆఫర్స్
ఫెస్టివల్ అఫ్ ఎలక్ట్రానిక్స్
NOW OPEN AT:
• ENIKEPADU: OPP SRI SAKTHI PELLI PANDIRI
• TADEPALLI: PATHUR CROSS RAODS
Windows 11
GAMING
Get Gaming mouse + Headphone + Mat worth ₹4999
LENOVO IDEAPAD
Starting from
₹50990*
EMIs of ₹3642/-
4GB GTX 1650 GRAPHICS
BENEFITS Default 1year Warranty + 1year ADP + 1year premium care
HP VICTUS
• 512GB SSD
• Upto 144Hz Refresh
Starting from
₹57999*
EMIs of ₹4142/- (Net Effective)
4GB GTX 1650 GRAPHICS
MS OFFICE 21
LAPTOPS
THIN & LIGHT
SAMSUNG GALAXY BOOK 2
• 12th Gen Core i5
• 16GB RAM
• 512 GB SSD
₹88990
Starting from
₹57999*
EMIs of ₹3556/-
(Effective after bank cashback)
MS OFFICE 21
FLAT 12% OFF*
MACBOOK AIR & MACBOOK PRO
Supercharged by the Apple M1 chip
*Applicable for Students & Teachers Only*
TELEVISIONS
2 Year WARRANTY
108 cm (43) ANDROID TV
BPL
ONEPLUS
₹14990*
*Price after cashback
₹19990*
*Price after cashback
LG
3 Year WARRANTY
NanoCell
139 CM (55) 55NAN083
₹67990
BENEFITS LG Tone Free Wireless Earbuds FN5 worth ₹19990/-
MAX CASHBACK UPTO 10%* MAX VALUE ₹7500/-*
SAMSUNG
5 Year WARRANTY
Neo QLED
139 CM (55) & ABOVE
EMIs of
₹1990*
BENEFITS Samsung A32 mobile worth ₹21490 absolutely free*
MAX 20% CASHBACK UPTO ₹20000/-*
10% ఇన్‌స్టెంట్ డిస్కౌంట్*
SBI card
In-stores
AXIS BANK
kotak
reliancedigital.in
క్రెడిట్ కార్డు పై ఫ్లాట్ ₹5000* డిస్కౌంట్
SAMSUNG | 5G DEALS
SMARTPHONES
M13 5G 6/128
₹15999
₹13999*
M53 5G 6/128
₹28999
Starting from
₹19999*
*Price post upgrade bonus & bank cashback
BEST DEAL
S22
Starting from
₹49999*
S22+
Starting from
₹55799*
S22 ULTRA
Starting from
₹86499*
Samsung Upgrade
*Price post upgrade & cashback
XIAOMI 11T PRO 5G
₹40499
Starting from
₹30999*
iPhone 12 (64 GB)
Starting from
₹45990*
iPhone 12(128 GB)
Starting from
₹53990*
iPhone 13
Starting from
₹64900*
TABLETS
iPad
9th Gen Wi-fi 64GB
₹30900
₹24899*
LARGE APPLIANCES
SAMSUNG
Up to 20% cashback*
Free* Galaxy devices on select models (1 unit)
SIDE BY SIDE
KELVINATOR 584L
₹57990*
SAMSUNG 700L
₹96990*
LG 694L
₹104990*
BENEFITS Get Freebies worth upto ₹72990
FRONT LOAD
LG 6.5kg
₹32990*
SAMSUNG 7kg
₹34990*
IFB 8kg
₹39990*
KITCHEN APPLIANCES
UPTO 50% OFF*
MIXER GRINDERS
Starting from
₹1699
RICE COOKERS
Starting from
₹1899
EMI STARTS AT 999 AND ATTRACTIVE CASH BACK UPTO 20%
kotak
HDFC BANK
ICICI Bank
SBI
citibank
SHOP ANY ELECTRONICS AT MY JIO STORE
Jio DIGITAL LIFE
1000
MobiKwik
Paytm
PhonePe
1000 ఇన్‌స్టెంట్ డిస్కౌంట్
mastercard
SBI Debit Card
reliancedigital.in
VISIT US AT: VIJAYAWADA: PATAMATA, GROUND & FIRST FLOOR, SRI CHAKRA TOWERS, OPP DURGA MAHAL THEATER PH: 0866-2466000 • LEPL CENTRO MALL, MG ROAD, OPP HOTEL FORTUNE MURALI, BACK SIDE OF LIFESTYLE, LABBIPET PH: 0866-2466603/2466604 • BHAVANIPURAM, ADJACENT TO SRIRASTU FUNCTION HALL, CHURCH CENTER PH: 0866-2417013/14 • TADEPALLI, NEAR PATHUR CROSSROADS, MAIN ROAD, TADEPALLI, PH: 6281113898 | 8074582587 • ENIKEPADU, NH 5 OPP: SRI SHAKTI PELLI PANDIRI PH: 0866-2843355/56 | ALSO VISIT US AT: VIJAYAWADA | VIZAG | TIRUPATI | NELLORE | RAJAHMUNDRY | KAKINADA | GUNTUR | ADONI | MADANAPALLI | CHITTOOR | KADAPA | PRODDATUR | ANANTHAUR | GUNTAKAL | KURNOOL | PIDUGURALLA | ONGOLE | CHIRALA | ELURU | VIZIANAGARAM | TADEPALLIGUDEM | BHEEMAVARAM | ANAKAPALLI | AMALAPURAM | NARSARAOPETA | TO LOCATE YOUR NEAREST MYJIO STORE SMS LOCATE <PINCODE> TO 56161

దేనిని పొందిన తరువాత ఇతరమైన ఏ లాభాన్ని కూడా దానికంటే ఎక్కువ అనుకోడో, దేనిలో నిలిచి విపరీతమైన దుఃఖం వల్ల కూడా చలించడో, అతడే నిజమైన యోగి.
– భగవద్గీత

సాక్షి

శనివారం, అక్టోబర్, 8

# మందులా... మృత్యు గుళికలా!

ఒకే రోజు రెండు విషాద వార్తలు! రెండూ పసిపిల్లలకు సంబంధించినవే. థాయ్‌లాండ్‌లోని శిశు సంరక్షణాలయంపై ఉన్మాది బుల్లెట్లు కురిపించి 37 మంది ప్రాణాలు తీశాడు. మన దేశానికి చెందిన మేడెన్ ఫార్మాస్యూటికల్ సంస్థ ఉత్పత్తిచేసిన మందుల కారణంగా ఆఫ్రికా ఖండ దేశమైన గాంబియాలో 66 మంది చిన్నారులు గత నెలలో ప్రాణాలు కోల్పోయారు. మారణాయుధంతో పసికూనలపై విరుచుకుపడిన రాక్షసుడికీ... కేవలం లాభార్జన కాంక్షతో కలుషిత ఉత్పత్తులకు ఔషధమన్న ముద్రేసి అంటగట్టిన సంస్థ యజమానులకూ తేడా ఏమీ లేదు. కొన్ని ఔషధ సంస్థల టక్కుటమార విద్యలపైనా, వాటి ఉత్పత్తులపైనా ప్రజారోగ్య రంగంలో పనిచేస్తున్న దినేష్ ఎస్. ఠాకూర్ వంటి నిపుణులు తరచు హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ సరైన పర్యవేక్షణ కొరవడిన చోట అలాంటివారిది అరణ్యరోదనే అవుతోంది. ఇప్పుడు గాంబియా పసిపిల్లల ఉసురు తీసిన మందులకు భారత్‌లో విక్రయించడానికి అనుమతుల్లేవని అంటున్నారు. మన దేశంలో విక్రయానికి పనికిరాని ఉత్పత్తులు గాంబియాకు ఎలా పోయాయి? అంతర్జాతీయంగా మన పరువు తీసిన ఈ ఉదంతం తర్వాతనైనా పాలకులు మేల్కొనవలసి ఉంది. ఆగ్నేయాసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా ప్రాంత దేశాల్లో మన ఫార్మా రంగ సంస్థలదే పైచేయి. ఆఖరికి రష్యా, పోలాండ్, బెలారస్ వంటి దేశాల్లోనూ మన ఔషధాలే కనిపిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా మూడోవంతు ఫార్మా ఉత్పత్తులు మన దగ్గర నుంచే ఎగుమతి అవుతున్నాయి. అయినా పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థ అవసరమని పాలకులు గుర్తించలేదు!

పౌష్టికాహారలోపం, వాతావరణ కాలుష్యం, అపరిశుభ్రమైన నీరు, విషాహారం తదితరాలు ప్రజలను రోగాలబారిన పడేస్తాయి. రోగగ్రస్తులకు అందుబాటులో ఉంటున్న ఔషధాలు జబ్బు తగ్గించటం మాట అటుంచి ప్రాణాలు తీయడమంటే అంతకన్నా ఘోరమైన నేరం ఉంటుందా? కానీ చట్టంలో ఉండే లొసుగుల కారణంగా ఈ నేరం నిత్యం జరుగుతూనే ఉంది. ఆఫ్రికా దేశాల్లో, ముఖ్యంగా గాంబియాలో సరైన ఔషధ నియంత్రణ వ్యవస్థ లేదనీ, జవాబుదారీతనం అసలే లేదనీ కొందరంటున్నారు. కానీ మనదగ్గరమటుకు ఏం ఉన్నట్టు? హరియాణాలోని కుండ్లీలో ఉన్న తమ ఫ్యాక్టరీలో ఉన్నతమైన ప్రమాణాలు పాటిస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ ధ్రువీకరించిందని గాంబియా విషాదం వెల్లడి కాకముందు మేడెన్ ఔషధ సంస్థ వెబ్‌సైట్ ఘనంగా చెప్పుకొంది. ప్రస్తుతం దాన్ని తొలగించి హరియాణాలోనే ఉన్న మరో ఫ్యాక్టరీకి, హిమాచల్ ప్రదేశ్‌లో ఉన్న ఫ్యాక్టరీకి ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు దక్కిందని ఆ సంస్థ గొప్పలు పోతోంది. అంతేకాదు... తమకు ఐఎస్ఓ గుర్తింపు కూడా వచ్చిందంటున్నది. మేడెన్ సంస్థ ఫ్యాక్టరీలనుగానీ, దాని ఉత్పత్తులనుగానీ తనిఖీలు చేయలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. అటు ఐఎస్ఓ గుర్తింపు పొందిన ఔషధ సంస్థల జాబితాలో మేడెన్ లేనేలేదు. ప్రాణప్రదమైన ఔషధ సంస్థలు ఇలా ఇష్టానుసారం ప్రకటించుకుని జనం ప్రాణాలతో చెలగాటమాడుతుంటే అన్ని వ్యవస్థలూ గుడ్లప్పగించి చూస్తూ ఉండటం విస్మయం కలిగిస్తోంది. ఈ సంస్థపై గత దశాబ్దకాలంలో బిహార్, గుజరాత్, కేరళ, జమ్మూ, కశ్మీర్‌లు ఫిర్యాదులు చేశాయి. కానీ అవన్నీ నాసిరకమైన మందులకు సంబంధించిన ఫిర్యాదులు. ఇప్పుడు గాంబియా పిల్లల ప్రాణాలు తీసిన దగ్గు, జలుబు మందుల్లో అత్యంత ప్రమాదకరమైన డైథిలీన్ గ్లైకాల్, ఇథిలీన్ గ్లైకాల్ రసాయనాలు మోతాదుమించి ఉన్నాయని తేల్చారు. ఇవి కిడ్నీలనూ, ఇతర అంగాలనూ తీవ్రంగా దెబ్బతీయటంతో పిల్లలు మరణించారని ప్రాథమికంగా నిర్ధారణ అయింది. గ్లిసరిన్‌ను సాంద్రత బాగా తగ్గించి దగ్గు మందుల్లో వినియోగిస్తారు. గ్లిసరిన్‌తో పోలిస్తే ఈ రెండు రసాయనాలూ చవగ్గా లభిస్తాయని చాలామంది వాటివైపు మొగ్గుతున్నారు. అయితే పెయింట్లు, ఇంకులూ తయారీలో వినియోగించే ఈ రసాయనాలు ఏమాత్రం మోతాదు మించినా ప్రాణాంతకమవుతాయి. ఇప్పుడు గాంబియాలో జరిగింది అదే.

మనకు ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ(సీడీఎస్‌సీఓ) ఉంది. దేశంలో అనేకచోట్ల కేంద్ర ఔషధ పరీక్ష కేంద్రాలు (సీడీఎల్) ఉన్నాయి. రాష్ట్రాల స్థాయిలో ఔషధ తనిఖీ అధికారులున్నారు. దేశం వెలుపలికిపోయే ఔషధాల ప్రమాణాల నిర్ధారణకు సంబంధించి ఎన్నో నిబంధనలున్నాయి. కానీ మేడెన్ సంస్థ ఈ వ్యవస్థల కళ్లు కప్పగలిగింది. 2020లో జమ్మూ, కశ్మీర్‌లో ఈ దగ్గుమందు 14 మంది ప్రాణాలు తీసినప్పుడు ప్రజారోగ్య రంగ కార్యకర్త దినేష్ కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖకు సవివరమైన ఫిర్యాదు పంపితే దర్యాప్తు చేయటం మాట అటుంచి, కనీసం అది అందుకున్నట్టు చెప్పే దిక్కు కూడా లేకపోయిందంటే ఎలాంటి పరిస్థితులున్నాయో అర్థం చేసుకోవచ్చు. మన దేశంలో ఔషధ ప్రమాణాల నిర్ధారణకూ, నియంత్రణకూ 1940 నాటి డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ చట్టమే ఆధారం. 2004లో రాన్‌బాక్సీ సంస్థపై ఆరోపణలు వెల్లువెత్తి, ఆ తర్వాత అమెరికా, యూరోప్ దేశాల నియంత్రణ సంస్థలు గగ్గోలు పెట్టినప్పుడు ఆనాటి పాలకులు ఇదంతా కుట్రగా తేల్చిపారేశారు తప్ప ఫార్మా రంగ సంస్కరణలకు పూనుకోలేదు. వర్తమాన అవసరాలకు తగ్గట్టు కొత్త చట్టం తీసుకొచ్చే ప్రయత్నం చేయలేదు. వర్ధమాన దేశాలకు చవగ్గా ఔషధాలందిస్తుందన్న ఖ్యాతిని నిలుపుకోవాలన్నా, ప్రపంచ ఫార్మా రంగంలో పెరుగుతున్న మన వాటా రక్షించుకోవాలన్నా ఔషధ నియంత్రణ వ్యవస్థ ప్రక్షాళనకు తక్షణం పూనుకోవాలి. లేదంటే మన ప్రతిష్ఠ అడుగంటడం ఖాయం.

## గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, తిథి: శు.చతుర్దశి రా.3.22 వరకు
తదుపరి పౌర్ణమి, నక్షత్రం: పూర్వాభాద్ర సా.5.54 వరకు
తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.3.14 నుండి 4.47 వరకు
దుర్ముహూర్తం: ఉ.5.55 నుండి 7.27 వరకు
అమృతఘడియలు: ఉ.10.12 నుండి 11.15 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.42
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

# మంచి అడుగే... మార్పులు అవసరం

విశ్లేషణ



పవన్ దుగ్గల్

టెలికాం నియంత్రణ వ్యవస్థల్లో సంస్కరణలు, లోపాల సవరణలు లక్ష్యంగా టెలికాం డిపార్ట్‌మెంట్ 'ఇండియన్ టెలికమ్యూనికేషన్ బిల్, 2022' ముసాయిదా బిల్లును సిద్ధం చేసింది. టెలికమ్యూనికేషన్ రంగానికి సంబంధించిన న్యాయపరమైన అంశాలను ఆధునికీకరించే దిశగా వేసిన మేలి అడుగుగా దీన్ని అభివర్ణించవచ్చు. అయితే ఈ రంగం మిగిలిన ఏ రంగంతోనూ సంబంధం లేనట్టుగా ఈ ముసాయిదా బిల్లు సిద్ధమైనట్లు అనిపిస్తోంది. ఇప్పుడిప్పుడే ప్రాధాన్యం, ప్రాచుర్యం పొందుతున్న కృత్రిమ మేధ, బ్లాక్‌చెయిన్ వంటి టెక్నాలజీల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే దాని ప్రభావం టెలికమ్యూనికేషన్స్ రంగంపైనా పడే ప్రమాదం ఉంది. ముసాయిదా బిల్లులో ఈ అంశాల ప్రస్తావనే లేకపోవడం మనం గమనించాలి!

టెలికమ్యూనికేషన్ రంగంలో ఆధునికమైన, భవిష్యత్తు అవసరాలు తీర్చే సామర్థ్యం ఉన్న చట్టపరమైన నిర్మాణాత్మక వ్యవస్థను అభివృద్ధి చేయడానికి భారత ప్రభుత్వ సమాచార మంత్రిత్వశాఖ గత నెలలో 'ఇండియన్ టెలికమ్యూనికేషన్ ముసాయిదా బిల్లు–2022' ను రూపొందించి ఇప్పటికే ప్రజా సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించింది. అందుకోసం ప్రతిపాదిత బిల్లు సారాంశాన్ని దేశ పౌరులకు అందుబాటులో ఉంచింది. దీనివల్ల బిల్లులోని లోతుపాతులను పరిశీలించడానికీ, అభిప్రాయాలను వ్యక్తం చేయడానికీ నిపుణులకు, సాధారణ వినియోగదారులకు సైతం అవకాశం లభించినట్లయింది.

భారతదేశంలో సైబర్ భద్రతపై పూర్తిస్థాయి ప్రత్యేక చట్టం లేదు. అందువల్ల, టెలికాం రంగంలో సైబర్ భద్రత తాలూకు సమస్యలను పరిష్కరించడం మరింత అవసరం. ఈ నేపథ్యంలో టెలికాం రంగంలోనూ ఈ సైబర్ భద్రతకు సంబంధించిన ఆందోళనలను పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఏర్పడుతోంది. ఇంటర్నెట్, సైబర్ స్పేస్‌కు టెలికమ్యూనికేషన్ రంగం కీలకమన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే 'ఇండియన్ టెలికమ్యూనికేషన్ బిల్, 2022' ముసాయిదా బిల్లులో ఈ అంశాల ప్రస్తావనే లేకపోవడాన్ని మొదటగా మనం గమనించాలి! టెలికమ్యూనికేషన్ రంగం మిగిలిన ఏ రంగంతోనూ సంబంధం లేనట్టుగా ఈ ముసాయిదా బిల్లు సిద్ధమైనట్లు అనిపిస్తోంది. ఇప్పుడిప్పుడే ప్రాధాన్యం, ప్రాచుర్యం రెండూ పొందుతున్న కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆధారితాలు, బ్లాక్‌చెయిన్ వంటి టెక్నాలజీల విషయంలోనూ నిర్లక్ష్యం వహిస్తే దాని ప్రభావం టెలికమ్యూనికేషన్స్ రంగంపైనా పడే ప్రమాదం ఉంది.

భారతదేశం ఒక అనుసంధానిత టెలికాం పర్యావరణ వ్యవస్థ వైపు కదులుతున్నప్పుడు, కృత్రిమ మేధపై ఆధారపడటం అన్నది పెరుగుతున్నప్పుడు ప్రతిపాదిత చట్టం కొత్త సాంకేతికతల ఆగమనానికి సంబంధించినదిగా ఉండేలా విస్తృతమైన భవిష్యత్ ప్రణాళికలు ఉండాలి కదా.

కృత్రిమ మేధ, బ్లాక్‌చెయిన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి టెక్నాలజీలు టెలికమ్యూనికేషన్స్ రంగంపై చూపే ప్రభావాలు, కొత్త టెక్నాలజీల అవసరాన్ని గుర్తించేందుకు తగిన అంశాలు ఈ ముసాయిదా బిల్లులో లేవన్నది స్పష్టం. దేశంలో టెలికాం రంగం ఏకీకృతమయ్యే దిశగా వెళుతున్న, కృత్రిమ మేధపై ఆధారపడటమూ పెరిగిపోయిన ఈ దశలో టెలికామ్ ముసాయిదా బిల్లు దార్శనికంగానూ, విశాల దృక్పథంతోనూ ఉండి ఉంటే ఈ కొత్త టెక్నాలజీల వ్యాప్తికి మరింత ఉపయోగకరంగా ఉండేది.

సమాచార వ్యవస్థకు కీలకమైన అంశమైన టెలికమ్యూనికేషన్స్ భారతీయ సైబర్ సార్వభౌమత్వంలోనూ ఎంతో ముఖ్యమైంది. అయితే ఈ రంగానికి తగినంత ప్రాధాన్యం లభించడం లేదు. టెలికమ్యూనికేషన్స్ నెట్‌వర్క్‌లపై తరచూ దాడులు జరుగుతున్నాయి.



అయినా మన సైబర్ సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు తగిన న్యాయపరమైన సౌకర్యాలు లేవు. భద్రత, సార్వభౌమత్వాన్ని కాపాడుకునే దిశగా ముందుకు వెళ్లాలంటే ఈ ముసాయిదా బిల్లులో నిర్దిష్ట ప్రమాణాలను ఏర్పాటు చేయడం ఎంతైనా అవసరం.

ముసాయిదా బిల్లులో టెలికమ్యూనికేషన్స్‌కి సంబంధించిన మౌలిక సదుపాయాల సైబర్ సెక్యూరిటీకి ఎలాంటి ఏర్పాట్లూ లేవు. వీటిని కాపాడుకునేందుకు ఏ రకమైన చర్యలనూ ఈ ముసాయిదా చట్టంలో నిర్దేశించలేదు. సైబర్ సెక్యూరిటీ చట్టం లేనే లేని నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యత ఏర్పడుతోంది. సైబర్ సెక్యూరిటీకి భంగం కలిగితే, లేదా నెట్‌వర్క్‌లోకి చొరబాట్లు జరిగితే ఆయా సేవలందించే వారి బాధ్యత ఏమిటన్నది కూడా ఈ చట్టంలో స్పష్టం చేయలేదు. జాతీయ భద్రత, అందులో టెలికమ్యూనికేషన్స్ పాత్రలను పరిగణలోకి తీసుకున్నా ఈ అంశాలకు ప్రాధాన్యం లభించి ఉండాల్సింది. దీనినే ఇంకోలా చెప్పాలంటే... టెలికమ్యూనికేషన్, టెలీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నెట్‌వర్క్, సేవల భద్రత, సంరక్షణల కోసం ఎటువంటి పరిమితులనూ నిర్దేశించలేదు. సైబర్ భద్రత ఉల్లంఘనల సందర్భంలో సర్వీస్ ప్రొవైడర్ల బాధ్యత ఏ మేరకు ఉంటుందో కూడా స్పష్టం చేయలేదు. జాతీయ భద్రతతో టెలికమ్యూనికేషన్‌ల సంబంధం అత్యంత కీలకమైనది. అయితే ఈ ముసాయిదా జాతీయ భద్రతను ఎలా రక్షించవచ్చనే దానిపై అరకొరగా మాత్రమే వివరణలు కనిపిస్తున్నాయి!

ప్రతిపాదిత టెలికమ్యూనికేషన్స్ ముసాయిదాకు ప్రత్యేక హోదా ఇవ్వడం మరిన్ని చిక్కులకు దారితీసే ప్రమాదం ఉంది. ఈ హోదా కారణంగా ఇతర చట్టాలన్నింటి కంటే ఇది ఉన్నతమైందిగా మారుతుంది. ఈ క్రమంలోనే ఈ బిల్లు 2000లో తీసుకొచ్చిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్‌తోనూ వైరుద్ధ్యానికి గురయ్యే అవకాశం ఉంది. కాబట్టి, ఈ ముసాయిదా బిల్లు కాస్తా చట్టంగా మారే లోపు ఈ రకమైన వైరుద్ధ్యాన్ని నివారించాల్సిన అవసరముంది. అంతేకాదు... ఈ ముసాయిదా చట్టంలో డ్యూ డిలిజెన్స్‌కు సంబంధించిన అంశాలను సక్రమంగా నిర్వచించనూ లేదు. డూ నాట్ డిస్టర్బ్ రిజిస్టర్ నిర్వహణనే ఉదాహరణగా తీసుకుంటే ఇందులో వినియోదారుల రక్షణకు తగిన ఏర్పాట్లు లేవు. రిజిస్టర్‌ను సమర్థంగా అమలు చేసే విషయంలోనూ ప్రమాణాలు స్పష్టంగా లేవు. గతంలో ఉన్న 'డూ నాట్ కాల్' రిజిస్ట్రీ విఫలమైన నేపథ్యంలో తాజా చట్టంలోని లోటుపాట్లకు ఎక్కువ ప్రాముఖ్యత ఏర్పడుతోంది. టెలికాం ఎకోసిస్టమ్‌లోనూ వినియోగదారుల రక్షణకు సంబంధించిన అంశాలపై పెద్దగా దృష్టి పెట్టినట్లు కనిపించదు. టెలికాం సేవలు పొందే క్రమంలో తమ గుర్తింపును రుజువు చేసుకునేందుకు తప్పుడు సమాచారం ఇవ్వకపోవడం వినియోగదారుల బాధ్యతేనని ఈ ముసాయిదాలో పేర్కొన్నారు. అలాగైతే ఐటీ చట్టం, ఐపీసీల కింద దీనిని నేరంగా కూడా పరిగణించాల్సిన అవసరం ఉంది. అలాగే బిల్లును రూపొందించేటప్పుడు టెలికమ్యూనికేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ భారీ లక్ష్యాలను ఎలా చేరుకోవడం అనే దానిపై మరికొంత స్పష్టంగా ఉండాల్సింది. ప్రతిపాదిత బిల్లులో పేర్కొన్న నేరాలలో ఎక్కువ భాగం బెయిలు ఇవ్వదగినవే కనుక... కేసును వెనక్కు తీసుకునే నిర్ణయానుకూలతకు కాకుండా, నేర నిరోధానికి ప్రాధాన్యం ఇవ్వవలసింది.

ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలూ టెలికమ్యూనికేషన్ రంగం మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోకుండా చూసేందుకు ఏం చేయాలన్నది కూడా ఈ ముసాయిదా బిల్లులో కనిపించడం లేదు. బిల్లులోని పలు నేరాలకు బెయిల్ లభిస్తుంది. అయితే ప్రతి నేరానికీ జరిమానాలు విధించడం ద్వారా ఈ చట్టం నేరాలు జరక్కుండా చూసే దిశగా కాకుండా జరిమానాలు వసూలు చేసే దిశగా ఉందని అనిపిస్తుంది. సెక్షన్ 38లో సివిల్ లయబిలిటీ ప్రస్తావన ఉన్నా... కేంద్రం ఈ విషయంలో ఏం చేయాలన్న విషయంలో స్పష్టత కరవైంది. ముసాయిదా బిల్లులో ఈ అంశాలకూ చోటు దక్కాలి. అంతేకాకుండా... పబ్లిక్, ప్రైవేట్ రంగాల్లోని భాగస్వాములందరి ఆందోళనలను గుర్తిస్తూ తగిన మార్పులు చేర్పులు చేయాల్సిన అవసరం ఉంది. తద్వారా మాత్రమే ఈ కొత్త చట్టం సమర్థంగా మారగలదు.

అప్పీళ్లకు సంబంధించి సెక్షన్ –10లో వివరాలు ఉన్నాయి. అయితే అప్పీలేట్ అథారిటీకి సంబంధించిన వివరాలు మాత్రం స్పష్టం చేయలేదు. అంతేకాకుండా... తమకు జరిగిన నష్టాలకు తగిన పరిహారాన్ని కోరే ప్రాథమిక హక్కును కూడా వినియోగదారులకు లేకుండా చేశారు. అంటే టెలికమ్యూనికేషన్ వ్యవస్థకు సంబంధించి వినియోగదారుల రక్షణ అన్న విషయానికి తగినంత ప్రాధాన్యం ఇవ్వలేదన్నమాట. ఇప్పుడున్న వినియోగదారుల చట్టాలతోనూ పెద్దగా ప్రయోజనం లేకపోవడం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం. మొత్తమ్మీద చూస్తే... ఈ చట్టం సరైన దిశగా వేసిన ముందడుగనే చెప్పాలి. కానీ కొన్ని మార్పులు చేర్పులు అవసరమవుతాయి. తద్వారా మాత్రమే మనం సమర్థమైన చట్టాన్ని చేసే అవకాశం ఏర్పడుతుంది.

వ్యాసకర్త సైబర్ న్యాయ నిపుణులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### పథ సారథి



గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీజీ ప్రమాణ స్వీకారం చేసి నేటికి (అక్టోబర్ 7) 21 ఏళ్లు. నాటి కర్మయోగి నేటి నవ భారత పథ సారథి.
– వివేక్ పరాడ్కర్, నేషనలిస్ట్

### ఇక్కడే సాధ్యం!



హిందువులకు పర్వ దినమైన నవరాత్రి రోజు 10,000 మంది హిందువులను బౌద్ధ మతంలోకి మార్చానని కేజ్రీవాల్ మంత్రివర్గంలోని రాజేంద్రపాల్ గౌతమ్ చెప్పుకొంటున్నారు. ఇకపై హిందూ దేవుళ్లను దేవుళ్లుగా పరిగణించబోమని వారి చేత ప్రమాణం కూడా చేయించారట! మెజారిటీ వర్గంపై ఇలాంటి దాడులు ఎక్కడైనా జరుగుతాయా!!
– శశాంక్ శేఖర్ ఝా, న్యాయవాది

### ప్రసంగ యాత్రలు



మూడు రోజుల పర్యటన కోసం అమిత్ షా శుక్రవారం అస్సాం వెళ్లారు. మోదీ వచ్చే సోమవారం నుంచి మూడు రోజుల పర్యటనకు గుజరాత్ వెళుతున్నారు. శుష్కమైన ప్రయాణాలు, సునాయాస ప్రసంగాలతో వారు తమను మభ్యపెడుతున్నారని తెలుసుకున్న ఈ దేశ యువత రాహుల్ వెంట నడవాలని గట్టిగా తీర్మానించుకున్నట్లే ఉంది.
– అమర్‌సింగ్ చౌహాన్, సోషల్ వర్కర్

### గ్రీన్ ఇండియా



దేశవ్యాప్తంగా 777కు పైగా ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్న హరియాణాలోని పీఎంఐ ఎలక్ట్రో మొబిలిటీ కంపెనీ.. హైదరాబాద్‌లోని ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ తర్వాత దేశంలోనే రెండవ అతి పెద్ద ఎలక్ట్రిక్ బస్సుల ఉత్పత్తిదారుగా, ఆపరేటర్‌గా నిలిచింది. వారివే మరో 25 కొత్త బస్సులు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే చేతుల మీదుగా సూరత్ రోడ్లపై నేడు పరుగులు తీశాయి.
– పూజ, పర్యావరణ ప్రేమికురాలు

### నిర్విరామ పోరాటం



నోబెల్ కమిటీ శాంతి బహుమతిని ప్రకటించడానికి ముందు వరకు కూడా ఉక్రెయిన్‌లోని సెంటర్ ఫర్ సివిల్ లిబర్టీస్ సంస్థ మానవ హక్కుల కోసం పాటు పడుతోంది. చైనాలోని వీగర్ ముస్లిం హక్కుల పరిరక్షణ కోసం ఐక్యరాజ్య సమితిని డిమాండ్ చేస్తూ తన తాజా ట్వీట్‌ను పెట్టింది.
– ఆర్థర్ కరితొనోవ్, ఉక్రెయిన్ యాక్టివిస్ట్

### కొత్త అనుభూతి



త్రీడీ బ్రౌజర్ బేస్డ్ ప్లాట్‌ఫామ్ 'డిసెంట్రాలాండ్'పై 'షెమారూ వర్చువల్ థియేటర్' లాంచ్ అయింది! ముంబైలోని 'షెమారూ ఎంటర్‌టైన్‌మెంట్'... మెటావర్స్ టెక్నాలజీతో చిత్రాలను ప్రదర్శించడానికి ప్రారంభ చిత్రంగా 'జబ్ వియ్ మెట్'ను ఎంపిక చేసుకుంది. సినీ ప్రేమికులు ఇకపై కథానాయక, నాయికలు నేరుగా తమను స్పృశించిన అనుభూతిని పొందవచ్చు.
– రీనిష, మూవీ లవర్

### సత్యం వైపు



కర్ణాటకలోని మాండ్యా జిల్లాలో రాహుల్‌గాంధీ పాదయాత్ర చేస్తుండగా గౌరీ లంకేశ్ తల్లి ఇందిర, సోదరి కవిత వచ్చి ఆయన్ని కలిశారు. వాళ్లను కలుపుకుని అడుగులు వేయడం ద్వారా... ద్వేషం, హింస అన్నవి సత్యాన్ని ఏనాటికీ దాచిపెట్టలేవని రాహుల్ చాటి చెప్పినట్లయింది.
– ధన్యా రాజేంద్రన్, ఎడిటర్

# మానవ హక్కుల వకీలు

సందర్భం



జె.జె.సి.పి. బాబూరావు

అసాధారణ మేధస్సు, నిరంతర అధ్యయనం, విస్తృత విషయ పరిజ్ఞానం, వాగ్ధాటి, రచనా కౌశలం, ఆత్మీయత, ఆచరణశీలత, నిబద్ధత, నిమగ్నత, కార్యదీక్ష, అంకితభావం, మానవీయతా సుగుణం వంటి లక్షణాలన్నింటినీ తనలో మూర్తీభవింపజేసుకున్న అపురూప మేధావి బాలగోపాల్. కశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా తలెత్తిన హక్కుల ఉల్లంఘనలపై ఆయన ఉద్యమించారు. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హక్కుల ఉద్యమాలకు ఆయన దశ–దిశని నిర్దేశించి వెన్నుదన్నుగా నిలిచారు.

బాలగోపాల్ మధ్య తరగతి పండిత కుటుంబంలో 1952, జూన్ 10 నాడు నాగమణి, పార్థనాథశర్మ దంపతులకు జన్మించారు. అయినా ఆయన నిరంతరం పేద, దళిత, గిరిజన, మైనారిటీ, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు. ఆయన గణితశాస్త్ర విద్యార్థి అయినా... చరిత్ర, తత్వశాస్త్రం, అర్థశాస్త్రాలను విస్తృతంగా అధ్యయనం చేసి సమాజ పోకడలను సునిశితంగా పరిశీలించారు. రాజ్యాంగంలో హక్కుల అమలుకు పటిష్ఠమైన చర్యలు తీసుకున్నా నిరంకుశ ప్రభుత్వాల అణచివేత విధానాల వల్ల పౌరులు ఆయా హక్కులు పొందలేకపోవడాన్ని చూసి చలించిపోయారు.

బాలగోపాల్ వరంగల్‌లోని రీజినల్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎమ్మెస్సీ అప్లైడ్ మాథ్స్‌ని అభ్యసించి అక్కడే డాక్టరేట్ చేస్తున్న క్రమంలో రాడికల్ విద్యార్థి సంఘం కార్యకలాపాలను చూస్తూ వాటికి ప్రభావితులయ్యారు. కమ్యూనిస్టులు వాస్తవాన్ని అతిశయం చేసి చెప్తారని మొదట్లో నమ్మిన బాలగోపాల్... కమ్యూనిస్టులు తమ విశ్వాసాల కోసం ప్రాణాలు పణంగా పెట్టడాన్ని గమనించి ముఖ్యంగా విప్లవ కమ్యూనిస్టుల పట్ల తన వైఖరిని పూర్తిగా మార్చుకున్నారు. రాడికల్ విద్యార్థి సంఘం నాయకులు సూరపనేని జనార్ధన్ ఎన్‌కౌంటర్, జన్ను చిన్నాలు హత్యా సంఘటనల తర్వాత ప్రజల కోసం ఒక క్రియాశీల కార్యకర్తగా పనిచేయాలని బాలగోపాల్ బలంగా నిర్ణయించుకొని 1981లో 'ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం'లో చేరారు. వరంగల్ రాజకీయ పరిస్థితులు లెక్కల మేధావిగా ఉన్న బాలగోపాల్‌ని హక్కుల కార్యకర్తగా తీర్చిదిద్దాయి. 1983లో ఖమ్మంలో జరిగిన పౌర హక్కుల సంఘం రాష్ట్ర రెండవ మహాసభలో ఆయన ఆ సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో తాను చేస్తున్న గణితశాస్త్ర అధ్యాపక ఉద్యోగం ఉద్యమాలకు అడ్డు రావడంతో ఆ ఉద్యోగాన్ని సైతం తృణీకరించి పూర్తి కాలపు హక్కుల కార్యకర్తగా మారారు. బాలగోపాల్ పౌర హక్కుల సంఘంలో గుణాత్మక మార్పులు తీసుకువచ్చి హక్కుల ఉద్యమంలో నూతన ఒరవడితో ఉద్యమించారు. కానీ కాల క్రమంలో తానే తీర్చిదిద్దిన పౌర హక్కుల సంఘం నుండి ఆయన వైదొలిగి 1998, అక్టోబర్ 11 నాడు 'మానవ హక్కుల వేదిక'ను స్థాపించారు.

బాలగోపాల్ పౌర హక్కుల సంఘంలో పనిచేస్తున్న సమయంలో బెంగళూర్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న వివేకానంద న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ డిగ్రీని అభ్యసించారు. 1997లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా తన పేరుని నమోదు చేయించుకున్నారు. ఆయన న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించక



పూర్వమే చట్టాలు, న్యాయశాస్త్రంలో ఉన్న అనుపానులు, తర్కాన్ని సమగ్రంగా అవగాహన చేసుకోవడం వల్ల... పెద్దగా సీనియర్ న్యాయవాదుల అవసరం రాలేదు. కాని చట్టం పని విధానంలో ముందుకు వెళ్తున్నప్పుడు ప్రొసీజర్ విధానంలో ఆయన సీనియర్ న్యాయవాది కేజీ కన్నాబిరాన్ దగ్గర సలహాలు తీసుకొని ఆ ప్రకారం ముందుకు సాగారు.

బాలగోపాల్ ప్రధానంగా హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన కేసులలో బాధితుల పక్షం నిలబడి చట్ట ఫలితాలను వారికి అందించారు. దళితులు, గిరిజనులు, కార్మికులు, ఉద్యోగులు, భూవివాదాలకు సంబంధించిన అన్ని కేసులను ఆయన వాదించారు. అలాగే లేబర్ కోర్ట్, ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, లేబర్ కమిషన్ ఆఫీసుల కేసులను కూడా ఆయన వాదించారు. నక్సలైట్లకు సంబంధించి అనేక హెబియస్ కార్పస్ పిటిషన్లను వేసి సబంధిత వ్యక్తులను కోర్టులకు హాజరుపరిచేలా నిరంతర కృషి చేశారు.

చుండూరు హత్యాకాండ కేసులో బాలగోపాల్ బాధిత దళితులకు అండగా నిలబడి హైకోర్టులో అత్యున్నత వాదనలు వినిపించి దళిత హక్కులకు బాసటగా నడిచారు. అదే విధంగా 'షెడ్యూల్డ్ ట్రైబల్స్ అండ్ అదర్ ట్రెడిషనల్ ఫారెస్ట్ డ్వెల్లర్స్ యాక్ట్'ని అమలు చేయడం కోసం గిరిజనులు చేసిన పోరాటానికి ఆయన బాసటగా నిలిచారు. కోర్టులో ఆ చట్టాన్ని గెలిపించడంలో అసామాన్యమైన కృషి చేశారు. ఈ చట్టం ద్వారా గిరిజనులకు 2009లో భూములు పంచబడ్డాయి.


బాలగోపాల్ చేపట్టిన ముఖ్యమైన కేసులలో అత్యంత ముఖ్యమైన కేసు ఎన్‌కౌంటర్‌ల కేసు. 'పోలీసులకు ప్రాణం తీసే హక్కు లేదనీ, పోలీసులు ఎన్‌కౌంటర్‌ల నుండి తప్పించుకోవడానికి వీలు లేదనీ, పోలీసులపై కూడా హత్యాచారం కింద కేసులు పెట్టవచ్చ'నీ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో ఆయన బలమైన వాదనలు వినిపించి 'పోలీసులపై కూడా న్యాయ విచారణని జరిపించాలి' అనే తీర్పుని తీసుకురాగలిగారు. ఆ తీర్పు రావడం వెనకాల బాలగోపాల్ 30 ఏళ్ల నిర్విరామ కృషి ఉంది. అనేక హక్కుల సంఘాలు మిళితమైన ఈ కేసులో బాలగోపాల్‌తో పాటు కేజీ కన్నాబిరాన్, బొజ్జా తారకం తదితరులు తమ వాదనలు వినిపించారు.

హక్కుల నిరాదరణకు గురైనప్పుడు ప్రజలు చైతన్యంతో గొంతెత్తి ప్రశ్నిస్తే హక్కులు అమలు కాబడుతాయని బాలగోపాల్ విశ్వసించారు. ప్రజా హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న ఆయన 2009, అక్టోబర్ 8 నాడు తుది శ్వాస విడిచినా 'చెరగని హక్కుల స్ఫూర్తి'గా వెలుగొందుతున్నారు.

వ్యాసకర్త పరిశోధక విద్యార్థి । 94933 19690
(నేడు కె.బాలగోపాల్ వర్ధంతి)

# దాగదు ప్రతిభ

మనుషులు మూడు రకాలుగా ఉంటారు. కొందరు పుట్టుక తోనే గొప్పవారుగా పుడతారు. ప్రతిభావంతులుగా ఉంటారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లుగా వారి ప్రతిభ ఆబాల్యం అద్భుతంగా వ్యక్తమవుతుంది. వారు దిన దిన ప్రవర్ధ మానులయి తమకిష్టమైన రంగాలలో రాణిస్తూ ఇంటికీ, దేశానికీ మంచి పేరు తెస్తారు. చరిత్రలో తమ పేరు సుస్థిరం చేసుకుంటారు. వారు తమ ప్రతిభను ఎప్పటికప్పుడు సానపెట్టుకుంటూ ప్రకాశిస్తూ ఉంటారు. ప్రఖ్యాత చిత్రకారుడు పాబ్లో పికాసో, సంగీతంలో బాలమురళి, గణితంలో శ్రీనివాస రామానుజన్ ఇటువంటి వారు. వీరిని బాల మేధావులు అనవచ్చు.



జ్యోతిర్మయం

మరి కొందరు, స్వయం కృషితో, తమకు అభిరుచి ఉన్న రంగంలో రాణిస్తారు. ప్రతిభను ప్రయత్నంతో పెంచుకుంటారు. వీరికి ఇంట్లో అటువంటి వాతావరణం, ప్రోత్సాహం ఉండకపోవచ్చు. అయినా, తమ కిష్టమైన రంగంలో పేరు పొందినవారిని మార్గదర్శులుగా ఎన్నుకుని వారిలా గుర్తింపు పొందాలనీ, ప్రతిభావంతులు కావాలనీ కాంక్షిస్తూ తమ ఆశయాన్ని సాఫల్యం చేసుకుంటారు. తమ ప్రతిభ ద్వారా చరిత్రలో శాశ్వతంగా నిలిచి తరవాత తరాల వారికి మార్గం చూపుతారు.

ఇంకా కొందరుంటారు. వారికి ఎటువంటి ప్రతిభా నైపుణ్యాలు లేకపోయినా ప్రతిభా ముద్ర వారిపై ఆపాదించటం జరుగుతుంది. వారికుండే ధనం, సామాజిక హోదా, కీర్తి కాంక్ష, ఇతరులకు వీరితో ఉండే అవసరం వీరిని ప్రతిభావంతులను చేస్తుంది. వీరికి గుర్తింపు పొందాలనే తపన ఉంటుంది కాని ప్రయత్నం ఉండదు. వీరి చుట్టూ చేరిన సామాజికులే ప్రశంసలతో ముంచెత్తి వీరికి లేని ప్రతిభను ఆపాదిస్తారు. అయితే, ఈ గుర్తింపు శాశ్వతంగా నిలవదు. చిత్తశుద్ధితో విషయపరిజ్ఞానాన్ని పెంచుకుంటూ రాణించేవారి ప్రతిభా పాటవాలకు సమాజం ఎప్పుడూ పట్టం కడుతుంది.

సమాజంలో ఎందరో రచయితలు, కవులు, కళాకారులు, అధ్యాపకులు, మేధావులు, భిన్న రంగాలలో రాణిస్తున్న ప్రతిభా మూర్తులున్నారు. వీరందరి సమాహారమే ఆరోగ్యకర సమాజం!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి



కృష్ణా జిల్లా గోసాల గ్రామం వేణుగోపాలస్వామినగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి



శ్రీకాకుళం జిల్లా గోపీనాథపురంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

## సమస్యలను పరిష్కరిస్తూ.. అభివృద్ధిని వివరిస్తూ..

### ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం

'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజల ఇళ్ల వద్దకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ఆత్మీయ స్వాగతం లభిస్తోంది. మూడేళ్లలో సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా చేసిన మంచిని వివరిస్తూ.. ఇక ముందు కూడా ఇదే ఒరవడి కొనసాగుతుందని చెబుతూ ప్రజాప్రతినిధులు ముందుకు సాగారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్లే తామంతా సంతోషంగా జీవిస్తున్నామని ప్రజలు వివరించారు. దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పరిష్కరిస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

- సాక్షి, నెట్‌వర్క్



శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



కర్నూలు జిల్లా ఆదోనిలో ఓ వృద్ధుడిని ఆప్యాయంగా పలకరించి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

## విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. వివిధ జిల్లాల్లోని 8 విత్తనాల దుకాణాలు, 32 ఎరువుల దుకాణాలు, 27 పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి స్టాక్, రికార్డులు పరిశీలించారు. నిబంధనలను ఉల్లంఘించిన ఐదు దుకాణాలపై వినియోగదారుల హక్కుల చట్టం కింద కేసు నమోదు చేశారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పష్టం చేశారు.

## హారిస్‌కు యూనిసెఫ్ బెస్ట్ డెలిగేట్ అవార్డు




హారిస్‌కు ప్రదానం చేసిన సర్టిఫికెట్

కడప కార్పొరేషన్: కడపకి చెందిన మహమ్మద్ హారిస్‌కు యూనిసెఫ్ బెస్ట్ డెలిగేట్ అవార్డు లభించింది. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్(యూనిసెఫ్) ఆధ్వర్యంలో యూత్ యునైటెడ్ నేషన్స్ డెలిగేట్స్ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కార్యక్రమానికి భారత్ నుంచి పాల్గొన్న మహమ్మద్ హారిస్ ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధంలో బలవుతున్న చిన్నారులు, వారి పరిరక్షణపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. ప్రపంచ దేశాల నుంచి 250 మంది పాల్గొన్న ఈ సమావేశంలో యూనిసెఫ్ బృందం హారిస్‌ను గురువారం సత్కరించి బెస్ట్ డెలిగేట్ అవార్డు అందజేసింది.

## 'ఆలయాలకు బ్రాండ్ అంబాసిడర్ బీజేపీయే'



సాక్షి,అమరావతి: 'బీజేపీ ఏమన్నా దేవాలయాలకు బ్రాండ్ అంబాసిడరా అని ప్రశ్నిస్తున్నారని.. అవును నిజంగానే బీజేపీ దేవాలయాలకు బ్రాండ్ అంబాసిడర్' అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. ఆలయాలకు సంబంధించి ఏ సమస్య వచ్చినా తామే స్పందిస్తున్నామని, ఆలయాల రక్షణ బీజేపీ బాధ్యతగా భావిస్తోందని తెలిపారు. కాణిపాకంలో అభిషేకం టికెట్ ధర పెంచేందుకు దేవదాయ శాఖ అభిప్రాయ సేకరణ కోరలేదని చెప్పగలరా అని ప్రశ్నించారు.

# మరో 2,091 ఆలయాల్లో 'నిత్య నైవేద్యం'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మరిన్ని ఆలయాల్లో స్వామివార్లకు నిత్య నైవేద్యాలు జరగనున్నాయి. ఆలయాల అభివృద్ధి, నిత్యం ధూప, దీప, నైవేద్యాలకు ప్రాధాన్యతనిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒకేసారి మరో 2091 ఆలయాలకు ఆర్థిక సహాయాన్ని అందించనుంది. తాజాగా గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ. 30 వేల ఆదాయం కూడా లేక నిత్య పూజలు జరగని ఈ ఆలయాలకు ధూప, దీప, నైవేద్యం పథకాన్ని (డీడీఎన్ఎస్) మంజూరు చేసింది. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పథకం ద్వారా ప్రతి ఆలయానికి స్వామివార్ల ధూప, దీప, నైవేద్యం ఖర్చులకు నెలకు రూ.2,000, పూజారి గౌరవ వేతనం మరో రూ. 3000 చొప్పున నెలకు రూ. 5000 ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుంది. ఆలయ పూజారి బ్యాంకు ఖాతాలో ఈ మొత్తం జమ చేస్తారు. అక్టోబరు నెల నుంచి ఇది అమల్లోకి వస్తుందని, నవంబరు ఒకటో తేదీ తర్వాత చెల్లింపులు జరుగుతాయని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలవారీగా జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆలయాల వివరాలు, పూజారి పేరు, అతని బ్యాంకు ఖాతా వివరాలను కూడా పేర్కొన్నారు.



దేవదాయ శాఖలో రిజిస్టర్ అయి ఉండి, గ్రామీణ ప్రాంతంలో రెండున్నర ఎకరాల లోపు మాగాణి భూమి, ఐదెకరాల లోపు మెట్ట భూమి ఉండి ఆలయానికి అన్ని రకాల ఆదాయం రూ. 30 వేలకు మించని ఆలయాలనే ప్రభుత్వం ఈ పథకానికి ఎంపిక చేసినట్టు దేవదాయ శాఖ అధికారులు వెల్లడించారు. ముందుగా జిల్లా దేవదాయ శాఖ అధికారులు ఆలయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారి ప్రతిపాదనలను కమిషనర్ కార్యాలయానికి పంపారు. వీటిని 11 మంది ఉన్నతాధికారులు పరిశీలించారు. ఒక్కొక్క అధికారి 20 ఆలయాలను ర్యాండమ్‌గా తనిఖీ చేసి నిర్ధారించుకున్న తర్వాతే తుది జాబితాను రూపొందించారు. ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా ఆలయాల ఎంపికను పారదర్శకంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

### అప్పుడు వైఎస్, ఇప్పుడు జగన్ ప్రభుత్వాల హయాంలోనే..

గ్రామీణ ప్రాంతాల్లో తగినంత ఆదాయం లేక నిత్య పూజలకు నోచుకోని ఆలయాలకు 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తొలిసారి ధూప, దీప, నైవేద్యం పథకాన్ని తీసుకొచ్చారు. ఉమ్మడి ఏపీలో తొలుత దాదాపు 3,600 ఆలయాలకు ఈ పథకాన్ని వర్తింపజేశారు. రాష్ట్ర విభజన సమయానికి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు 1,900 ఆలయాలకు ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందుతుండేది. 2014 తర్వాత అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కొత్తగా ఒక్క ఆలయానికి కూడా ఈ పథకాన్ని వర్తింపజేయలేదు. పైగా అప్పటి దాకా పనిచేస్తున్న పూజారులు చనిపోయిన ఆలయాలకు పథకాన్ని నిలిపివేయడం, ఇతర కారణాలతో 2019 ఎన్నికల సమయానికి ఆ ఆలయాల సంఖ్య 1,620కు తగ్గిపోయింది. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత మళ్లీ ఆలయాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. తాజా ఆలయాలతో కలిపి ఈ మూడేళ్లలో ప్రభుత్వం 2,747 ఆలయాలకు ధూప, దీప, నైవేద్యం పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో మొత్తం 4,367 ఆలయాలు ప్రయోజనం పొందుతున్నాయి.

# 498-ఎ దుర్వినియోగం అవుతోంది

- భర్త, అతని కుటుంబ సభ్యులను వేధించే ఆయుధంగా వాడుతున్నారు
- ఆందోళన వ్యక్తంచేసిన న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి
- ఓ మహిళ తన భర్త కుటుంబ సభ్యులపై నమోదు చేసిన కేసు కొట్టివేత



సాక్షి, అమరావతి: వరకట్న వేధింపుల నిరోధానికి తీసుకొచ్చిన ఐపీసీ సెక్షన్ 498 - ఎ దుర్వినియోగం అవుతోందని హైకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. అసంతృప్త భార్యలు ఈ సెక్షన్‌ను రక్షణ కవచంగా కాకుండా ఓ ఆయుధంగా ఉపయోగిస్తున్నారని తెలిపింది. భర్త, అతని బంధువులను సులభంగా వేధించేందుకు, అరెస్ట్ చేయించేందుకు ఉపయోగిస్తున్నారని చెప్పింది. చిన్న చిన్న కారణాలతో ఈ సెక్షన్ కింద ఫిర్యాదులు చేస్తున్నారని పేర్కొంది. గుంటూరు జిల్లా మాచర్ల పోలీస్ స్టేషన్‌లో ఓ మహిళ తన భర్త కుటుంబ సభ్యులపై 498 - ఎ కింద పెట్టిన కేసును కొట్టేసింది. పిటిషనర్లపై తదుపరి ప్రొసీడింగ్స్ కొనసాగిస్తే అది కోర్టు ప్రక్రియ దుర్వినియోగమే అవుతుందని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ఇటీవల తీర్పు వెలువరించారు. వరకట్నం కోసం వేధిస్తున్నారంటూ మాచర్లకు చెందిన షేక్ నూర్జహాన్ చేసిన ఫిర్యాదు మేరకు 2020లో మాచర్ల పట్టణ పోలీసులు ఆమె భర్త, అతని తల్లిదండ్రులు, సోదరులు, వారి భార్యలను నిందితులుగా చేర్చారు. మాచర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. మాచర్ల కోర్టు విచారణ జరుపుతోంది. తమపై నమోదు చేసిన చార్జిషీట్‌ను కొట్టేయాలని కోరుతూ నూర్జహాన్ తోడికోడళ్లు షేక్ ఆరీఫా, ఆయేషా, వారి భర్తలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. ఫిర్యాదుదారు చేసినవన్నీ నిరాధార ఆరోపణలని న్యాయమూర్తి తేల్చారు. అదనపు కట్నం వేధింపుల్లో పిటిషనర్లు ఆమె భర్తకు సహకరించారని నిరూపించేందుకు ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. వారిపై కేసు కొట్టేస్తున్నట్లు తన తీర్పులో పేర్కొన్నారు.

# శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

- స్వామివారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు సీజే, ముగ్గురు జడ్జిలు
- ఢిల్లీ హైకోర్టు జడ్జి, సింగపూర్ మంత్రి కూడా...

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు న్యాయప్రముఖులు దర్శించుకున్నారు. శ్రీవారి వాహన సేవలోనూ పాల్గొన్నారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ జయసూర్య, జస్టిస్ వి.శ్రీనివాస్, జస్టిస్ యు.దుర్గా ప్రసాదరావు, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత్ మిశ్రా, సింగపూర్ మంత్రి షణ్ముగం ఉన్నారు. తెలంగాణ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి, ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఒలింపియాడ్ టోర్నమెంట్ డైరెక్టర్ భరత్‌సింగ్ చౌహాన్, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి కూడా స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, టీటీడీ అధికారులు శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, శ్రీవారి చిత్రపటంతో సత్కరించారు. అనంతరం వీరు వాహన సేవలో పాల్గొన్నారు.





ఆలయం వెలుపల కుటుంబంతో జస్టిస్ జయసూర్య, సింగపూర్ మంత్రి షణ్ముగం







ఆలయం వెలుపల కుటుంబంతో జస్టిస్ శ్రీనివాస్, జస్టిస్ స్వర్ణకాంత్ మిశ్రా, జస్టిస్ దుర్గా ప్రసాదరావు

### తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. పెరటాసి మాసం మూడవ శనివారంతోపాటు వరుస సెలవులు రావడంతో తిరుమల భక్తులతో కిటకిటలాడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2, నారాయణగిరి ఉద్యానవనాల్లోని అన్ని షెడ్లు భక్తులతో నిండిపోయాయి. శుక్రవారం కూడా క్యూలైన్లు శిలాతోరణం వద్దకు చేరుకున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా టీటీడీ అన్నప్రసాదాలు, పానీయాలను పంపిణీ చేస్తోంది. శ్రీవారి దర్శనానికి దాదాపు 48 గంటల సమయం పడుతోంది. తిరుమల శ్రీవారిని గురువారం అర్ధరాత్రి వరకు 72,195 మంది దర్శించుకోగా, 41,071 మంది తలనీలాలు సమర్పించారు. హుండీల్లో కానుకలు రూ.2.17 కోట్లు వచ్చాయి.

## క్లుప్తంగా...

### వాణిజ్యంపై స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా అభిషేక్ సింఘ్వీ!

**న్యూఢిల్లీ:** వాణిజ్యంపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం చైర్మన్‌గా సీనియర్ నేత అభిషేక్ మనూ సింఘ్వీని కాంగ్రెస్ పార్టీ నామినేట్ చేసింది. రసాయనాలు, ఎరువులపై పార్లమెంటరీ స్థాయీ సంఘం చైర్మన్ పదవి కాంగ్రెస్‌కు దక్కే అవకాశం ఉన్నప్పటికీ తమ నామినీపై ఆ పార్టీ నిర్ణయం తీసుకోలేదు. పలు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలను కేంద్రం ఇటీవలే పునర్ వ్యవస్థీకరించింది. హోంశాఖ, ఐటీ స్థాయీ సంఘాల చైర్మన్ పదవుల నుంచి కాంగ్రెస్ సభ్యులు అభిషేక్ సింఘ్వీ, శశి థరూర్‌ను తొలగించింది. వారి స్థానంలో బీజేపీ, శివసేన సభ్యులకు చైర్మన్‌గా అవకాశం కల్పించింది.

### లాలూ, రబ్రీలపై సీబీఐ చార్జిషీట్

**న్యూఢిల్లీ:** ఉద్యోగాల కుంభకోణంలో రైల్వే శాఖ మాజీ మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీ దేవి తదితర 14 మందిపై సీబీఐ చార్జిషీట్ నమోదు చేసింది. లాలూ కూతురు మిసా భారతి, రైల్వే శాఖ మాజీ జనరల్ మేనేజర్ కూడా నిందితుల జాబితాలో ఉన్నారు. రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో లాలూ యాదవ్.. తమ కుటుంబసభ్యుల పేరిట భూమిని బదలాయించిన అభ్యర్థులను రైల్వేశాఖలో గ్రూప్–డి ఉద్యోగాల్లో నియమించినట్లు సీబీఐ ఆరోపిస్తోంది.

### సీజేఐను సిఫార్సు చేయండి

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ యుయుయు లలిత్ నవంబర్‌లో పదవీ విరమణ నేపథ్యంలో తదుపరి సీజేఐను సిఫార్సు చేయాలని ఆయనను కేంద్రప్రభుత్వం కోరింది. ఈ మేరకు శుక్రవారం సీజేఐ లలిత్‌కు కేంద్ర న్యాయ శాఖ మంత్రి లేఖ రాశారని లా, జస్టిస్ విభాగం ట్వీట్‌చేసింది. ఇలాంటి విషయాన్ని ప్రభుత్వ శాఖ ఇలా ట్విట్టర్ వేదికగా వెల్లడించడం ఇదే తొలిసారి. మెమొరండమ్ ఆఫ్ ప్రొసిజర్(ఎంఓపీ) ప్రకారం సుప్రీంకోర్టులో తన తర్వాత అత్యంత సీనియర్ జడ్జిని ప్రస్తుత సీజేఐ.. తదుపరి సీజేఐగా సిఫార్సుచేస్తారు. ప్రస్తుతం సర్వోన్నత న్యాయస్థానంలో జస్టిస్ లలిత్ తర్వాత జస్టిస్ డీవై చంద్రచూడ్ అత్యంత సీనియర్ జడ్జి. ఎంఓపీ ప్రకారం ప్రక్రియ కొనసాగితే నవంబర్ తొమ్మిదో తేదీన సుప్రీంకోర్టు 50వ సీజేఐగా జస్టిస్ చంద్రచూడ్ బాధ్యతలు స్వీకరిస్తారు. రెండేళ్లపాటు పదవిలో కొనసాగి 2024 నవంబర్ పదిన ఆయన రిటైర్ అవుతారు. సుప్రీంకోర్టు జడ్జీలు 65 ఏళ్లకు, హైకోర్టు జడ్జీలు 62 ఏళ్ల వయసు రాగానే రిటైర్ అవుతారు. రిటైర్మెంట్ వయసు దగ్గరపడుతుండటంతో ప్రస్తుత సీజేఐ జస్టిస్ లలిత్ కేవలం 74 రోజులే ఈ పదవిలో కొనసాగనున్నారు.

### 'జ్ఞానవాపి' కేసులో విచారణ వాయిదా

**వారణాసి:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో బయటపడిన శివలింగ ఆకృతికి కార్బన్–డేటింగ్ పరీక్ష నిర్వహించాలంటూ దాఖలైన పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై లిఖితపూర్వకంగా స్పందించాలని అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీకి సూచించింది. మసీదు కాంప్లెక్స్‌లోని వజూఖానాలో ఈ ఏడాది మే 16న నిర్వహించిన సర్వేలో శివలింగం బయటపడిందని, ఇది ఎప్పటిదో నిర్ధారించేందుకు పరీక్ష నిర్వహించాలని విన్నవిస్తూ హిందూ మహిళ ఒకరు వారణాసి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం శుక్రవారం విచారణ చేపట్టింది. సివిల్ ప్రొసీజర్ కోడ్(సీపీసీ) ఆర్డర్ 26 రూల్ 10 కింద ఈ శివలింగంపై శాస్త్రీయ పరిశోధన చేయడానికి ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోర్టును కోరామని పిటిషనర్ తరపు న్యాయవాది విష్ణుశంకర్ జైన్ చెప్పారు.

### ఉత్తర కాశీ దుర్ఘటన.. 26కు చేరిన మృతులు

**ఉత్తరకాశీ:** ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీలో మంచు చరియలు విరిగిపడిన ఘటనలో శుక్రవారం మరో 10 మృతదేహాలను వెలికి తీయడంతో మృతుల సంఖ్య 26కు చేరింది. ఇందులో 24 మృతదేహాలు ట్రైనీలవి కాగా, రెండు ఇన్‌స్ట్రక్టర్లవని అధికారులు తెలిపారు. మరో ముగ్గురు ట్రైనీల ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాల్లో కొన్నిటిని గుర్తు పట్టాల్సి ఉందని చెప్పారు. అననుకూల వాతావరణంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని చెప్పారు. గాలింపు చర్యల్లో రెండు చీటా హెలికాప్టర్లు పాల్గొన్నాయన్నారు. మంగళవారం నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెయినీరింగ్‌కు చెందిన బృందం ద్రౌపదీ కా దండా–2 పర్వత శిఖరం నుంచి తిరిగి వస్తుండగా 17 వేల అడుగుల ఎత్తులో విరిగిపడిన కొండ చరియల కింద చిక్కుకున్న విషయం తెలిసిందే.

### ముగ్గురు సుప్రీంకోర్టు రిజిస్ట్రార్లు తిరిగి మాతృసంస్థలకు..

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టులో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ముగ్గురు రిజిస్ట్రార్లను తిరిగి మాతృసంస్థలకు పంపిస్తూ సీజేఐ లలిత్ ఆదేశాలు జారీ చేశారని అధికార వర్గాలు తెలిపాయి. సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ హయాంలో రిజిస్ట్రార్‌గా నియమితులైన సూర్యదేవర ప్రసన్న కుమార్ తిరిగి మాతృసంస్థ ఆల్ ఇండియా రేడియోలో బాధ్యతలు చేపట్టారు. ప్రసారభారతిలో జాయింట్ డైరెక్టర్ ప్రసన్నకుమార్‌కు జస్టిస్ రమణ సుప్రీంకోర్టులో అదనపు రిజిస్ట్రార్ హోదాతో పదోన్నతి కల్పించారు. జస్టిస్ రమణ సీజేఐగా బాధ్యతలు నిర్వహించిన కాలంలో ప్రసన్న మీడియా సంబంధ కార్యక్రమాలను చూసేవారు. ప్రసన్నను పాత హోదాకు పంపుతూ సెప్టెంబర్ 30వ తేదీన సీజేఐ ఆదేశాలు జారీ చేసినట్లు అధికార వర్గాలు వివరించాయి. ఆయనతోపాటు రిజిస్ట్రార్లు రాజేశ్ గోయెల్, అవనిపాల్ సింగ్‌లను కూడా మాతృసంస్థలకు పంపించారు. ఈ నిర్ణయం వెనుక కారణాలు మాత్రం వెల్లడికాలేదు.

# మానవ హక్కుల పోరాటాలకు నోబెల్ శాంతి బహుమతి

**బెలారస్ ఉద్యమకారుడు అలెస్ బియాల్ యాస్కీతోపాటు రష్యా, ఉక్రెయిన్ సంస్థలకు సంయుక్తంగా అత్యున్నత గౌరవం**

- బహుమతికి ఎంపికైన 'మెమోరియల్, 'సెంటర్ ఫర్ సివిల్ లిబర్టీస్' సంస్థలు
- ప్రకటించిన నార్వే నోబెల్ కమిటీ

**ఓస్లో:** మానవ హక్కుల పరిరక్షణ కోసం కొనసాగుతున్న ఉద్యమాలకు నోబెల్ కమిటీ అత్యున్నత గౌరవాన్ని కల్పించింది. బెలారస్ మానవ హక్కుల ఉద్యమకారుడు అలెస్ బియాల్‌యాస్కీ(60), రష్యా మానవ హక్కుల సంస్థ 'మెమోరియల్', ఉక్రెయిన్ సంస్థ 'సెంటర్ ఫర్ సివిల్ లిబర్టీస్'కు సంయుక్తంగా 2022 సంవత్సరానికి గాను నోబెల్ శాంతి బహుమతిని శుక్రవారం ప్రకటించింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రెండు దేశాల్లోని సంస్థలు ప్రపంచ ప్రతిష్టాత్మక బహుమానానికి ఎంపిక కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉక్రెయిన్‌పై దండెత్తుతున్న రష్యా అధినేత పుతిన్ ఏకపక్ష వైఖరిపై ఇదొక నిరసన అని నిపుణులు అంచనా వేస్తున్నారు. బెలారస్, రష్యా, ఉక్రెయిన్‌లో మానవ హక్కులు, ప్రజాస్వామ్యం, శాంతియుత సహజీవనం వంటి అంశాల్లో గొప్ప చాంపియన్లు అయిన ముగ్గురిని (ఒక వ్యక్తి, రెండు సంస్థలు) శాంతి బహుమతితో గౌరవిస్తుండడం ఆనందంగా ఉందని నార్వే నోబెల్ కమిటీ చైర్మన్ బెరిట్ రీస్–ఆండర్సన్ చెప్పారు. ఆమె మీడియాతో మాట్లాడారు. వారంతా సైనిక చర్యలను వ్యతిరేకిస్తూ మానవీయ విలువలు, న్యాయ సూత్రాల రక్షణ అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. దేశాల మధ్య శాంతి, సౌభ్రాతృత్వం వర్ధిల్లాలని ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆకాంక్షించారని గుర్తుచేశారు.



### బియాల్‌యాస్కీని విడుదల చేయండి

జైలులో ఉన్న అలెస్ బియాల్‌యాస్కీని విడుదల చేయాలని బెలారస్ పాలకులకు బెరిట్ రీస్–ఆండర్సన్ విజ్ఞప్తి చేశారు. బహుమతి బియాల్‌యాస్కీలో నైతిక స్థైర్యాన్ని పెంచుతుందని, ఆయనపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపించబోదని భావిస్తున్నట్లు తెలిపారు. రష్యా మానవ హక్కుల సంస్థకు శాంతి బహుమతి ప్రకటించడం ద్వారా.. శుక్రవారం 70వ పుట్టినరోజు జరుపుకుంటున్న పుతిన్‌కు ఉద్దేశపూర్వకంగా ఏదైనా సంకేతం పంపదలిచారా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా... ప్రజలకు మంచి చేసేవారికి బహుమతి ఇస్తుంటామని, అంతేతప్ప తాము ఎవరికీ వ్యతిరేకం కాదని, వ్యక్తుల పుట్టినరోజులతో తమకు సంబంధం లేదని బెరిట్ రీస్–ఆండర్సన్ బదులిచ్చారు. ఈ ప్రైజ్ పొందడం ద్వారా ఆయా సంస్థల వెనుక ఉన్న వ్యక్తులు వారు నమ్మినదాని కోసం మరింత ఉత్సాహంతో కృషి సాగిస్తారన్న నమ్మకం తమకు ఉందన్నారు. గత ఏడాది(2021) నోబెల్ శాంతి బహుమతిని సంయుక్తంగా అందుకున్న రష్యా జర్నలిస్టు దిమిత్రీ మురతోవ్, ఫిలిప్పైన్స్ జర్నలిస్టు మారియా రెస్సా అక్కడి ప్రభుత్వాల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాము పనిచేస్తున్న మీడియా సంస్థల్లో ఉద్యోగాలను కాపాడుకోవడానికి పెద్ద పోరాటమే చేయాల్సి వస్తోంది. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ కోసం సాగించిన పోరాటానికి వీరిద్దరికి నోబెల్ లభించింది.

### అంకితభావం గల ఉద్యమకారుడు

అలెస్ బియాల్‌యాస్కీ నేటి రష్యాలోని వైర్టిసిల్లాలో 1962 సెప్టెంబర్ 25వ తేదీన జన్మించారు. ఆ తర్వాత వారి కుటుంబం బెలారస్‌కు వలస వెళ్లింది. విద్యాభ్యాసం అనంతరం బియాల్‌యాస్కీ కొంతకాలం పాటు పాఠశాల ఉపాధ్యాయుడిగా, తర్వాత సైన్యంలో డ్రైవర్‌గా పనిచేశారు. 1980వ దశకం నుంచి బెలారస్‌లో ఆయన మానవ హక్కుల ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. 1996లో 'వియాస్నా హ్యూమన్ రైట్స్ సెంటర్' అనే ప్రభుత్వేతర సంస్థను స్థాపించారు. అంకితభావం కలిగిన మానవ హక్కుల, పౌరస్వేచ్ఛ, ప్రజాస్వామ్య ఉద్యమకారుడిగా ప్రజల్లో గుర్తింపు పొందారు. ఎన్నో పోరాటాలను ముందుండి నడిపించారు. హవెల్స్ ఫర్ హ్యూమన్ రైట్స్ అవార్డును 2013లో, నోబెల్‌కు ప్రత్యామ్నాయంగా భావించే రైట్ లైవ్లీహుడ్ అవార్డును 2020లో గెలుచుకున్నారు. ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలకు సారథ్యం వహిస్తున్న బియాల్‌యాస్కీని పన్నులు ఎగవేశారన్న కారణంతో బెలారస్ పాలకులు 2021 జూలై 14న నిర్బంధించారు. ఆయన ప్రస్తుతం ఎలాంటి విచారణ లేకుండా జైలులో మగ్గుతున్నారు. ఆయనను విడుదల చేయాలంటూ ప్రజలు డిమాండ్ చేస్తున్నా పాలకులు లెక్కచేయడం లేదు. ఎన్నో అవరోధాలు, బెదిరింపులు ఎదురైనా వెనక్కి తగ్గకుండా నమ్మిన సిద్ధాంతానికి బియాల్‌యాస్కీ కట్టుబడి ఉండడం విశేషం.

### సైనిక చర్యలకు వ్యతిరేకంగా పోరాటం

'మెమోరియల్' సంస్థ 1989 జనవరి 28న అప్పటి సోవియట్ యూనియన్ చివరిదశలో ఉన్న సమయంలో ఏర్పాటైంది. ప్రధానంగా ఇది న్యాయ సేవా సంస్థ. కమ్యూనిస్టు పాలకుల అణచివేత చర్యల వల్ల ఇబ్బందులు పడుతున్నవారికి అండగా నిలిచింది. రష్యాలో మానవ హక్కుల విధ్వంసంపై, రాజకీయ ఖైదీల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తోంది. సైనిక చర్యలకు వ్యతిరేకంగా పోరాడుతోంది. 'మెమోరియల్' ప్రధాన కార్యాలయం రష్యా రాజధాని మాస్కోలో ఉంది. సంస్థ బోర్డు చైర్మన్‌గా యాన్ రచిన్‌స్కీ వ్యవహరిస్తున్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో ఈ సంస్థను ఈ ఏడాది ఏప్రిల్ 5న రష్యా ప్రభుత్వం మూసివేసింది. అయినప్పటికీ 'మెమోరియల్' కార్యకలాపాలు అనధికారికంగా కొనసాగుతూనే ఉండటం విశేషం.

### యుద్ధంపై ఎక్కుపెట్టిన ఆయుధం

ఉక్రెయిన్‌లోని కొందరు శాంతి కాముకులు 2007లో 'సెంటర్ ఫర్ సివిల్ లిబర్టీస్'ను ఏర్పాటు చేశారు. అప్పట్లో దేశంలో అశాంతి రగులుతున్న తరుణంలో మానవ హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య ఉద్యమాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ సంస్థకు శ్రీకారం చుట్టారు. ఉక్రెయిన్ పౌర సమాజాన్ని బలోపేతం తదితరాలు సంస్థ ముఖ్య లక్ష్యాలు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మొదలైన తర్వాత ఈ సంస్థ మరింత క్రియాశీలకంగా పనిచేస్తోంది. సాధారణ ప్రజలపై రష్యా యుద్ధ నేరాలను రికార్డు చేసి, ప్రపంచానికి తెలియజేస్తోంది. ఈ యుద్ధ నేరాలకు రష్యాను జవాబుదారీగా మార్చేందుకు కృషి చేస్తోంది. యుద్ధానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన అసలైన ఆయుధం మానవ హక్కుల పోరాటమేనని 'సెంటర్ ఫర్ సివిల్ లిబర్టీస్' చెబుతోంది.

# ఆ సత్తా భారత్ సొంతం

- నాలుగో పారిశ్రామిక విప్లవానికి భారత్ సారథ్యం వహించగలదు
- ధీమా వ్యక్తంచేసిన ప్రధాని మోదీ



**కేవడియా(గుజరాత్):** ప్రపంచ నాలుగో పారిశ్రామిక విప్లవాన్ని భారత్ ముందుండి నడిపించగలదని, ఆ సామర్థ్యం భారత్ సొంతమని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని కేవడియాలో జరుగుతున్న ఇండస్ట్రీ 4.0 అనే సదస్సునుద్దేశిస్తూ ప్రధాని మోదీ వర్చువల్‌గా ఒక సందేశం పంపారు. అందులోని సారాంశం ఆయన మాటల్లోనే.. ' అధునాతన సాంకేతికత ఆలంబనగా నాలుగో పారిశ్రామిక విప్లవం మొదలవ్వాలి. సృజనాత్మక ఆలోచనలతోనే ఇది సాధ్యం. వేర్వేరు కారణాల వల్ల గత పారిశ్రామిక విప్లవాల్లో భారత్ భాగస్వామి కాలేకపోయింది. ఇండస్ట్రీ 4.0కు సారథ్యం వహించే సుదృఢ లక్షణాలు దేశానికి ఉన్నాయి. యువజనాభా, డిమాండ్, స్వేచ్ఛాయుత వాణిజ్యానికి బాటలుపరిచే కేంద్ర ప్రభుత్వం సమష్టిగా దీన్ని సుసాధ్యంచేయగలవు. ప్రపంచ వస్తు గొలుసు వ్యవస్థలో భారత్ కీలక భూమిక పోషించేలా చేయగల సమర్థత దేశీయ పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలకు ఉంది. ఇందుకోసం సంస్కరణలు తెస్తూ, రాయితీల తోడ్పాటు అందిస్తూ అధునాతన సాంకేతికతను సంతరించుకున్న ప్రపంచ తయారీ కేంద్రంగా భారత్‌ను తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషిచేస్తున్నాం' అని ప్రధాని మోదీ అన్నారు. '3డీ ప్రింటింగ్, మెషీన్ లెర్నింగ్, డేటా అనలైటిక్స్, ఎల్‌ఓటీ వంటి రంగాల్లో పారిశ్రామికాభివృద్ధితో ప్రపంచ తయారీ కేంద్రంగా భారత్ వృద్ధిచెందుతోంది' అని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే కార్యక్రమంలో అన్నారు. ఈ సందర్భంగా మంత్రి గుజరాత్ కోసం 75 , కర్ణాటక కోసం 100 ఈవీ బస్సులను ప్రారంభించారు. పుణెలోని ఇండస్ట్రీ 4.0(సీ4ఐ4) ల్యాబ్‌నూ మొదలుపెట్టారు. స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్‌పై భారీ పరిశ్రమల శాఖ ప్రత్యేక దృష్టిపెట్టింది.

**పర్యావరణహిత అభివృద్ధిని భారత్ చాటిచెప్పింది**

పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే ఆర్థికాభివృద్ధిని భారత్ సాధిస్తోందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. అక్టోబర్ రెండో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు భారత్ 'వైల్డ్‌లైఫ్ వీక్'ను పాటిస్తోంది. ఈ మేరకు దేశ ప్రజలకు మోదీ హిందీలో గురువారం ఇచ్చిన సందేశాన్ని కేంద్ర పర్యావరణశాఖ శుక్రవారం ట్వీట్ చేసింది. ఆ సందేశంలో మోదీ ఏం చెప్పారంటే.. 'పరిశ్రమలతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యం. అయితే, పరిశ్రమలతో పర్యావరణానికి ముప్పు పొంచి ఉంటుంది. కానీ, పర్యావరణానికి ప్రమాదం వాటిల్లకుండానే ఆర్థికాభివృద్ధి దిశగా పయనించడమెలాగో ప్రపంచానికి భారత్ సాధించి చూపింది. సరైన విధానపర నిర్ణయాలు, అమలుతోనే ఇది సాకారమైంది. తోటి జీవాల పట్ల, జీవావరణం, జీవ వైవిధ్యం మీద మనిషి మరింత దృష్టిసారించాలి. భారత్ గడిచిన ఎనిమిదేళ్లలో కొత్తగా 259 స్థలాలను అభయారణ్యాలుగా గుర్తించి సంరక్షణ బాధ్యతలు తీసుకుంది. పులుల సంఖ్యను రెట్టింపు చేసుకుంటూ లక్ష్యాన్ని నిర్దేశిత సమయంకంటే ముందే చేరుకున్నాం. ఆసియా సింహాలు, గజరాజుల సంఖ్యా పెరుగుతోంది' అని అన్నారు.

# జోడో యాత్రలో గౌరీ లంకేశ్ తల్లి



పాదయాత్రలో రాహుల్‌తో గౌరీ తల్లి, సోదరి

**మండ్య/శివాజీనగర:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని భారత్ జోడో యాత్ర శుక్రవారం కర్ణాటకలోని మండ్య జిల్లా నాగమంగలలో సాగింది. కె.మల్లేనహళ్లి నుంచి ఉదయం 7 గంటలకు ప్రారంభమైన యాత్ర నాగమంగలలోకి చేరుకోగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు కాంగ్రెస్ జెండాలను చేబూని, నినాదాలతో ఘనస్వాగతం పలికారు. పట్టణంలోని ఆంచె చిట్టినహళ్లి వద్ద యాత్రలో హత్యకు గురైన పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ తల్లి ఇందిర, సోదరి కవిత పాలుపంచుకున్నారు. కన్నడ వార పత్రిక 'లంకేశ్ పత్రికె' ఎడిటర్‌గా ఉన్న గౌరీ లంకేశ్ 2017లో దుండగుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇందిర చేతిని పట్టుకుని యాత్రలో రాహుల్ ముందుకు నడిచారు. దేశ నిజమైన ఆత్మకు ప్రాతినిధ్యం వహించే ఇటువంటి, అసంఖ్యాక ప్రజల తరఫున తాను నిలబడ్డానన్నారు. లంకేశ్ వంటి ప్రజల గొంతుకగా మారిన భారత్ జోడో యాత్రను ఎవరూ ఆపలేరని ఆయన ఉద్ఘాటించారు. లంకేశ్ సత్యం, స్వేచ్ఛ కోసం ధైర్యంగా నిలబడ్డారని అనంతరం ఆయన ట్వీట్ చేశారు. అంతకు ముందు రాహుల్‌గాంధీ ఎం.హోసూరు గేట్ వద్ద ఉన్న మోరి చెన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటకలో ఎస్సీ, ఎస్టీలకు జస్టిస్ నాగమోహన్ దాస్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని రాహుల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగమంగల తాలూకా కే.మల్లేనహళ్లిలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల పెంపుపై నాగమోహన్‌దాస్ కమిటీ సిఫార్సుల అమలుకు తక్షణమే శాసనసభా సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు.

**జోడో యాత్ర నుంచి రియల్ రాహుల్ ఉద్భవిస్తారు**

**చిట్టినహళ్లి:** భారత్ జోడో యాత్ర నుంచి అసలైన రాహుల్ గాంధీ ఉద్భవిస్తారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ శుక్రవారం చెప్పారు. తమ పార్టీ మానసికంగా బలపడడానికి ఈ యాత్ర దోహదపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. 'రాహుల్ పాదయాత్ర మెయిన్ షో, పార్టీ అధ్యక్షుడి ఎన్నిక సైడ్ షో' అని వ్యాఖ్యానించారు. ఈ యాత్ర ద్వారా కొత్త రాహుల్ కాదు, అసలైన రాహుల్ గాంధీ ఉద్భవిస్తారని తేల్చిచెప్పారు. పార్టీ మార్పు చెందుతోందని వివరించారు. రోడ్లపై, వీధుల్లో నడుస్తూ అధికార బీజేపీ నిర్వాకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని గుర్తుచేశారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తున్నామని చెప్పారు. ఇప్పుడు బీజేపీ గురించి తాము కాదు, తమ గురించే బీజేపీ మాట్లాడుతోందని, ఇది భారత్ జోడో యాత్ర సాధించిన అతిపెద్ద విజయమని ఉద్ఘాటించారు. ఇది ఎన్నికలకు సంబంధించింది కాదు, మానసికపరమైనది అని వెల్లడించారు. జోడో యాత్రలో సోనియా గాంధీ మళ్లీ పాల్గొంటారని చెప్పారు. తమ యాత్రకు లభిస్తున్న ప్రజా స్పందనను చూసి బీజేపీ బెంబేలెత్తిపోతోందని అన్నారు.

# 5 నిమిషాల్లో ఎలక్ట్రిక్ కారు చార్జ్!

**వాషింగ్టన్:** భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకు ఉద్దేశించిన ఒక అధునాతన సాంకేతికత సాయంతో విద్యుత్ కారును కేవలం ఐదు నిమిషాల్లో ఫుల్ చార్జ్ చేయొచ్చని నాసా ఆర్థికసాయంతో పరిశోధన చేసిన ఒక అధ్యయన బృందం ప్రకటించింది. ప్రస్తుతం అమెరికాలో రోడ్డు వెంట ఉన్న చార్జింగ్ స్టేషన్‌లో దాదాపు 20 నిమిషాలు, ఇళ్లలో అయితే గంటల తరబడి విద్యుత్ కార్లను చార్జ్ చేయాల్సి వస్తోంది. దాంతో ఇప్పటికీ భారత్‌లో కొందరు విద్యుత్ వాహనాలకు యజమానులుగా మారేందుకు సంసిద్ధంగా లేరు. ప్రస్తుతమున్న అధునాతన చార్జర్లు 520 ఆంపియర్ల కరెంట్‌నే బదిలీచేయగలవు. వినియోగదారులకు ఎక్కువగా అందుబాటులో ఉన్న చార్జర్లు అయితే కేవలం 150 ఆంపియర్లలోపు విద్యుత్‌నే పంపిణీచేయగలవు. అయితే, నూతన ఫ్లో బాయిలింగ్, కండన్సేషన్ ఎక్స్‌పరిమెంట్‌తో ఇది సాధ్యమేనని అమెరికాలోని పుర్‌డ్యూ విశ్వవిద్యాయంలోని పరిశోధకులు చెప్పారు. అయితే, 1,400 ఆంపియర్ల విద్యుత్ ప్రసరణ సామర్థ్యముండే చార్జింగ్ స్టేషన్లలో ఇది సాధ్యమేనని నాసా పేర్కొంది. ఇంతటి ఎక్కువ ఆంపియర్ల విద్యుత్ ప్రసరణ సమయంలో వేడి బాగా ఉద్భవిస్తుంది. దీనికి చెక్‌పెట్టేందుకు ద్రవ కూలెంట్‌ను ముందుగా చార్జింగ్ కేబుల్ గుండా పంపించారు. ఇది కరెంట్‌ను మోసుకెళ్లే కండక్టర్‌లో జనించే వేడిని లాగేస్తుంది. దీంతో 4.6 రెట్లు వేగంగా చార్జింగ్ చేయడం సాధ్యమైంది. కరెంట్ ప్రసరించేటపుడు వచ్చే 24.22 కిలోవాట్ల వేడిని ఈ విధానం ద్వారా తొలగించగలిగారు. 'కొత్త పద్ధతి కారణంగా చార్జింగ్ సమయం బాగా తగ్గుతుంది. ఎక్కువ సేపు చార్జింగ్ జంజాటం లేదుకాబట్టి ఎక్కువ మంది ఎలక్ట్రిక్ వాహనాలవైపు మొగ్గుచూపుతారు' అని పరిశోధకులు వ్యాఖ్యానించారు. భారరహిత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఈ రెండు ఫేజ్‌ల ఫ్లూయిడ్ ఫ్లో, వేడి బదిలీ ప్రక్రియను పరీక్షించనున్నారు.

### మదర్సా ప్రాంగణంలో మూక దుశ్చర్య

**బీదర్(కర్ణాటక):** బీదర్‌లో 1472లో నిర్మించిన మదర్సా, మసీదు ఉన్న ప్రాంగణంలో అన్యమత ప్రార్థనలకు ఒక గుంపు తెగించింది. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఆ ప్రాంగణంలో పూజలు చేసింది. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. తెల్లవారుజామున దుర్గా మాత విగ్రహం నిమజ్జనం కోసం గుంపుగా వెళ్తున్న జనంలోని దాదాపు 60 మంది హఠాత్తుగా మదర్సా, మసీదు ఉన్న ప్రాంగణంలోకి చొరబడి అక్కడి శమీ చెట్టు ఉండే చోట పూజలుచేశారు. ఘటనపై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో కర్ణాటక హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర స్పందించారు. ' ఆ ప్రాంతంలో చాలా ఏళ్లుగా శమీ చెట్టు ఉండేది. ప్రతి ఏటా నలుగురైదుగురు వచ్చి దర్శించుకుని వెళ్లేవారు. ఇప్పుడా చెట్టు లేదు. అయినాసరే ఈ ఏడాదీ వచ్చారు. వీడియోలు తీసి వైరల్ చేయడంతో వివాదమైంది' అని మంత్రి అన్నారు. దీంతో పట్టణంలో ముస్లింలు ఆందోళనకు దిగారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. పోలీసులు రంగంలోకి దిగి నలుగురిని అరెస్ట్‌చేశారు.

# రూ.120 కోట్ల మెఫెడ్రోన్ స్వాధీనం

**ముంబై:** నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులు తాజాగా రూ.120 కోట్ల విలువైన 60 కిలోల మెఫెడ్రోన్ అనే డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి అంతర్రాష్ట్ర డ్రగ్స్ మాఫియా సూత్రధారి ఎయిరిండియా మాజీ పైలట్ సహా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. నావల్ ఇంటెలిజెన్స్ విభాగం అందించిన సమాచారం మేరకు గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో సోమవారం సోదాలు జరిపి 10 కిలోల మెఫెడ్రోన్‌ను పట్టుకున్నామని ఎన్‌సీబీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంజయ్ సింగ్ మీడియాకు తెలిపారు. ఇందుకు సంబంధించి జామ్‌నగర్‌కు చెందిన ఒకరు, ముంబైకి చెందిన ముగ్గురిని అరెస్ట్ చేశామన్నారు. వీరిచ్చిన సమాచారంతో గురువారం దక్షిణ ముంబైలోని ఎస్‌బీ రోడ్డులో ఉన్న ఓ గోదాముపై దాడి చేశామన్నారు. 50 కిలోల మెఫెడ్రోన్‌ను పట్టుకుని, డ్రగ్స్ మాఫియా సూత్రధారి, ఎయిరిండియా మాజీ పైలట్ సహా ఇద్దరిని అరెస్ట్ చేశామన్నారు.



హిమాచల్‌ప్రదేశ్‌లోని కులూలో వారం రోజులుగా దసరా ఉత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం సంప్రదాయ వేషధారణతో ఉత్సవాల్లో పాల్గొన్న స్థానిక మహిళలు

### మత మార్పిడి చేసుకున్న వారికి ఎస్సీ హోదాపై కేంద్రం అధ్యయనం

**న్యూఢిల్లీ:** వేరే మతంలోకి మారిన దళితులకు ఎస్సీ హోదా ఇవ్వాలా వద్దా అనే విషయాన్ని తేల్చేందుకు కేంద్రం సమాయత్తమైంది. ఇందుకోసం కేంద్రప్రభుత్వం అధ్యయనం చేయనుంది. ఇందుకోసం మాజీ సీజేఐ కేజీ బాలకృష్ణన్ నేతృత్వంలో ఒక కమిషన్‌ను ఏర్పాటుచేసింది. రాష్ట్రపతి ఉత్తర్వుల్లో పేర్కొన్న మతాల్లోకి కాకుండా వేరే మతాల్లోకి మారిన వారికీ ఎస్సీ హోదా ఇవ్వొచ్చా లేదా అనే విషయాన్ని ఈ కమిషన్ తేల్చనుంది. మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ రవీందర్ కుమార్ జైన్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సభ్యురాలు సుష్మా యాదవ్‌లతో ఈ త్రిసభ్య కమిషన్‌ను కొలువుతీరుస్తూ కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ గురువారం ఒక నోటిఫికేషన్ విడుదలచేసింది. రాజ్యాంగంలోకి 341 ఆర్టికల్ ప్రకారం గతంలో పలు సందర్భాల్లో జారీ చేసిన రాష్ట్రపతి ఉత్తర్వులను, ప్రస్తుత పరిస్థితులను కమిషన్ పరిశీలించనుంది. వేరే మతం వారికి ఎస్సీ హోదా ఇస్తే ఇప్పటికే ఎస్సీ హోదా లబ్ధిపొందుతున్న వారి ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక వివక్ష, పేదరికం వంటి అంశాలపై ఏ మేరకు ప్రభావం పడుతుంది అనే అంశాలనూ కూలంకషంగా కమిషన్ అధ్యయనం చేయనుంది.

### పాత ఉద్యోగే ఘాతుకానికి ఒడిగట్టాడు!

**శాన్‌ఫ్రాన్సిస్కో:** అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో పంజాబీ కుటుంబం హత్యోదంతం వివరాలు మరిన్ని వెలుగులోకి వచ్చాయి. హత్యకు గురైన జస్దీప్ సింగ్, అమన్‌దీప్‌ల ట్రక్కింగ్ కంపెనీలో నిందితుడు సల్గాడో గతంలో డ్రైవర్‌గా పనిచేశాడు. విభేదాలతో బయటకు వచ్చాడు. ప్రతీకారం తీర్చుకునేందుకు తుపాకీతో బెదిరించి కిడ్నాప్ చేసి, చంపేశాడు. అయితే, చిన్నారి ఆరూహి ఆకలిదప్పులు తాళలేక చనిపోయినట్లు భావిస్తున్నామని పోలీసులు చెప్పారు. ఈ దారుణంలో మరో వ్యక్తి హస్తం ఉండి ఉంటుందని అనుమానిస్తున్నారు.

### చీతాల కోసం టాస్క్‌ఫోర్స్

**సాక్షి, న్యూఢిల్లీ:** ఇటీవల నమీబియా నుంచి తీసుకొచ్చి మధ్యప్రదేశ్‌లోని కునో అంతర్జాతీయ పార్కులో వదిలిన చీతాల పర్యవేక్షణకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఓ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. పార్క్‌తోపాటు సమీప ఇతర అనువైన నిర్దేశిత ప్రాంతాల్లో చీతాలను ఈ బృందం పర్యవేక్షిస్తుంది. మధ్యప్రదేశ్ అటవీ, పర్యాటక శాఖల ముఖ్య కార్యదర్శులతో కూడిన ఈ తొమ్మిది మంది సభ్యుల బృందానికి నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ సహకరిస్తుంది. కొత్త ప్రాంతాన్ని చీతాలు ఏ మేరకు సొంతస్థలంగా భావిస్తాయి, చీతా ఆరోగ్య స్థితి సమీక్షించడం, వేట నైపుణ్యాలను పరీక్షించడమే లక్ష్యంగా ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైంది. బృందం చేపట్టాల్సిన ఇతరత్రా పనులను మంత్రిత్వశాఖ నిర్దేశించింది. రెండేళ్లపాటు టాస్క్‌ఫోర్స్ ఈ ప్రత్యేక విధుల్లో నిమగ్నమై ఉంటుంది.

# నేనేం సోనియా రిమోట్‌ను కాను

- బీజేపీ ఆరోపణలపై ఖర్గే ఆగ్రహం
- ప్రధాని.. బీజేపీ అధ్యక్ష ఎన్నికలు ఎన్నిసార్లు పెట్టారని ఎదురుప్రశ్న

**అహ్మదాబాద్:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికల తర్వాత పార్టీకి డమ్మీ చీఫ్‌గా మల్లికార్జున ఖర్గే ఉండబోతారంటూ బీజేపీ చేస్తున్న విమర్శలకు ఆయన దీటైన సమాధానమిచ్చారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారం సందర్భంగా శుక్రవారం అహ్మదాబాద్‌లో ఖర్గే మాట్లాడారు.' నేనేం సోనియా గాంధీ రిమోట్ కంట్రోల్‌ను కాదు. బీజేపీలోనే అలాంటి వ్యవస్థ ఉంది. కాంగ్రెస్‌లో సర్వామోదంతోనే అన్నీ జరుగుతాయి. ఒకవేళ నేను పార్టీ పగ్గాలు చేపడితే నా రిమోట్ కంట్రోల్ నా వద్దే ఉంటుంది. కాంగ్రెస్‌లో పార్టీ కమిటీ, ఎన్నికైన సభ్యులు, వర్కింగ్



కమిటీ, పార్లమెంటరీ బోర్డు ఉమ్మడి, సమష్టి నిర్ణయాలే అమలవుతాయి. రిమోట్ కంట్రోల్ భావన బీజేపీదే. మీలోని వాళ్లే ఇలాంటివి సృష్టిస్తారు' అని బీజేపీ నేతలపై ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. 'బీజేపీ అధ్యక్ష ఎన్నికలను ప్రధాని ఎన్నిసార్లు నిర్వహించారు? బీజేపీలో రిమోట్ కంట్రోల్ ఎక్కడుందో అందరికీ తెలుసు. మీరా మాకు హితబోధ చేసేది?' అని ఎదురుదాడికి దిగారు. 'చీఫ్‌గా ఎన్నికైతే పార్టీలో సగం సంస్థాగతమైన పదవులు 50 ఏళ్లలోపు వారికి దక్కేలా కృషిచేస్తా. మహిళలు, యువత, దళితులకు పార్టీలో సరైన ప్రాతినిధ్యం కల్పిస్తా. గాంధీ, నెహ్రూ సిద్ధాంతాలను పరిరక్షిస్తూ, పటేల్ ఐక్యతా పిలుపును బలపరుస్తా' అని అన్నారు.

# ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ.. మళ్లీ ఈడీ దాడులు

**న్యూఢిల్లీ:** ఢిల్లీ మద్యం విధానం మనీ లాండరింగ్ ఆరోపణల కేసు విచారణలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు శుక్రవారం దేశవ్యాప్తంగా మరోసారి సోదాలు చేపట్టారు. ఢిల్లీ, పంజాబ్, హైదరాబాద్‌లోని 35 ప్రాంతాల్లో దాడులు జరిపినట్లు ఈడీ అధికారులు చెప్పారు. ఈ కేసు విచారణలో వెల్లడైన సమాచారం ఆధారంగా మద్యం పంపిణీదారులు, కంపెనీలు, వారి సంబంధమున్న సంస్థల్లో సోదాలు జరిగాయని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మద్యం ఉత్పత్తిదారు 'ఇండో స్పిరిట్'ఎండీ సమీర్ మహంద్రును అరెస్ట్ చేయడంతోపాటు ఇప్పటి వరకు 103 చోట్ల ఈడీ సోదాలు జరిపింది. అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్, మంత్రి సత్యేందర్ జైన్ తిహార్ జైలులో ఉన్నారు. ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా తదితరులను ఈ కేసులో ఈడీ నిందితులుగా చేర్చింది. ఈడీ తాజా సోదాలపై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ స్పందించారు. సిసోడియాకు ఈ కేసుతో సంబంధం లేదు కాబట్టే ఆయన నివాసంపై జరిపిన దాడుల్లో ఈడీకి ఏమీ దొరకలేదన్నారు. 'మనీష్ సిసోడియాకు వ్యతిరేకంగా ఆధారాలు సేకరించేందుకు ఈడీ, సీబీఐలకు చెందిన 300 మంది అధికారులు 3 నెలలుగా అవిశ్రాంతంగా పనిచేస్తూ 500 వరకు దాడులు జరిపారు. నీచ రాజకీయాల కోసమే ఇదంతా చేస్తున్నారు. ఇలాగైతే దేశం ఎలా బాగుపడుతుంది' అని కేజ్రీవాల్ ప్రశ్నించారు.

# వైఎస్ జగనే మా దేవుడు

- 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు
- జిల్లా పరీక్షా భవన్‌లో ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



గుంటూరులోని పరీక్షా భవన్ ప్రాంగణంలో సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు

**గుంటూరు ఎడ్యుకేషన్:** 'ఉపాధ్యాయ కొలువుల కోసం 23 ఏళ్లుగా చేస్తున్న పోరాటాన్ని ఏ ఒక్కరూ ఆలకించలేదు. ఎంతో మంది సీఎంలను కలిసినా న్యాయం జరగలేదు. పోస్టింగ్స్ ఇవ్వాలని గతంలో హైకోర్టు చెప్పినా అది ఆచరణలోకి రాలేదు. నాడు పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించాం. అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ మాటను నిలబెట్టుకుంటూ నేడు 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు మినిమం టైం స్కేల్‌పై ఉపాధ్యాయ నియామకాలు చేపట్టేందుకు నిర్ణయం తీసుకుని ఆరు వేల మంది అభ్యర్థుల కుటుంబాల్లో వెలుగులు నింపిన వైఎస్ జగనే మా దేవుడు' అంటూ అభ్యర్థులు తమ ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన అభ్యర్థులు 'జగనన్న 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్స్ ఆంధ్రప్రదేశ్' రాష్ట్ర నాయకుడు ఎం.విశ్వరూపాచారి ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ట్రిపుల్ ఐటీల్లో ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల ఎంపిక జాబితా విడుదల

**నూజివీడు:** రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో వికలాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో ప్రత్యేక కేటగిరీ సీట్లకు ఎంపికైన విద్యార్థుల జాబితాను ఆర్జీయూకేటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీ అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఈ-మెయిల్, ఎస్ఎంఎస్‌ల ద్వారా సమాచారం తెలియజేస్తామని వివరించారు. ఎంపికైన విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి కాల్ లెటర్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. స్పోర్ట్స్, ఎన్‌సీసీ కోటా కేటగిరీలో సీట్లు పొందినవారి జాబితాను రెండు నుంచి మూడు వారాల్లో విడుదల చేస్తామని తెలిపారు.


# ఆపన్న హస్తం అందిద్దాం..

## రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య తగ్గించేందుకు సర్కారు కార్యాచరణ

రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్యను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణకు ఉపక్రమించాయి. ప్రధానంగా ప్రమాదం సంభవించిన వెంటనే కీలకమైన గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స/అత్యవసర చికిత్సను వెంటనే అందించేలా పోలీసులు, ప్రభుత్వోద్యోగులు, కాలేజీ విద్యార్థులకు శిక్షణనిచ్చేందుకు ప్రణాళికను ఆమోదించాయి. త్వరలో పైలట్ ప్రాజెక్టును అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని భావిస్తున్నాయి.

- సాక్షి, అమరావతి

- పోలీసులు, ప్రభుత్వోద్యోగులు, కాలేజీ విద్యార్థులకు శిక్షణ
- సీపీఆర్, ఇతర అత్యవసర చికిత్సలపై తర్ఫీదు
- ప్రత్యేక సిమ్యులేటర్లు నెలకొల్పనున్న ప్రభుత్వం



### మృతుల సంఖ్య సగానికి తగ్గింపే లక్ష్యం

2021లో దేశవ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.73 లక్షల మంది మృత్యువాత పడ్డారు. 2020తో పోలిస్తే ఇది 18.8% అధికం. అలాగే, 2021లో జరిగిన ప్రతి 100 రోడ్డు ప్రమాదాల్లో 38 మంది మరణించారు. దీంతో రోడ్డు ప్రమాదాలు, వాటిల్లో మృతుల సంఖ్య తగ్గించేలా కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి కార్యాచరణకు ఉపక్రమిస్తోంది. 2024నాటికి మృతుల సంఖ్యను కనీసం 50 శాతం తగ్గించడం, 2030 నాటికి ఎవరూ మృతిచెందకుండా చూడటం లక్ష్యంగా నిర్దేశించుకుంది. మరోవైపు.. రోడ్డు ప్రమాదం సంభవించిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేవరకు వారికి వైద్య సహాయం అందడంలేదన్నది వాస్తవం. ఎందుకంటే.. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రయత్నించేవారు కేసుల దర్యాప్తులో భాగంగా పోలీస్‌స్టేషన్లు, న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సి వస్తుందనే భయం వారిని వేధిస్తోంది.. దీనికి పరిష్కారంగా కేంద్ర ప్రభుత్వం 'గుడ్ సమారిటన్' విధానాన్ని తీసుకొచ్చింది. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించే వారిని ప్రోత్సహించి నగదు బహుమతులు ప్రకటించింది. పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చేసింది. ఇక క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేలోగా ప్రథమ చికిత్స/అత్యవసర చికిత్స అందించడం మరో కీలక అంశం. అందుకే వివిధ వర్గాలకు ఈ చికిత్స అందించడంలో శిక్షణనివ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి.

### శిక్షణ కార్యక్రమం ఇలా..

- పోలీసులు, ప్రభుత్వోద్యోగులు, విద్యార్థులతోపాటు ఆసక్తి ఉన్న వారికి కూడా శిక్షణనిస్తారు.
- ప్రథమ/అత్యవసర చికిత్సకు సంబంధించిన అంశాల్లో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లలో శిక్షణనివ్వాలని నిర్ణయించారు.
- శిక్షణ తరగతులు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సిమ్యులేటర్లను నెలకొల్పుతుంది.
- అందులో క్షతగాత్రుల గుండె కొట్టుకునేలా చేసేందుకు కార్డియో పల్మనరీ రీససిటేషన్ (సీపీఆర్) అందించడంతోపాటు వైద్యులు నిర్దేశించిన ఇతర విధానాలపై శిక్షణనిస్తారు.
- పోలీసులు, ప్రభుత్వోద్యోగులు, విద్యార్థులకు బ్యాచుల వారీగా తర్ఫీదునిస్తారు.
- గాయాలను పరిశీలించడం, ఊపిరి ఆడుతోందీ లేనిదీ పరీక్షించడం, గొంతు, నోటిలో ఏమైనా అడ్డంపడ్డాయేమోనని పరిశీలించడం, మెడ/వెన్నెముక గాయాలైతే క్షతగాత్రులను కదపకుండా చూడటం, క్షతగాత్రుల శరీరానికి తగిన ఉష్ణోగ్రతను అందించడం, క్షతగాత్రులకు వెంటనే తాగునీరుగానీ ఆహారంగానీ అందించకుండా చూడటం, గాయాలకు ప్రథమ చికిత్స అందించడం, రక్తస్రావాన్ని నిరోధించడం, ఇతరుల సహాయంతో ఆసుపత్రికి ఎలా తరలించాలి.. మొదలైన అంశాల్లో శిక్షణనిస్తారు.
- ఒక్కో బ్యాచ్‌కు మూడ్రోజులపాటు శిక్షణనివ్వాలని భావిస్తున్నారు. అనంతరం సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారు.
- అనంతరం ఫలితాలను విశ్లేషించి భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తారు.

## మాగుంట సుధాకరరెడ్డి కన్నుమూత

**సాక్షి, చెన్నై:** ప్రముఖ పారిశ్రామికవేత్త, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సోదరుడు సుధాకరరెడ్డి(73) శుక్రవారం చెన్నైలో కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సుధాకరరెడ్డి భౌతిక కాయాన్ని చెన్నై నుంగంబాక్కం కాలేజీ రోడ్డు సుబ్బారావు అవెన్యూలోని స్వగృహంలో ఉంచారు.









# విశాఖలో ఆంగ్లియాన్ పారిశ్రామిక, లాజిస్టిక్ పార్క్

- రెండు పోర్టులకు అందుబాటులో 110 ఎకరాల్లో నిర్మాణం
- ఇండస్ట్రియల్ పార్కులో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్లాట్లు
- ఎగుమతి, దిగుమతులకు పక్కనే లాజిస్టిక్ పార్కు
- ఫార్మా ఉత్పత్తుల నిల్వకు మెగా కోల్డ్ చైన్ కాంప్లెక్స్



ఇండస్ట్రియల్ లాజిస్టిక్ పార్క్ నమూనా

**సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధానిగా ఎదుగుతూ.. ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా రూపాంతరం చెందుతున్న విశాఖపట్నం కేంద్రంగా లాజిస్టిక్ రంగం అభివృద్ధికి కీలకమైన అడుగులు పడుతున్నాయి. పారిశ్రామికాభివృద్ధితో పాటు ఎగుమతి, దిగుమతులు సులభతరం చేసేలా 110 ఎకరాల విస్తీర్ణంలో మరో ఇండస్ట్రియల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు ఢిల్లీకి చెందిన ప్రముఖ సంస్థ ఆంగ్లియాన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఐడీపీఎల్) సిద్ధమవుతోంది. విశాఖ ఎన్టీపీసీ సమీపంలో భారీ హబ్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటికే విశాఖపట్నంలో లాజిస్టిక్ ఎఫిషియన్సీ ఎన్‌హాన్స్‌మెంట్ ప్రోగ్రాం (లీప్) కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖలో భారీ మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు (ఎంఎంఎల్‌పీ) ఏర్పాటు చేస్తున్నాయి. విశాఖపట్నం పోర్టు అథారిటీ మరో లాజిస్టిక్ పార్క్‌ను నిర్మించాలని భావిస్తోంది. తాజాగా ఏఐడీపీఎల్ ఇక్కడ ఇండస్ట్రియల్ కమ్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటు ద్వారా వాణిజ్య కార్యకలాపాలు విస్తరణకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించింది. విశాఖపట్నం, గంగవరం పోర్టులకు మధ్య ఎన్టీపీసీకి సమీపంలో సుమారు 110 ఎకరాల్లో ఈ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఇది రెండు పోర్టులకు 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుందని పేర్కొంది.

ఇందులో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తోంది. స్టార్టప్‌లు, ఇతర పరిశ్రమలకు ఇందులో లీజుకు లేదా పూర్తి హక్కులతో స్థలాలను ఇస్తారు. ఈ పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతి, వాటికి అవసరమైన వస్తువుల దిగుమతులకు ఇతర ప్రాంతాలపై ఆధారపడకుండా.. పక్కనే లాజిస్టిక్ పార్క్‌ను అభివృద్ధి చేయనుంది. సమీపంలో ఫార్మా సిటీ కూడా ఉండటంతో.. ఫార్మా ఉత్పత్తుల నిల్వకు మెగాసైజ్ కోల్డ్ చైన్ కాంప్లెక్స్‌లు కూడా నిర్మిస్తున్నట్లు తెలిపింది. ఈ పార్క్‌లో మౌలిక వసతులతో పాటు కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం కూడా చేపట్టాలని భావిస్తున్నట్లు ఏఐడీపీఎల్ తెలిపింది. దేశవ్యాప్తంగా ఆంగ్లియాన్ గ్రూపు ప్లగ్ అండ్ ప్లే విధానంలో వేర్‌హౌస్, కోల్డ్ చైన్‌లను అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా మన రాష్ట్రంలో విశాఖ, కాకినాడల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. 2030 నాటికి దేశంలోనే అతి పెద్ద వేర్ హౌస్ మేనేజ్‌మెంట్ కంపెనీల్లో ఒకటిగా నిలిచేందుకు విశాఖపట్నం తరహా నగరాల్లో విస్తరణ కార్యకలాపాలు చేపట్టనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఈ సంస్థ ఎలక్ట్రికల్ లాజిస్టిక్ రంగంలో ఆంగ్లియాన్ ఒమేగా పేరుతో ఒక టన్ను బరువును మోయగలిగే బ్యాటరీతో నడిచే ఆటోలను ఉత్పత్తి చేస్తోంది.

# బిడ్డింగ్ ప్రక్రియను మీరెలా ప్రశ్నిస్తారు?

**జీవీఎంసీ పరిధిలో బార్ల వేలంపై దాఖలైన పిటిషన్ కొట్టేసిన హైకోర్టు**



**సాక్షి, అమరావతి:** వేలంలో పాల్గొనని వ్యక్తికి బిడ్డింగ్ ప్రక్రియను ప్రశ్నించే అధికారం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. నిబంధనల ప్రకారం నిర్దిష్ట మొత్తాన్ని చెల్లించలేని వ్యక్తి బిడ్‌ల రద్దు కోరుతూ పిటిషన్ దాఖలు చేయడం కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవుతుందని తేల్చి చెప్పింది. అనకాపల్లి జిల్లా గవరపాలేనికి చెందిన కేవీ మురళీకృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ఇటీవల తీర్పు వెలువరించారు. కొత్త బార్ల లైసెన్సులకు ఎక్సైజ్ శాఖ జీవీఎంసీ పరిధిలో ఈ-వేలం నిర్వహించింది. ఇందులో పాల్గొనడానికి మొదట రూ.10వేలు చెల్లించి రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం రూ.10 లక్షలు దరఖాస్తు ఫీజు చెల్లించాలి. ఈ ఫీజు చెల్లించిన వారే వేలంలో పాల్గొనాలి. 120 బార్లకు గాను 120 మంది వేలంలో పాల్గొన్నారు. 8 బార్లకు వేలం నిర్వహించలేదు. ఈ 120 మందిలో 20 మంది లైసెన్స్ ఫీజు చెల్లించలేదని, అయినా అధికారులు వారి బిడ్‌లను ఆమోదించారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ మురళీకృష్ణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. ఎక్సైజ్ శాఖ తరఫు న్యాయవాది తిరుమలశెట్టి కిరణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ అసలు వేలంలో పాల్గొనలేదని, రూ.10 వేలు చెల్లించి కనీసం రిజిస్టర్ కూడా చేసుకోలేదని తెలిపారు. అందువల్ల ఇందులో జోక్యం చేసుకునే అర్హత పిటిషనర్‌కు లేదన్నారు. వేలం పూర్తయ్యే సమయానికి బ్యాంకు పనివేళలు ముగియడంతో పాటు సర్వర్ సమస్యల వల్ల ఆన్‌లైన్‌లో కూడా కొందరు చెల్లించలేకపోయారని దీంతో వారి బిడ్‌లను అపరాధ రుసుముతో ఆమోదించామని చెప్పారు.

**బుద్దా సూరిబాబు.. తరువాత మురళీకృష్ణ..**

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. 'ఈ కేసులో మురళీకృష్ణ లేవనెత్తిన అభ్యంతరంతోనే బుద్దా సూరిబాబు అంతకు ముందు పిటిషన్ వేశారు. సూరిబాబు కూడా వేలంలో పాల్గొనలేదు. అతని పిటిషన్ విచారణార్హతపై ఈ న్యాయస్థానం ప్రశ్న లేవనెత్తింది. ఆ తరువాత రెండో రోజే మురళీకృష్ణ పిటిషన్ దాఖలు చేశారు. వాస్తవానికి వీరిద్దరూ సమీప బంధువులు. ఎక్సైజ్ శాఖ వాదనల ప్రకారం కొందరి ప్రయోజనాలను కాపాడేందుకు వారు ఈ వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ-వేలంలో పాల్గొనకుండా బిడ్డింగ్ ప్రక్రియను ప్రశ్నిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేయడమే. అందువల్ల ఈ వ్యాజ్యాన్ని కొట్టేస్తున్నా' అని జస్టిస్ శ్రీనివాసరెడ్డి తన తీర్పులో పేర్కొన్నారు.

## ఆరోగ్యశ్రీలో 3,254 ప్రొసీజర్లు

- ఈ నెల 15 నుంచి అందుబాటులోకి..
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యాలకు మరింత భరోసా చేకూర్చేలా ఈ నెల 15వ తేదీ నుంచి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి ఏకంగా 3,254 ప్రొసీజర్లను సీఎం జగన్ అందుబాటులోకి తీసుకొస్తున్నారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఇప్పటికే 2,446 ప్రొసీజర్లు అందుబాటులో ఉండగా కొత్తగా 808 కలిపి మొత్తం 3,254 ప్రొసీజర్లు అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. విజయవాడలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి ఆరోగ్యశ్రీలో 1,059 ప్రొసీజర్లు ఉన్నాయని, వాటిని 2,446కు పెంచామని చెప్పారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని 942 ప్రొసీజర్లతో ప్రారంభించారని గుర్తుచేశారు. ఆయన మరణానంతరం ప్రభుత్వాలు ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడంతో పేదప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. 2014-19 మధ్య చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కేవలం 117 ప్రొసీజర్లను మాత్రమే అదనంగా పథకంలో అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడేళ్లలోనే ఆరోగ్యశ్రీ పరిధిలోకి అదనంగా 2,195 ప్రొసీజర్లను తెచ్చారన్నారు.

**వైద్య, ఆరోగ్య రంగానికి జవసత్వాలు**

ముఖ్యమంత్రి జగన్ నాడు-నేడు కింద రూ.16 వేల కోట్లకుపైగా ఖర్చుచేస్తూ వైద్య, ఆరోగ్య రంగానికి నూతన జవసత్వాలు తెస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం కింద 10,032 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు మొదలు, 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణం, పాత వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల బలోపేతం, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులు.. ఇలా అన్నిస్థాయిల్లో వనరుల కల్పన చేపట్టారని వివరించారు. ప్రజారోగ్యం కోసం ఇన్ని చేస్తున్నా.. ఈనాడు సహా దుష్ట చతుష్టయానికి ఇవేవీ కనిపించవని ఎద్దేవా చేశారు. ఎక్కడో ఒక పీహెచ్‌సీలో మరమ్మతులు జరుగుతున్న కారణంగా చిన్న సమస్య తలెత్తితే.. దాన్ని భూతద్దంలో చూపించే జర్నలిజాన్ని ఏమనాలో ఈనాడు దినపత్రికకే తెలియాలని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు కట్టిన సచివాలయం భవనం పైకప్పు నుంచి వర్షపునీరు కారి, గదుల్లో నీరుచేరితే ఈనాడు దినపత్రికకు అదేమీ కనపించదని నిప్పులు చెరిగారు. మాచర్ల ఆస్పత్రిలో అక్కడి సిబ్బంది తప్పిదం వల్ల చిన్నారి వేలు చివరి భాగం దెబ్బతిన్నదని, ఈ సంఘటనకు సంబంధించి అక్కడి సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ ఘటనను రాజకీయం చేయాలని చూడటం బాధాకరమన్నారు. వైద్య, ఆరోగ్య శాఖలో ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చంద్రబాబు హయాంలో ఎలుకలు కొరికి చిన్నారి చనిపోతే ఈనాడుకు ఎందుకు కనిపించలేదని ప్రశ్నించారు. బాబు హయాంలో ఆస్పత్రుల్లో సెల్‌ఫోన్ వెలుతురులో సర్జరీలు చేస్తే ఈనాడుకు ఎందుకు కనిపించలేదని నిలదీశారు.

## 25న దుర్గగుడి మూసివేత

### 26వ తేదీ మధ్యాహ్నం 12గంటల తర్వాత దర్శనానికి అనుమతి

**ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ) :** ఈ నెల 25వ తేదీన సూర్యగ్రహణం సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయంతోపాటు అన్ని ఉపాలయాలను మూసివేస్తామని ఆలయ వైదిక కమిటీ సభ్యులు తెలిపారు. 25వ తేదీ ఉదయం 10 గంటలకు అమ్మవారికి మహా నివేదన, పూజా కార్యక్రమాల అనంతరం దుర్గమ్మ దర్శనం నిలిపివేయడంతోపాటు ఆలయ ద్వారాలను మూసివేస్తామని వివరించారు. తిరిగి 26 ఉదయం ఆరు గంటలకు దుర్గగుడి తెరుస్తామని, అమ్మవారికి స్నపనాభిషేకం, నిత్య అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం మహా నివేదన సమర్పిస్తామని తెలిపారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12.10 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని చెప్పారు. ఈ నెల 26వ తేదీన తెల్లవారుజాముతోపాటు ఉదయం జరిగే అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ప్రకటించారు.

## ఎస్టీఎంలో రికార్డు స్థాయిలో ఉత్పత్తి


స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్

**ఉక్కునగరం (గాజువాక):** స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ (ఎస్టీఎం) గత నెలలో రికార్డు స్థాయిలో ఉత్పత్తిని సాధించింది. ఈ మిల్‌లో రౌండ్లు, స్క్వేర్ బార్లు, యాంగిల్స్, చానల్స్ తయారు చేస్తారు. గత నెల 29 ఉదయం షిఫ్ట్‌లో చేసిన ఉత్పత్తితో 58,300 టన్నులు మిల్ సామర్థ్యాన్ని చేరుకుంది. నెలాఖరుకు 63,574 టన్నులు ఉత్పత్తి(109శాతం సామర్థ్యం) చేయడంతో రికార్డు నమోదైంది. ఆ విభాగ ఉద్యోగులను ఉన్నతాధికారులు అభినందించారు.

# ఆర్బీకేలు అద్భుతం.. వినూత్నం

### బ్యాంకాక్‌లో వ్యవసాయ వ్యవస్థల పరివర్తనపై ఎఫ్ఏవో సదస్సు

- ఆసియా పసిఫిక్ సింపోజియంలో భారత్ తరఫున పాల్గొన్న ఏపీ సర్కార్
- ఆర్బీకేలపై ఏపీ వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ పూనం ప్రజంటేషన్
- ఆర్బీకేల సేవలపై ఆసియా దేశాల ఆసక్తి.. ల్యాబ్ టూ ల్యాండ్ కాన్సెప్ట్ ఆలోచనపై ప్రశంసలు
- ప్రతీ వ్యవసాయ దేశం ఆచరించవచ్చని సూచన

**సాక్షి, అమరావతి/సాక్షి, అమలాపురం :** 'రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ఆలోచన వినూత్నం.. ల్యాబ్ టూ ల్యాండ్ సాంకేతికత అద్భుతం' అంటూ ఆసియా దేశాల ప్రతినిధులు కొనియాడారు. వ్యవసాయాధారిత దేశాలన్నీ తప్పకుండా అందిపుచ్చుకోవాల్సిన, ఆచరించాల్సిన సాంకేతికత పరిజ్ఞానం ఇదని వారు కితాబిచ్చారు. ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ అయిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏవో) ఆధ్వర్యంలో బ్యాంకాక్‌లో జరుగుతున్న ఆసియా పసిఫిక్ సింపోజియంలో 'వ్యవసాయ వ్యవస్థల పరివర్తన' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆర్బీకేలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఏపీ ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా గ్రామస్థాయిలో రైతులకు అందిస్తోన్న సేవలపై ఆ దేశాల ప్రతినిధులు ప్రశంసలు కురిపించారు. సింపోజియంకు భారత్ తరఫున కేంద్ర వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ సుభాతాకూర్, ఏపీ వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య హాజరయ్యారు. సదస్సు రెండో రోజైన శుక్రవారం మిల్లెట్ మిషన్ ఆఫ్ ఇండియాపై సుభాతాకూర్ ప్రసంగించగా, ఆర్బీకే వ్యవస్థ ఏర్పాటు, అమలు తీరుపై పూనం మాలకొండయ్య పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆమె ఏమన్నారంటే..

**సీఎం జగన్ ఆలోచన నుంచి పుట్టినవే..**

పౌర సేవలను ప్రజల ముంగిటకు తీసుకెళ్లే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేశారు. విత్తనం నుంచి విక్రయం వరకు రైతుకు అండగా నిలుస్తున్నారు. ఆక్వా, పాడి రైతులకు కూడా ఆర్బీకేల ద్వారా సేవలందిస్తున్నాం. పరిశోధనా ఫలితాలను నేరుగా వ్యవసాయ క్షేత్రాల వద్దకు (ల్యాబ్ టూ ల్యాండ్) తీసుకెళ్తున్నాం. సర్టిఫై చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతో పాటు చేప, రొయ్య సీడ్, ఫీడ్, పశువుల దాణాలనూ ఆర్బీకేల్లో బుక్ చేసుకున్న గంటల్లోనే రైతులకు సరఫరా చేస్తున్నాం. సాగులో మెళకువలు నేర్పుతున్నాద్దాం. ఈ-క్రాప్, ఈ-ఫిష్ బుకింగ్ ద్వారా వాస్తవ సాగుదారులను గుర్తించి ప్రభుత్వ రాయితీలు, సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం. ఆర్బీకేలకు అనుబంధంగా నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లతోపాటు ప్రతీ ఆర్బీకే పరిధిలో యంత్ర సేవా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చాం. ఆర్బీకేలకు అనుబంధంగా రూ.17వేల కోట్లతో గ్రామస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం'.. అని పూనం మాలకొండయ్య వివరించారు. ఆర్బీకే సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ఇథియోపియా ప్రతినిధులు త్వరలో తమ రాష్ట్రంలో పర్యటించనున్నారని ఆమె ఈ సదస్సు దృష్టికి తీసుకొచ్చారు.


బ్యాంకాక్‌లో ఆర్బీకేల గురించి వివరిస్తున్న పూనం మాలకొండయ్య

### మా ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తాం

ఇక గేమ్ చేంజర్‌గా నిలిచిన ఆర్బీకేలు అనతి కాలంలోనే అంతర్జాతీయ ఖ్యాతిని గడించాయని ఆసియా దేశాల ప్రతినిధులు కొనియాడారు. ఆర్బీకేల గురించి తమ ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి ఆచరింపజేసేందుకు కృషిచేస్తామన్నారు. భారత్ వచ్చేందుకు తాము ఆసక్తిగా ఉన్నట్లు బంగ్లాదేశ్ మంత్రి మహ్మద్ అబ్దుర్ రజాక్ కూడా చెప్పారు. థాయ్‌లాండ్‌తో పాటు యూకే, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, వియత్నాం, జపాన్, సింగపూర్, హాంకాంగ్, కంబోడియా, టాంగో, కుక్, సోలోమోన్ ఐలాండ్స్ దేశాల వ్యవసాయ మంత్రులు, కార్యదర్శులు, వివిధ యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు, శాస్త్రవేత్తలతో పాటు ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు పాల్గొన్నారు.

## అట్టడుగు స్థాయికి సేవలు సూపర్

'ఏపీలో రైతుభరోసా కేంద్రాల ద్వారా అట్టడుగు స్థాయి రైతులకూ సమస్త సమాచారం, ప్రభుత్వం నుంచి సహకారం అద్భుతంగా అందుతున్నాయి. ఇది నిజంగా రైతులకు మంచి ఫలితాలిస్తోంది. అలాగే, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓ) కూడా రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయడం అభినందనీయం'.. అని జర్మనీలోని హాంబర్గ్ యూనివర్సిటీ పరిశోధకులు జూలియా, రాబిర్, కార్మన్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో ఎఫ్‌పీవోలను వారు శుక్రవారం పరిశీలించారు. వాటి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. తెల్లదోమ ఆశించిన కొబ్బరి ఆకుకు ట్రైకోగ్రైసా బదనికల గుడ్లు ఉన్న పేపర్ అతికించే విధానాన్ని ఆసక్తిగా పరిశీలించారు. మన దేశంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానంపై అధ్యయనం చేసేందుకు వారు వచ్చారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు.


తెల్లదోమ ఆశించిన కొబ్బరి ఆకును పరిశీలిస్తున్న జర్మనీ పరిశోధకులు

**ఎఫ్‌పీవోలు బాగా పనిచేస్తున్నాయి**

జర్మనీలో సహకార వ్యవస్థ మాత్రమే ఉందని.. అదే భారత్‌లో సహకార వ్యవస్థతో పాటు ఎఫ్‌పీవోలు కూడా బాగా పనిచేస్తున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలకు.. వీటిని ప్రకృతి వ్యవసాయం ఏవిధంగా నిరోధించగలదనే అంశంపై అధ్యయనం చేసేందుకు తాము వచ్చామన్నారు. ఆర్బీకేలు, సహకార సొసైటీలు, ఎఫ్‌పీఓల ద్వారా ప్రభుత్వం నుంచి రైతులకు.. రైతుల నుంచి ప్రభుత్వానికి సమాచారం చేరడం మంచి పరిణామమని చెప్పారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీఓల ద్వారా రైతులకు కలుగుతున్న ప్రయోజనాలను ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబీ), వ్యవసాయ, ఉద్యాన శాఖల జిల్లా అధికారులు వై. ఆనందకుమారి, ఎస్.మల్లికార్జునరావు, ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఎలియాజర్‌లతో వారు చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, యంత్ర పరికరాలను, సన్న, చిన్నకారు రైతులు వినియోగించుకుంటూ లబ్ధిపొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ నేచురల్ ఫార్మింగ్ రాష్ట్ర అధికారి శ్రీకర్ దాసరి, మద్రాస్ ఐఐటీ ఇంజినీరింగ్ విద్యార్థి రుషీకా, టాటా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సోషల్ సెక్షన్ విద్యార్థి పునీత్ పాల్గొన్నారు.

## ఉప రాష్ట్రపతితో గవర్నర్ భేటీ


ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసిన గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

**సాక్షి, న్యూఢిల్లీ :** ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ఉపరాష్ట్రపతికి తిరుమల శ్రీవారి ప్రతిమను బహూకరించారు. ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో)లో నిర్వహించిన 'ఫ్రీడమ్ స్ట్రగుల్, ప్రోగ్రెసివ్ ఇండియా-75' సమావేశంలో పాల్గొన్న గవర్నర్ స్వాతంత్ర్య సంగ్రామంపై ప్రసంగించారు.

## విశ్వరూప్‌కు మంత్రి వేణు పరామర్శ


ముంబై ఆస్పత్రిలో మంత్రి విశ్వరూప్‌ను పరామర్శిస్తున్న మంత్రి వేణు

**అమలాపురం టౌన్:** గుండెకు శస్త్రచికిత్స చేయించుకుని ముంబైలోని ఏషియన్ హార్ట్ కేర్ ఇన్‌స్టిట్యూట్ ఆస్పత్రిలో ఉన్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ శుక్రవారం పరామర్శించారు. విశ్వరూప్ సతీమణి బేబీ మీనాక్షి, కుమారులు కృష్ణారెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, అమిత్‌తో మంత్రి వేణు మాట్లాడారు. ముంబై వెళ్లే ముందు సింహాచలంలో శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని మంత్రి వేణు దర్శించుకుని విశ్వరూప్ ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు చేశారు. విశ్వరూప్‌ను పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్ కూడా ఉన్నారు.



## 600 పడకలతో ఎంసీహెచ్ నిర్మాణం

ఏపీలో తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) నిర్మాణానికి గుంటూరు జీజీహెచ్‌లో శుక్రవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని శంకుస్థాపన చేశారు. 600 పడకలతో ఏర్పాటు చేస్తున్న కానూరి రామచంద్రరావు జింకానా మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం నిర్మాణానికి జింకానా సభ్యులు రూ.86 కోట్లు విరాళం ఇచ్చారు. ఎమ్మెల్యేలు మహ్మద్ ముస్తఫా, డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కేఎస్ లక్ష్మణరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్‌డాక్టర్ నీలం ప్రభావతి తదితరులు పాల్గొన్నారు. *– గుంటూరు మెడికల్*

# అందరికీ అంతరాలయం టికెట్లు

- 10 నుంచి అందుబాటులో రూ.500 టికెట్లు
- కనకదుర్గ ఆలయంలో దసరా ఉత్సవాలు విజయవంతం
- దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



**ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ):** విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల్లో అంతరాలయ దర్శనం కోసం వీఐపీలకు విక్రయించిన రూ.500 టికెట్లను ఈ నెల 10వ తేదీ నుంచి భక్తులందరికీ అందుబాటులో ఉంచనున్నట్లు దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. ఈ టికెట్‌పై అంతరాలయ దర్శనంతోపాటు గోత్రనామాలతో అమ్మవారికి హారతి ఇస్తారని తెలిపారు. టికెట్‌కు రెండు లడ్డూలను భక్తులకు ఇస్తామన్నారు. దసరా ఉత్సవాలు విజయవంతంగా పూర్తికావడంతో శుక్రవారం ఆయన కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో కనకదుర్గ ఆలయంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించామని చెప్పారు.

**కాణిపాకం ఆలయ ఇన్‌చార్జి ఈవో అత్యుత్సాహమే కారణం**

కాణిపాకం ఆలయంలో టికెట్ల వివాదానికి ఇన్‌చార్జి ఈవో సురేష్‌బాబు అత్యుత్సాహమే కారణమని చెప్పారు. టికెట్ల ధర పెంపు గురించి తనతోగానీ, కమిషనర్‌తో గానీ చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. దీనిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించడంతోపాటు విధుల నుంచి తప్పించామని చెప్పారు.

# సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ సేవలు

- కృష్ణాలో 103 సచివాలయాల ఎంపిక
- 100 సచివాలయాల్లో ఉచిత ఆధార్ సేవలు సైతం
- కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉన్న బందరు మండలం పోతిరెడ్డిపాలెం సచివాలయం

**మచిలీపట్నం:** గ్రామ స్వరాజ్య స్థాపన కోసం సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రభుత్వం సేవలు మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తోంది. గ్రామ/వార్డు సచివాలయం కేంద్రంగా సమస్త సేవలు అందించేలా మరో ప్రజోపకరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్థిరాస్తి క్రయ, విక్రయాలు, ఇతర లావాదేవీల రిజిస్ట్రేషన్లు అన్నీ ఇక నుంచి సచివాలయం కేంద్రంగానే చేపట్టేలా ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. కృష్ణా జిల్లాలో ఇప్పటికే మూడు చోట్ల ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 103 సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకొచ్చేలా కలెక్టర్ రంజిత్‌బాషా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కృష్ణాలో మొత్తం 508 సచివాలయాలు ఉండగా, దశల వారీగా అన్ని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇకపై రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాల్సిన పని లేకుండా, దస్తావేజర్లకు కమీషన్లు ఇచ్చుకోవాల్సిన అవసరం లేకుండా సచివాలయంలోనే రిజి స్ట్రేషన్ సేవలు పొందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఇప్పటికే మూడు చోట్ల అమలు**

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మూడు చోట్ల సచివాలయాల్లో ఇప్పటికే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. కృష్ణాజిల్లాలో గుడివాడ సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని మెరకగూడెం, పెడన సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని పొట్లపాలెం, ఏలూరు జిల్లాలో విలీనమైన నూజివీడు సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని మర్రిబంధం పంచాయతీల్లో సచివాలయాల్లోనే ప్రస్తుతం రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో చేసిన ప్రయోగం మంచి ఫలితాలు ఇవ్వటంతో దీన్ని మిగతా చోట్ల కూడా అమలు చేసేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం అంతా సిద్ధం చేస్తోంది.

**ఉచితంగానే ఆధార్ సేవలు**

కృష్ణాజిల్లాలోని 71 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా, మరో 29 కేంద్రాలను గుర్తించాలని ఆదేశాలిచ్చింది. ఆధార్ కార్డుల్లో తప్పిదాల సవరణ ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం ఇందుకోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఇటువంటి అవకాశం కల్పించింది. ఎంపిక చేసిన సచివాలయాల్లో ఆధార్ సేవలు ఉచితంగానే పొందవచ్చు. ఇప్పటికే జిల్లాలో 33 సచివాలయాల్లో ఆధార్ సేవలు అందిస్తున్నారు. మిగతా కేంద్రాల్లో కూడా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈమేరకు అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. ఐదేళ్లు, పదిహేనేళ్లు వయస్సు నిండిన వారు కచ్చితంగా వివరాలను మరో దఫా ధ్రువీకరించుకునేలా ఇటువంటి వెలుసుబాటు కల్పించారు.

### ప్రజలకు ఎంతో మేలు



జిల్లాలో 103 కేంద్రాల్లో పూర్తి స్థాయిలో రిజిస్ట్రేషన్లు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం దీనిపై రిజిస్ట్రేషన్, సచివాలయాల శాఖ అధికారులకు తగిన మార్గదర్శకాలు జారీ చేశాం. గ్రామస్థాయిలోనే రిజిస్ట్రేషన్లు, ఆధార్ సేవలు అందుబాటులోకి రావటం వల్ల ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

*– పి.రంజిత్ బాషా, కలెక్టర్, కృష్ణాజిల్లా*

### సర్వం సిద్ధం చేశాం



ఆధార్ తప్పిదాల సవరణ ప్రాధాన్యం దృష్ట్యా సచివాలయ స్థాయిలోనే వీటిని అందుబాటులోకి తీసుకొస్తున్నాం. కలెక్టర్ సూచనలకు అనుగుణంగా సచివాలయాల్లో తగిన మౌలిక సౌకర్యాలపై దృష్టి సారించాం. ఆధార్ సేవలకు మంచి స్పందన వస్తోంది. దీనిపై సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం.

*– కేఎస్ఎస్ సుబ్బారావు, సచివాలయాల నోడల్ అధికారి, కృష్ణాజిల్లా*

### మేము రెడీ



ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. దీనిపై జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్‌లకు దిశా నిర్దేశం చేశాం. సచివాలయ స్థాయిలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లను నిశిత పరిశీలన చేసిన మీదటే ధ్రువీకరణ ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్‌లను ఆదేశించాం.

*–టి.ఉపేంద్రరావు, జిల్లా రిజిస్ట్రార్, కృష్ణాజిల్లా*

## గుంటూరులో 600 పడకలతో ఎంసీహెచ్ కేంద్రం

- నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి విడదల రజిని
- రూ.86 కోట్ల విరాళం ఇచ్చిన జింకానా సభ్యులు

**గుంటూరు మెడికల్:** రాష్ట్రంలో మొదటిసారిగా ఏర్పాటుచేస్తున్న మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) నిర్మాణానికి గుంటూరు జీజీహెచ్‌లో శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని శంకుస్థాపన చేశారు. 600 పడకలతో ఏర్పాటుచేస్తున్న కానూరి రామచంద్రరావు జింకానా మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) నిర్మాణానికి జింకానా సభ్యులు రూ.86 కోట్ల విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ కేంద్రం నిర్మాణానికి అమెరికాలో స్థిరపడిన గుంటూరు వైద్యకళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (జింకానా) సభ్యులు రూ.86 కోట్లు ఇవ్వడం అభినందనీయమన్నారు. రూ.20 కోట్లు ఇచ్చిన డాక్టర్ ఉమా గవిని, రూ.22 కోట్లు విరాళం ఇచ్చిన డాక్టర్ మొవ్వ వెంకటేశ్వర్లు, రూ.11 కోట్లు ఇచ్చిన డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ నళిని, ఇతర దాతలను మంత్రి అభినందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి సారించి నాడు-నేడు పథకంలోభాగంగా రూ.16 వేల కోట్లను ఆస్పత్రులు, వైద్యకళాశాలల నిర్మాణాలు, మరమ్మతులకు కేటాయించారని తెలిపారు. అందులో కేవలం గుంటూరు జీజీహెచ్ మరమ్మతుల కోసం రూ.500 కోట్లు కేటాయించారని చెప్పారు. ఎమ్మెల్యేలు షేక్ మొహమ్మద్ ముస్తఫా, డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మద్యపాన విమోచన ప్రచార కమిటీ చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.

# వలంటీర్లు రైతు సేవలో భాగస్వాములు కావాలి

**జిల్లా వ్యవసాయాధికారి మనోహరరావు**

**మచిలీపట్నంటౌన్:** గ్రామాల్లో పని చేస్తున్న వలంటీర్లు రైతులకు సేవలు అందించడంలో భాగస్వాములు కావాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీఎస్ మనోహరరావు కోరారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం మండల పరిధిలోని మేకవానిపాలెం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వలంటీర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన మనోహరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులకు మెరుగైన సేవలు అందించేందుకుగానూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ప్రారంభించిందన్నారు. వీటిలో పని చేసే గ్రామ వ్యవసాయ సహాయకులతో పాటు వలంటీర్లు రైతులకు సేవలు అందించటంలో భాగస్వాములు కావాలన్నారు. ఆర్బీకే సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామాల్లో చురుకుగా పని చేసే వలంటీర్లను ఆర్బీకేలకు ప్రభుత్వం అనుసంధానం చేసిందన్నారు. మండల వ్యవసాయాధికారి జీవీ శివప్రసాద్ మాట్లాడుతూ బందరు మండలంలోని వలంటీర్లకు వ్యవసాయానికి సంబంధించి రైతులకు అందించాల్సిన సేవలపై దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు అందరూ ఆర్బీకే సేవలను రైతుల ముంగిటకు తీసుకువెళ్లేందుకు కృషి చేయాలన్నారు. రైతులకు ఎల్లప్పుడు గ్రామ వ్యవసాయ సహాయకులతో పాటు వలంటీర్లు తోడుగా ఉంటూ ప్రస్తుతం జరుగుతున్న రైతులకు ఈ-కేవైసీ ప్రక్రియ నమోదులో పాల్గొని రైతులందరి చేత ఈ-కేవైసీ పూర్తి చేసేలా కృషి చేయాలన్నారు. గుండుపాలెం వీఏఏ పూజా ప్రియదర్శిని ఆర్బీకెలో ఉన్న కియోస్క్ ద్వారా రైతులకు ఎరువులను ఆర్డర్ పెట్టడం, విత్తనాల ఆర్డర్ పెట్టడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేకవానిపాలెం వీఏఏ మహాలక్ష్మి, ఆర్బీకే వలంటీర్లు పాల్గొన్నారు.


మేకవానిపాలెంలో వ్యవసాయ వలంటీర్ల తో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మనోహరరావు

## అతిథి గృహానికి రూ.46 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభించిన కైలాసనదన్ అతిథి గృహ సముదాయం బ్లాక్-1లోని నాలుగు గదులకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన దాత సూరిశెట్టి సరస్వతమ్మ, కుటుంబ సభ్యులు విన్నకోట స్వతంత్ర బాబు, పర్వతనేని వర్ధనమ్మ, కోటేశ్వరరావు పేరిట రూ.46 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సొమ్మును ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన లాసనదన్ అతిథిగృహంలో మొత్తం 125 గదులు ఉన్నాయన్నారు. అందులో సింగిల్ గదులు 101, సూట్ రూమ్స్ 24 ఉన్నట్లు తెలిపారు. సూట్ రూమ్‌కు రూ.15 లక్షలు, సింగిల్ గదికి రూ.8 లక్షలు చొప్పున దాతలు విరాళం చెల్లించి భాగస్వామ్యం అవ్వాలని పిలుపునిచ్చారు. విరాళం అందించిన దాతలకు సంవత్సరంలో 30 రోజులు ఉచితంగా బస కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ మురళీధర్, అకౌంటెంట్ యుగంధర్, పాలకమండలి సభ్యులు పసల సుమతి, సాధన మున్నా, జయ శ్యామ్, ప్రత్యేక ఆహ్వానితులు పవన్‌కుమార్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బెజవాడలో భారీ వర్షం


విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో నిలిచిన వర్షపు నీరు

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఎన్టీఆర్ జిల్లాలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం విజయవాడ నగరంలోని పటమట, ఆటోనగర్ ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. జిల్లాతో పాటు తెలంగాణ ప్రాంతంలోనూ వర్షాల కురవడంతో మున్నేరు, వైరాయేరు, కట్టలేరులకు వరద వచ్చింది. గంపలగూడెం మండలంలో తోటమూల - వినగడప గ్రామాల మధ్య కట్టలేరు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పలు గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. గంపల గూడెం- చీమలపాడు మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో మెట్ట పైర్లకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


నగరంలో జోరున కురుస్తున్న వాన

# సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 8 । అక్టోబర్ । 2022




**తిరుపతమ్మకు బోనాలు**

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారిని శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



**పర్యాటకంపై చర్చ**

చిలకలపూడి(మచిలీపట్నం): లోక్‌సభ సబార్డినేట్ కమిటీ చైర్మన్, ఎంపీ బాలశౌరి శుక్రవారం ఢిల్లీలో టూరిజం, పెట్రో కెమికల్స్ శాఖల ఉన్నతాధికారులతో ఆయా అంశాలపై చర్చించారు.



**జాతీయ రహదారి విస్తరణపై దృష్టి**

కంకిపాడు: గోసాల సెంటర్‌లో జాతీయ రహదారి విస్తరణ ప్రతిపాదిత స్థలాన్ని జేసీ మహేష్‌కుమార్ పరిశీలించారు. -10లో▸

## న్యూస్‌రీల్

### సీనియారిటీ జాబితాలు సరిచూసుకోండి

మచిలీపట్నం: విద్యాశాఖలో ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాలను సరిచూసుకోవాలని కృష్ణాజిల్లా విద్యా శాఖాధికారి తాహెరా సుల్తానా ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా, మండల పరిషత్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. సీనియారిటీ జాబితాలన్నీ కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే శనివారం సాయంత్రం లోగా తగిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు తమ అభ్యంతరాలను కేవలం వెబ్‌సైట్‌లో మాత్రమే నమోదు చేయాలన్నారు. డీఈవో కార్యాలయంలో నేరుగా ఎటువంటి దరఖాస్తులను తీసుకోవడం జరగదన్నారు. ఉపాధ్యాయుల సౌలభ్యం కోసం ఆన్‌లైన్ ప్రక్రియను తీసుకొచ్చినందున, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### పెనమలూరు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆర్టీఐ కమిషనర్



పెనమలూరు: పెనమలూరు పోలీస్‌స్టేషన్‌ను రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ యు.హరిప్రసాద్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఆయన పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆర్టీఐ చట్టం ప్రకారం వచ్చిన పిటీషన్‌లు, వాటికి అధికారులు అందించిన సమాచారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిస్టర్లు పరిశీలించారు. ఆర్టీఐ చట్టం కింద ఎవరైనా సమాచారం కోసం దరఖాస్తు చేస్తే సకాలంలో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆర్టీఐ చట్టం అమలులో నిర్లక్ష్యం చూపితే బాధ్యులవుతారని హెచ్చరించారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### కుష్ఠు నివారణ చర్యలపై కేంద్ర బృందం సమీక్ష



పెనమలూరు: కుష్ఠు వ్యాధి నివారణకు తీసుకుంటున్న చర్యలపై కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి సమీక్ష నిర్వహించారు. నేషనల్ లెప్రసీ ఎరాడికేషన్ ప్రోగ్రాం(ఎన్ఎల్ఈపీ) ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న తీరును పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలో ఉన్న కుష్ఠు వ్యాధి కేసుల వివరాలు, చికిత్స విధానం, బాధితుల కుటుంబ సభ్యులకు అందుతున్న సేవలను మండల వైద్యాధికారి రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పెనమలూరు, యనమలకుదురు, తాడిగడప గ్రామాల్లో ఉన్న వ్యాధిగ్రస్తులతో మాట్లాడి ప్రభుత్వపరంగా అందుతున్న వైద్య చికిత్స సేవల గురించి వారిని అడిగి తెలుసుకుని ఆరోగ్య పరిస్థితులు పరిశీలించారు. నవంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభించనున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ)పై తగిన సూచనలు చేశారు. పోరంకిలో 3, 4 సచివాలయాలను సందర్శించి అందుతున్న ప్రజాసేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఏపీ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ యాస్మిన్, స్టేట్ నోడల్ ఆఫీసర్ (ఎన్‌సీడీ) డాక్టర్ శాస్త్రి, డీఎల్‌వో డాక్టర్ ఎ.వెంకట్రావు, డీపీఎంవో శ్రీనివాసరావు, సీహెచ్‌వో కుమార్, అధికారులు రామ్‌కుమార్, పురుషోత్తమరాజు, పీహెచ్ఎన్ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

### 11,117 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 10,878 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 11,117 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.12,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చికి రూ.13,000 నుంచి రూ.25,800 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.14,000 నుంచి రూ.27,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 5,257 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

# మనసా... తుళ్లిపడకే!

- సమాజంలో 25 శాతం మందికి మానసిక సమస్యలు
- కోవిడ్‌తో మరింత పెరిగిన వత్తిళ్లు
- జిల్లాలో సైకియాట్రిస్టుల వద్దకు క్యూ కడుతున్న రోగులు
- ఈ నెల 4 నుంచి 10 వరకూ మానసిక ఆరోగ్య వారోత్సవాలు

**వర్తమాన సమాజంలో** మారిన జీవన శైలి కారణంగా ఇటీవలి కాలంలో పలువురు మానసిక సమస్యలతో సతమతమవుతున్నారు. దీనికి తోడు కోవిడ్ కారణంగా గత రెండేళ్లలో అనేకమంది మానసిక వత్తిళ్లకు గురయ్యారు. దీంతో సైకియాట్రిస్టులు, సైకాలజిస్టుల వద్దకు పరుగులు తీస్తున్నారు. లైఫ్ స్టైల్ డిసీజెస్‌లో మధుమేహం, రక్తపోటుతో పాటు తాజాగా డిప్రెషన్ కూడా చేరింది.



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ప్రభుత్వాస్పత్రితో పాటు, ప్రైవేటు ఆస్పత్రుల్లో మానసిక వైద్యులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య ఇటీవల బాగా పెరిగింది. జీజీహెచ్ సైకియాట్రిక్ ఓపీకి ప్రతి రోజూ 150 మంది వరకూ రోగులు వస్తుంటారు. ప్రైవేటు ఆస్పత్రులతో పాటు, సైకాలజిస్టుల వద్దకు ప్రతిరోజూ వెయ్యి మంది వరకూ వేర్వేరు ఇబ్బందులతో రోగులు వెళ్తుంటారు. కోవిడ్ తర్వాత మానసిక సమస్యలు మరింత ఎక్కువయ్యాయి. అంతేకాక జీవనశైలి కూడా ఆరోగ్య సమస్యలతో పాటు. మానసిక వత్తిళ్లకు దారితీస్తోంది. సమాజంలో 25 శాతం మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు ఒక అంచనా. కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, చదువులో వత్తిళ్లు, వ్యాపారంలో నష్టాలు ఇలా మానసిక సమస్యలకు అనేక కారణాలు ఉంటున్నాయి. జీవితంలో సమస్యలు రావడం సహజమేనని, వాటిని ఆత్మస్థైర్యంతో అధిగమించాలని వైద్యులు చెబుతున్నారు. ఈ ఏడాది ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మానసిక ఆరోగ్యమే ప్రపంచంలో అందరి మొదటి ప్రాధాన్యం అనే నినాదంతో అవగాహన కలిగించనున్నారు.

**భావోద్వేగాల అదుపు అవసరం**

భావోద్వేగాలు, ప్రవర్తనలపై అదుపు కలిగిన వ్యక్తులే సంపూర్ణ మానసిక ఆరోగ్యవంతులుగా పరిగణించబడతారు. అటువంటి వ్యక్తులే జీవితంలో ఎదురయ్యే సవాళ్లను, అసమానతలను ఎదుర్కోగలిగే సామర్థ్యం కలిగి ఉంటారు. బలమైన మానవ సంబంధాలను ఏర్పరుచుకుంటారు. పరాజయాల నుంచి తొందరగా తేరుకుని విజయం సాధించగలుగుతారు. నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు ఇలా అన్ని వర్గాల వారు వత్తిడిలను అధిగమించలేక డిప్రెషన్‌కు గురవుతున్నారు.

**కోవిడ్‌తో పెరిగిన మానసిక సమస్యలు**

కోవిడ్ ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. లాక్‌డౌన్‌లో నెలల పాటు ఉపాధి, ఉద్యోగాలు, వ్యాపారాలు లేక ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో అనేక మంది తీవ్రమైన మానసిక వత్తిళ్లకు గురయ్యారు. కోవిడ్ ప్రభావం ప్రజలపై తీవ్రమైన మానసిక సమస్యలకు దారితీసినట్లు వైద్యులు చెబుతున్నారు.

**సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలి**

సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవడం ద్వారా భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవచ్చు. విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, వ్యాపారులు ఇలా అన్ని రంగాలకు చెందిన వారు మానసిక సమస్యలకు లోనవుతూ మా వద్దకు వస్తున్నారు. అలాంటి వారిని కౌన్సెలింగ్ ద్వారా డిప్రెషన్ నుంచి బయటపడేలా చేస్తున్నాం.

–దీప్తి దామర్ల, సైకాలజిస్టు



**జీవనశైలి వ్యాధుల్లో ఒకటిగా...**

ఇప్పటివరకూ జీవనశైలి వ్యాధులుగా మధుమేహం, హైపర్‌టెన్షన్, ఒబెసిటీలను భావించేవాళ్లం. ఇప్పుడు డిప్రెషన్ కూడా వాటిలో వచ్చి చేరింది. ఆహారం సరిగా తీసుకోక పోవడం, నిద్రలేమి, శ్రమలేని జీవన విధానంతో మెంటల్ హెల్త్‌పై ప్రభావం చూపుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

**ప్రశాంత జీవితం అవసరం**

ప్రతి ఒక్కరికీ వత్తిడిలేని జీవన విధానంతో పాటు ప్రశాంతమైన జీవితం అవసరం. సరైన ఆహార నియమాలు పాటించడం, మంచి నిద్ర, వ్యాయామం ఉండాలి. భావోద్వేగాలను అదుపులో ఉంచుకుని పాజిటివ్ ఎమోషన్స్‌ను అలవర్చుకోవాలి. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఆత్మస్థైర్యంతో పరిష్కరించుకోవాలి. కోవిడ్ తర్వాత మానసిక సమస్యలు మరింత పెరిగాయి.

–డాక్టర్ వి.రాధికారెడ్డి, మానసిక వైద్య నిపుణులు, జేడీ, డీఎంఈ కార్యాలయం



# జై భవానీ..





ఇంద్రకీలాద్రిపై క్యూలైన్‌లో భవానీలు, భక్తులు

- భక్తులతో కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి
- దుర్గమ్మ సన్నిధిలో కొనసాగుతున్న రద్దీ
- ఎరుపెక్కిన స్నానఘాట్లు, క్యూలైన్లు, కనకదుర్గనగర్
- నేటి నుంచి ఆర్జిత సేవలు యథాతథం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దసరా ఉత్సవాలు ముగిసినప్పటికీ భక్తులు, భవానీల రద్దీ ఇంకా కొనసాగుతూనే ఉంది. శుక్రవారం కావడంతో భవానీలతో పాటు సాధారణ భక్తులు కూడా పెద్ద సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం ఒక్క రోజే సుమారు 80 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారికి నిత్య అలంకరణ, పూజలు, ఖడ్గమాలార్చన నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారిని దర్శించుకుని ఇరుముడులను సమర్పించి, దీక్షలు విరమించేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసిన భవానీలు తొలుత పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. భవానీల రాకతో కనకదుర్గనగర్, స్నానఘాట్, ప్రసాదాల కౌంటర్లు, క్యూలైన్లు అరుణ వర్ణం పులుముకున్నాయి. అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు భక్తులు, భవానీలు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. రూ.500 వీఐపీ టికెట్లతో పాటు రూ.300 టికెట్లు, రూ.100 టికెట్లను దేవస్థానం విక్రయించింది. ఓ దశలో భవానీల రద్దీతో ఆలయ ప్రాంగణంలో అన్ని క్యూలైన్లు రద్దీగా ఉండటంతో ఆలయ అధికారులు టికెట్ల విక్రయాలను నిలిపివేశారు. అన్ని క్యూలైన్లలో భవానీలు, భక్తులను ఉచితంగా దర్శనానికి అనుమతించారు. కుమ్మరిపాలెం, ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గనగర్ల వద్ద పోలీసులు ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నియంత్రించారు. కొండపైకి ఎటువంటి ప్రయివేటు వాహనాలను అనుమతించలేదు. వీఐపీల పేరిట కొండపైకి వచ్చే వారిని రూ.500 టికెట్టు క్యూలైన్‌లోకి మాత్రమే అనుమతించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



మంత్రి కొట్టు సత్యనారాయణకు అమ్మవారి ప్రసాదాన్ని అందజేస్తున్న ఈఓ భ్రమరాంబ

**ఒక్కొక్కరికి 5 లడ్డూలే...**

భవానీలు, భక్తుల రద్దీ కొనసాగుతుండటంతో ఒక్కొక్కరికి 5 లడ్డూలను మాత్రమే విక్రయించాలని దేవస్థాన అధికారులు నిర్ణయించారు. కనకదుర్గనగర్‌లో దేవస్థానం ఏర్పాటు చేసిన లడ్డూ కౌంటర్లలో తెల్లవారుజాము నుంచి లడ్డూలకు రేషన్ విధించారు. దీంతో లడ్డూల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్‌లో భక్తులు బారులు తీరి కనిపించారు.

**నేటి నుంచి ఆర్జిత సేవలు**

దసరా ఉత్సవాలు ముగియడం, భవానీల రద్దీ తగ్గుముఖం పట్టడంతో శనివారం నుంచి అమ్మవారికి నిర్వహించే అన్ని ఆర్జిత సేవలు యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించారు. శనివారం తెల్లవారుజామున ఖడ్గమాలార్చనకు టికెట్ల విక్రయాలు ప్రారంభం కాగానే అన్ని టికెట్లు నిమిషాలలోనే విక్రయించారు. మరో వైపున అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే శ్రీచక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, శాంతి కల్యాణం, చండీ హోమం టికెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి.

# గడువులోగా పూర్తి చేయాలి

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు**



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యత భవనాలు అయిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ప్రస్తుత ప్రగతిని కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం ఆర్డీవోలు, స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలను నవంబర్ 30 నాటికి పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించామన్నారు. జిల్లాలో 268 గ్రామ సచివాలయాలు, 260 రైతు భరోసా కేంద్రాలు, 239 డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మాణాలు చేపట్టవలసి ఉండగా వీటిలో ఇప్పటికే 156 గ్రామ సచివాలయాలు, 85 రైతు భరోసా కేంద్రాలు, 62 డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తిచేశామన్నారు. నేటి వరకు ప్రారంభం కాని, బిలో బేస్మెంట్ స్థాయిలో ఉన్న 83 గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. బిలో బేస్మెంట్ స్థాయిలో ఉన్న 194 భవనాలను రూఫ్ లెవెల్‌కు, రూఫ్ లెవెల్ స్థాయిలో ఉన్న 44 భవన నిర్మాణాలను ఫినిషింగ్ స్థాయికి తీసుకురావాలన్నారు. ఫినిషింగ్ స్థాయిలో ఉన్న 39 భవన నిర్మాణాలను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ కారణాలతో నిర్మాణాలను చేపట్టని భవనాలను, ముఖ్యంగా కోర్టు కేసులు, పల్లంలో ఉన్న స్థలాలలో మెరక చేయటం తదితర సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రారంభింప చేయాలని కలెక్టర్ అన్నారు. బిల్లుల చెల్లింపులకు జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు దశల వారీగా అప్‌లోడ్ చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఢిల్లీ రావు అధికారులను ఆదేశించారు.

# భూ సేకరణ పనులు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు

**డీఆర్వో వెంకటేశ్వర్లు**

చిలకలపూడి(మచిలీపట్నం): జగనన్న లేఅవుట్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు భూసేకరణకు సంబంధించిన పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో ఆయా మండలాలకు సంబంధించిన తహసీల్దార్లు, సహకారశాఖ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గృహ నిర్మాణ పథకం, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల వివరాలను సేకరించి ఇంకా భూసేకరణ చేయాల్సి ఉంటే వాటికి ప్రతిపాదనలు పంపాలన్నారు. జగనన్న పాలవెల్లువ పథకం అమలు కోసం మంజూరైన బల్క్‌మిల్క్ చిల్లింగ్ సెంటర్ల ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలో రీ-సర్వే నిర్దేశించిన గ్రామాల్లో త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీసీవో ఫణికుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు ఎం హరినాథ్, ఎస్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

# జల కాలుష్యానికి కట్టడి

- మిషన్ క్లీన్ కృష్ణా కింద కాలువ గట్ల సుందరీకరణ
- మూడు ప్రధాన కాలువల్లో వ్యర్థాల తొలగింపు
- ఈ నెల 31 వరకు అవగాహన కార్యక్రమాలు



కాలువ గట్ల వెంబడి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సాక్షి ప్రతినిధి, విజయవాడ: నగరంలో కాలువలను పరిశుభ్రంగా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మిషన్ క్లీన్ కృష్ణా కింద కెనాల్ బండ్ క్లీనింగ్, సుందరీకరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 2 నుంచి 31 వ తేదీ వరకు కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. నగరంలో ఉన్న మూడు ప్రధాన కాలువలు బందరు, ఏలూరు, రైవస్ కాలువలకు సంబంధించి కెనాల్ బండ్ ఫీల్డ్ సర్వే చేస్తున్నారు. ఇందులో భాగంగా కాలువ గట్ల వెంబడి ఉన్న ఆక్రమణలు, పరిసర ప్రాంతాల్లో ఉండేవారికి టాయిలెట్లు, కామన్ టాయిలెట్ల రిపేరు పనులు చేస్తున్నారు. కాలువల పక్కన ఉన్న చెత్త, వ్యర్థాలను క్లీన్ చేసి, ఆ చెత్త మొత్తాన్ని డస్ట్ బిన్స్‌లో వేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా కాలువలకు సమీపంలో ఉన్న ఘన, ద్రవ వ్యర్థాలను నేరుగా పారవేస్తున్న స్థానిక వ్యాపారులు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలకు వీఎంసీ సిబ్బంది నోటీసులు జారీ చేసి, అవగాహన కల్పిస్తున్నారు.

**నీటి కాలుష్య నివారణలో భాగంగా...**

నీటి కాలుష్య నివారణలో భాగంగా నగర కమిషనర్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. కాలువల పక్కన ఉన్న చెత్త, వ్యర్థాలను క్లీన్ చేసి, ఆ చెత్త మొత్తాన్ని డస్ట్‌బిన్స్‌లో వేస్తున్నారు. నగర ప్రజలు నిత్యం వ్యర్థాలను కాలువల్లో వేయటం వలన దిగువ ప్రాంత ప్రజలు వ్యవసాయ, తాగునీటి అవసరాలకు వినియోగించే నీరు కలుషితమవుతోంది. ప్లాస్టిక్, లిక్విడ్, నివాస, వాణిజ్య వ్యర్థాలను కాలువల్లో వేయడం వలన కలిగే దుష్ఫలితాల గురించి, కాలువల పక్కన నివసించే ప్రజలకు విపులంగా వివరిస్తున్నారు. జలకాలుష్యాన్ని తగ్గించే విధంగా చర్యలు చేపడుతున్నారు. కాలువ గట్లను సుందరీకరణ చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు

**కాలువల సుందరీకరణ చేస్తున్నాం...**



నగరంలో ఉన్న మూడు కాలువలను క్లీన్ చేసి, సుందరీకరణ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా కెనాల్ బండ్ ఫీల్డ్ సర్వే చేస్తున్నాం. కెనాల్ బండ్ క్లీనింగ్‌లో భాగంగా అక్టోబరు 31 వ తేదీ వరకు ప్రజలకు అవగాహన కలిగిస్తున్నాం. కాలువ గట్లను శుభ్రం చేసి, మొక్కలు నాటడంతో పాటు, వాకింగ్ ట్రాక్‌లుగా మార్చి, నగర వాసులకు ఆహ్లాదం పంచే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

–స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నగర కమిషనర్, విజయవాడ

**ఐదు విభాగాల భాగస్వామ్యంతో...**

కాలువ వంతెనలకు ఫెన్సింగ్, సమాచార సూచిక బోర్డులు ఏర్పాటు చేసి డంపింగ్‌ను అరికట్టేందుకు నగర పాలక సంస్థ శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. ప్రతి పౌరుడు తమ చుట్టూ ఉన్న పరిసరాలను తమదిగా భావించి ఎల్లప్పుడూ పరిశుభ్రత పాటిస్తూ అందుకు అనుగుణంగా నడుచుకున్నప్పుడే మార్పు సాధ్యం అవుతుందని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పూల వ్యర్థాలను వేయడానికి డంపర్ బిన్‌లు ఇస్తున్నారు. ఈ మిషన్‌లో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఉద్యాన, యూజీడీకి చెందిన ఐదు విభాగాలను భాగస్వామ్యులుగా చేస్తున్నారు.

# మరింత మెరుగ్గా పనిచేయాలి

**మేయర్, కమిషనర్‌లకు సీఎం సూచన**

పటమట(విజయవాడ తూర్పు): కేంద్ర ప్రభుత్వ పట్టణ, గృహకల్ప శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్ – 2022 లో విజయవాడకు ఇటీవల 5 వ ర్యాంకు సాధించిన నేపథ్యంలో వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి అవార్డులను చూపించారు. సీఎం కార్యాలయంలో మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, డైరెక్టర్ శ్రీలక్ష్మితో పాటు కలిసిన వీఎంసీ బృందంకు ఆయన శుభాకాంక్షలు చెప్పారు. కీపిట్ అప్ విజయవాడ అని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో మరింత మెరుగ్గా పనిచేయాలని సూచించారు. విజయవాడలో ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ చేస్తున్నామని, సేకరించిన చెత్తను ప్రాసెస్ చేస్తున్నామని మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ సీఎంకు వివరించగా విజయవాడ నగర వాసులకు మౌలిక వసతులు ఇంకా మెరుగ్గా సమకూర్చాలని చెప్పారు. సీఎంను కలిసిన వారిలో వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి ఉన్నారు.

## క్లుప్తంగా

### అంతరిక్ష వినియోగంలో భారత్ ముందంజ

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విజ్ఞాన భారతి సలహాదారు భరత్‌కుమార్

గుంటూరు రూరల్: అంతరిక్ష వినియోగంలో ప్రపంచ దేశాలకు దీటుగా భారతదేశం ముందువరుసలో ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విజ్ఞానభారతి సలహాదారుడు భరత్‌కుమార్ తెలిపారు. నగర శివారుల్లోని లాంలో ఉన్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా ఇస్రో, కళాశాల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి ఆయన మాట్లాడుతూ అంతరిక్ష ప్రయోజనాలను విద్యార్థులు, సామాన్య ప్రజలు తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేబీ చంద్రశేఖర్ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ గణనీయమైన పాత్రను పోషిస్తోందన్నారు. ఇస్రో డెప్యూటీ డైరెక్టర్ టీఎస్ రఘురామ్ మాట్లాడుతూ ఇప్పటివరకూ 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టామని తెలిపారు. అంతరిక్షంపై జరిగే పరిశోధనలు విద్యార్థులు తెలుసుకునేందుకు వరల్డ్ స్పేస్ వీక్ 2022 నిర్వహించడం జరుగుతోందన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సుజిత్ కుమార్ మాట్లాడుతూ సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ (ఇస్రో, శ్రీహరికోట) సమాజానికి ఉపయోగపడే ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపి తగిన సమాచారం ఇస్తోందని తెలిపారు. భారత రక్షణ వ్యవస్థకు సంబంధించి పృథ్వీ, ఆకాశ్, త్రిశూల్ వంటి క్షిపణులను తయారు చేస్తున్నారన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌ను జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్, ఇస్రో శాస్త్రవేత్తలు ఎస్.శంభుప్రసాద్, టి.శ్రీనివాసరెడ్డి, పి.లీలానాగేశ్వరరావు, సిద్ధార్థ పాల్గొన్నారు.

## వినియోగదారుల చట్టంపై విస్తృతంగా అవగాహన

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారుల రక్షణ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి తొలి సమావేశం కలెక్టర్ ఢిల్లీరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020 జూలై నుంచి వినియోగదారుల నూతన చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. దీని గురించి సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించాలని కోరారు. లఘు చిత్రాలు, వాల్ పోస్టర్లు, కరపత్రాల ద్వారా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, షాపింగ్ మాల్స్, హోటల్స్, జ్యుయలరీ షాపులు కళాశాలల్లో వినియోగదారుల రక్షణ చట్టాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. గతంలో వినియోగదారుడు వస్తువును ఎక్కడ కొనుగోలు చేస్తే అక్కడే ఫిర్యాదు చేయాల్సి వచ్చేదని, నూతన చట్టం ప్రకారం దేశంలో ఎక్కడ వస్తువును కొనుగోలు చేసినా వినియోగదారుడు నివాసం ఉంటున్న ప్రాంతంలోనే ఫిర్యాదు చేసే అవకాశం ఉందన్నారు. ఉత్పత్తులలో ఎటువంటి లోపం ఉన్నా దానిని తయారు చేసిన తయారీదారుడుతో పాటు, విక్రయించిన వారు, ప్రచారం నిర్వహించేవారు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నూతన చట్టం ప్రకారం వినియోగదారుడు తాను కొనుగోలు చేసిన వస్తువులలో నాణ్యత లోపం ఉంటే 21 రోజుల లోపు స్థానిక వినియోగదారుల కోర్టులో ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. లీగల్ మెట్రాలజీ అధికారులు మరింత కఠినంగా వ్యవహరించి తూనికలు, కొలతలు, వస్తువుల నాణ్యత వంటి విషయాలలో వినియోగదారులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలో వినియోగదారుల క్లబ్‌లను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. జాయింట్ కలెక్టర్, వైస్ చైర్మన్ ఎస్. నుపూర్ అజయ్ కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, కన్వీనర్ పి. కోమలిపద్మ, వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు కె. వెంకటేశ్వరరావు, కె. శ్రీనివాసరావు, యం.భాస్కర్, తరుణ్, కె.వి.వి. ప్రసాద్, కృష్ణమోహన్, మహమ్మద్ బాబి, ఎ. రత్నలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ యం.సుహాసిని, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎ. కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా రీ సర్వే పనులు

జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న జేసీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రీ సర్వే పనులు వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్ తెలిపారు. జేసీ కార్యాలయం నుంచి జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాల రీసర్వే పనులపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, వీఆర్వోలతో శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వే పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జగ్గయ్యపేట, కంచికచర్ల, ఏ. కొండూరు, తిరువూరు, విస్సన్నపేట, గంపలగూడెం మండలాల్లోని గ్రామాల్లో పనుల వేగం పెంచాలని సూచించారు. 14 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ మరో 14 గ్రామాల్లో గ్రౌండ్ వాలిడేషన్, 41 గ్రామాల్లో డ్రోన్ ఫ్లయింగ్ పూర్తయిందన్నారు. జిల్లాలో మొత్తం 136 గ్రామాల్లో రీ సర్వే చేయాలన్నారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన రీ సర్వే పనుల ధ్రువపత్రాలను పునఃపరిశీలన చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసర్ కె. సూర్యారావు పాల్గొన్నారు.


## ఉపాధ్యాయుడు సస్పెన్షన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలోని గంపలగూడెం మండలం మల్లెంపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఎస్. రంగనాథ్‌ను సస్పెండ్ చేస్తూ డీఈఓ సీవీ రేణుక శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాడు- నేడు పనులకు సంబంధించిన ఇసుకను దారి మళ్లించి వేరే వ్యక్తులకు విక్రయించినట్లు ఆరోపణలు వచ్చాయి. సిమెంట్, ఇనుము కొనుగోలు, సరఫరాలోనూ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. విధుల పట్ల నిర్లక్ష్య వైఖరి, ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా వ్యవహరించినట్లు ఎంఈవో, తహసీల్దార్ ఇచ్చిన నివేదిక ఆధారంగా సస్పెండ్ చేశారు.

### గడప గడపకు..



నందిగామ నియోజకవర్గం అడవిరావులపాడు గ్రామంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



విజయవాడలోని 61 డివిజన్ 261వ సచివాలయ పరిధిలో వృద్ధుడికి సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

# శాంతిదూత స్ఫూర్తి గాంధీహిల్

మహాత్ముడి బోధనలు చాటుతున్న గాంధీహిల్

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): స్వాతంత్ర్య సమరంలో కోట్లాది మందికి మార్గదర్శకం చేసిన మహనీయుడు మహాత్మాగాంధీ. ఆయన స్ఫూర్తిని దశదిశలా విస్తరింపజేసేందుకు, ఆయన అడుగు జాడలను కొనసాగించేందుకు నగరంలో ఏర్పాటు చేసిన స్మారక ప్రాంతమే గాంధీహిల్. మహాత్మాగాంధీ స్మారకార్థం దేశంలోని ఆరు ప్రాంతాల్లో గాంధీ స్మారక సంస్థ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రైల్వేస్టేషన్‌కు పశ్చిమ వైపున సుమారు 18 ఎకరాల విస్తీర్ణం కలిగిన కొండపై గాంధీ స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 1921లో మహాత్మాగాంధీ నగరానికి వచ్చి ఆలిండియా కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొన్నారు. అదే సందర్భంలో పింగళి వెంకయ్య జాతీయ పతాక నమూనాను బాపూజీకి చూపించారు. గాంధీజీ బోధనలను నేటి తరానికి తెలియజేయాలనే లక్ష్యంతో ఆయన స్మారకార్థం ఈ కొండ ప్రాంతాన్ని ఎంపిక చేసి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

**1962లో శంకుస్థాపన...**

ప్రస్తుతం గాంధీహిల్‌గా పిలువబడుతున్న ఈ కొండపై గాంధీ స్మారక కేంద్రానికి 1962 నవంబర్ 9వ తేదీన అప్పటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి శంకుస్థాపన చేశారు. 1968 అక్టోబర్ 6వ తేదీన అప్పటి రాష్ట్రపతి జాకీర్‌హుస్సేన్ దీనిని ఆవిష్కరించారు. అప్పటి నుంచి ఈ కొండను గాంధీకొండగా పిలుస్తున్నారు. అంతేకాకుండా నగరంలోని పర్యాటక ప్రాంతాల్లో ఒకటిగా ఇది బాసిల్లుతోంది.




గాంధీహిల్‌ను సందర్శిస్తున్న గాంధీజీ ముని మనుమడు ఆనంద్‌గోఖలే (ఫైల్)



గాంధీహిల్‌పై గాంధీజీ మనుమడు ఆచార్య రాజమోహన్‌గాంధీ దంపతులు (ఫైల్)

**52 అడుగుల ఎత్తయిన స్థూపం...**

గాంధీస్మారక కేంద్రంగా ఏర్పాటు చేసిన ఈ కొండపై 52 అడుగుల ఎత్తైన స్థూపాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్థూపం కోసం గుంటూరు జిల్లా రెంటచింతల నుంచి తెప్పించిన ఎర్ర మార్బుల్ రాయిని వినియోగించారు. స్థూపంపై ఎంతో అందంగా నడుస్తున్న బాపూజీ చిత్రాన్ని అత్యంత సుదరంగా రూపుదిద్దారు. దాని దిగువన చుట్టూ గాంధీజీ బోధనలను లిఖించారు. స్థూపాన్ని చూడగానే గాంధీజీ ఆశయాలు, ఆయన సిద్ధాంతాలు మన కళ్ల ముందు కదలాడతాయి. కొండపైన ఎత్తైన ప్రాంతంలో దీనిని ఏర్పాటు చేయడంతో అక్కడి నుంచి నగర సుందర రూపాన్ని తిలకించి ఆనందించవచ్చు.



గాంధీహిల్‌పై ఉన్న గాంధీజీ స్థూపం

**స్మారక గ్రంథాలయం**

ఈ కొండపైన స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఏడాదే గ్రంథాలయాన్ని సైతం నెలకొల్పారు. ఇక్కడ గాంధీజీకి సంబంధించిన అనేక పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. గాంధీజీ జీవితాన్ని ఈ గ్రంథాలయం ఆవిష్కరిస్తుంది. వేలాది సంఖ్యలో ఉన్న సాహితీ గ్రంథాలు గాంధీజీ గురించి తెలుసుకోవాలనుకునే వారికి ఉపయోగపడతాయి. త్వరలోనే గ్రంథాలయం నూతన నిర్మాణంతో అందుబాటులోకి రానుంది.

**అలరించే పిల్లల రైలు...**

గాంధీహిల్‌పై అందరినీ అలరించే మరో ఆకర్షణ టాయ్‌ట్రైన్. భూమికి సుమారు రెండు వందల అడుగుల ఎత్తులో కొండ చుట్టూ తిరిగే విధంగా 1969లో టాయ్ ట్రైన్ ఏర్పాటు చేశారు. దీనిపై ప్రయాణం చేస్తూ విజయవాడ నగర అందాలను తిలకించవచ్చు. ఈ ట్రైన్‌ను చిన్నారులు ఎక్కి నగర అందాలను తిలకిస్తూ కేరింతలు కొడుతుంటారు.

**గాంధీహిల్‌ను సందర్శించిన గాంధీజీ వారసులు..**

రెండేళ్ల క్రితం గాంధీజీ మనమడు, చరిత్రకారుడు ఆచార్య రాజమోహన్‌గాంధీ దంపతులు గాంధీహిల్‌ను సందర్శించి ఆనందాన్ని వ్యక్తం చేశారు. విజయవాడ నగర వాసులు తమ తాతగారిని ఎంతగా ప్రేమిస్తున్నారో ఈ ప్రాంతం తెలియజేస్తోందని వారు సంతోషం వ్యక్తం చేశారు. గత 2019 సెప్టెంబర్ మాసంలో గాంధీజీ ముని మనమడు ఆనంద్ గోఖలే గాంధీహిల్‌ను సందర్శించి తమ తాతకు నివాళులర్పించారు. గాంధీహిల్ ప్రాంతాన్నంతా పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు.

### ఉమ్మడి రాష్ట్రంలో తొలి నక్షత్ర ప్రదర్శనశాల...

ప్రముఖ ఇంజినీర్ డాక్టర్ కేఎల్ రావు కృషి ఫలితంగా నక్షత్రశాలను 1971 జూన్ 19వ తేదీన అప్పటి ఉప రాష్ట్రపతి గోపాల్ స్వరూప్ పథక్ ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో తొలిగా ఏర్పాటు చేసిన నక్షత్ర ప్రదర్శన శాల ఇదే. అనంతరం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఇటువంటి ప్రదర్శనశాలలు ఏర్పాటయ్యాయి. దీని ద్వారా ఖగోళ శాస్త్రానికి సంబంధించిన పలు అంశాలు తెలుసుకోవడానికి అవకాశముంటుంది. ప్రస్తుతం ఇది కూడా తాత్కాలికంగా మూసివేశారు. త్వరలోనే దీనిని కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.



## ఎస్‌ఐ విధులు అడ్డుకున్న ముగ్గురిపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళా ఎస్‌ఐను అసభ్యకరంగా మాట్లాడడమే కాకుండా విధులను అడ్డుకున్న వ్యక్తులపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. కత్తి సరళ వన్ టౌన్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం కుమ్మరిపాలెం సెంటర్‌లో ఆమె విధులు నిర్వర్తిస్తున్నారు. దసరా అనంతరం భవానీ భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కుమ్మరిపాలెం నుంచి సితారా సెంటర్ వైపు ట్రాఫిక్ మళ్లించారు. కుమ్మరిపాలెం సెంటర్‌లో బారికేడ్స్ ఏర్పాటు చేశారు. కుమ్మరిపాలెం నుంచి దుర్గగుడి వైపు నాలుగు చక్రాల వాహనాలను అనుమతించడం లేదు. ఉదయం 9 గంటల సమయంలో భవానీపురం వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఓ కారును బారికేడ్స్‌కు అడ్డంగా పెట్టారు. ద్విచక్ర వాహనాలు వెళ్లకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. ఆ సమయంలో విధి నిర్వహణలో ఉన్న కత్తి సరళ, హోం గార్డు జయకర్ కారులో ఉన్న వారిని వారించి సితారా వైపు వెళ్లాలని సూచించారు. దర్శనానికి వెళ్లాలనుకుంటే పార్కింగ్‌లో కారు పెట్టి వెళ్లాలని సూచించారు. అవేవీ పట్టించుకోని కారు డ్రైవర్, మరో ఇద్దరు వ్యక్తులు కారులో నుంచి ఎస్‌ఐతో వాగ్వాదానికి దిగారు. ఆమెతో అనుచితంగా మాట్లాడి బారికేడ్స్ నెట్టివేసి కారును వేగంగా నడుపుతూ వెళ్లిపోయారు. తన విధులను అడ్డుకున్న ముగ్గురు వ్యక్తులపై ఎస్‌ఐ సరళ భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జాతీయ రహదారి విస్తరణపై ప్రత్యేక దృష్టి

జేసీ మహేష్‌కుమార్

కంకిపాడు: జాతీయ రహదారి విస్తరణ ప్రతిపాదిత అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించామని జాయింట్ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి వెంబడి గోసాల సెంటరులో రోడ్డు విస్తరణ ప్రతిపాదిత స్థలాన్ని శుక్రవారం జేసీ పరిశీలించారు. రోడ్డు విస్తరణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రాధాన్యతలపై సిబ్బందితో సమీక్షించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విస్తరణ చేపట్టాల్సిన అంశాలపై ఎన్‌హెచ్ అధికారులతో సమీక్షిస్తామని పేర్కొన్నారు. విస్తరణతో కలిగే ప్రయోజనాలను తహసీల్దార్ టీవీ సతీష్ వివరించారు. అనంతరం దావులూరు రైస్‌మిల్లులో ధాన్యం సేకరణ రికార్డులను తనిఖీ చేశారు. ధాన్యం ఆడే నూతన యూనిట్ పనితీరు వివరాలు తెలుసుకున్నారు. ఆర్‌ఐ వెంకటరమణ, సర్వేయరు భాస్కర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా చండీహోమం

- వన్‌టౌన్ పీఎస్‌లో జరిగిన పూర్ణాహుతిలో టీకే రాణా
- పోలీసు అధికారులకు, పేదలకు అన్నదానం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): దసరా శరన్నవ రాత్రి మహోత్సవాల ముగింపు పురస్కరించుకొని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం అన్నసమారాధన చేశారు. దసరా ఉత్సవాల సందర్భంగా స్టేషన్ ప్రాంగణంలో కలశాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ముగింపు సందర్భంగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో చండీహోమం చేశారు. పూర్ణాహుతి కార్యక్రమానికి సీపీ టి.కె.రాణా, పలువురు ఐపీఎస్ అధికారులు హాజరయ్యారు. పూర్ణాహుతి అనంతరం అన్నదానాన్ని సీపీ ప్రారంభించారు. రెండు వేల మంది పేదలకు స్టేషన్ ప్రాంగణంలో అన్నదానం చేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో పోలీసు శాఖ మంచి సేవలందించిందని కొనియాడారు. పోలీసు కుటుంబాలతో సీపీ స్టేషన్ ప్రాంగణంలో అన్నప్రసాదం స్వీకరించారు. జాయింట్ సీపీ, డీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.


వన్‌టౌన్ పీఎస్‌లో జరిగిన పూర్ణాహుతిలో సీపీ రాణా, ఏసీపీ హనుమంతరావు, సీఐ వెంకటేశ్వరరావు

**ఉత్సవాలను విజయవంతం చేశారు: సీపీ**
దసరా ఉత్సవాలను విజయవంతం చేశారని పోలీసు కమిషనర్ టీకే రాణా అన్నారు. స్టేషన్ ప్రాంగణంలో పూజల అనంతరం ఆయన సిబ్బందిని అభినందించారు. అధికారులందరూ కలిసికట్టుగా ఉత్సవాలను చక్కగా నిర్వహించారని కొనియాడారు. అనంతరం వన్‌టౌన్ పోలీసు సిబ్బందితో పాటుగా అధికారులతో కలిసి ఫొటో దిగారు. కార్యక్రమాలను సీఐ వెంకటేశ్వరరావు, ఏసీపీ హనుమంతరావు పర్యవేక్షించారు.


అన్నదానం ప్రారంభిస్తున్న సీపీ

# రేపు 2కే, 5కే నడక, పరుగు

మహిళల ఆరోగ్యం, బాలికా విద్యపై అవగాహనకు..

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళల్లో రుతు సమస్యలు, బాలికా విద్యపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ నెల 9న పీపుల్ ఫర్ రూరల్ అండ్ అర్బన్ ఎడ్యుకేషన్ (ప్యూర్) ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్యూర్‌థాన్-2022 పేరుతో 2కే, 5కే నడక, పరుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఈవో హేమ కంఠమనేని తెలిపారు. బెంజిసర్కిల్ సమీపంలోని హోటల్ ఐరాలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. 2కే, 5కే నడక, పరుగుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. హేమ మాట్లాడుతూ ప్యూర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా బాలికల్లో విద్య, మహిళలు రుతు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించడానికి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు హేమ తెలిపారు. ఆ రోజు ఉదయం 6.30 గంటలకు ఐజీఎం స్టేడియం వద్ద ఉన్న ఈట్‌స్ట్రీట్ నుంచి రెండు, ఐదు కి.మీల నడక, పరుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ రాణా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ నడక, పరుగులో ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. నడక, రన్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 9949769654కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేయించుకోవచ్చని తెలిపారు. వివిధ రకాల వినోద కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో పోలవరపు మణి, తరుణీ తరంగాలు అధ్యక్షురాలు రావి శారద, ఉపాధ్యక్షురాలు కె.స్వరూపరాణి, సభ్యులు కె.ఉషారాణి, రోటరీ మిడ్‌టౌన్ క్లబ్ అధ్యక్షుడు ఎం ప్రభు, ఐరా మేనేజింగ్ డైరెక్టర్ పర్వతనేని రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


ప్యూర్‌థాన్-2022 పోస్టర్ ఆవిష్కరిస్తున్న కంఠమనేని హేమ, రావి శారద, స్వరూపరాణి తదితరులు

# దర్గా పర్యవేక్షణ బాధ్యత ముజావర్లదే..

వక్ఫ్ బోర్డు ఛైర్మన్ ఖాదర్ బాషా

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ) : వక్ఫ్‌బోర్డు ఆదాయాన్ని పెంచేందుకు నగరంలోని సుప్రసిద్ధ హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్ దర్గా పర్యావేక్షకులను నియమించినట్లు ఏపీ వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ ఖాదర్ బాషా తెలిపారు. పలు కారణలతో చిరకాలంగా దర్గా విషయంలో వివాదం కొనసాగుతోందని పేర్కొన్నారు. తాము బోర్డు ఛైర్మన్ పదవిని స్వీకరించి కొత్త బోర్డు ఏర్పడ్డాక భవానీపురం హజరత్ సయ్యద్ గాలిబ్ షహీదు రెహమతుల్ ఆలై వారి దర్గా విషయాన్ని పరిశీలించామని తెలిపారు. హజరత్ సయ్యద్ గాలిబ్ షహీదు మహాత్ముల దర్గాలో నాలుగేళ్లుగా ముజావర్లు అద్దెకున్నవార్లు, వక్ఫ్ బోర్డు మధ్య నలుగుతున్న వివాదాన్ని తమ విజయవంతంగా పరిష్కరించామని పేర్కొన్నారు. గతంతో ఏడు శాతం మాత్రమే వక్ఫ్ బోర్డుకు లభిస్తున్న ఆదాయాన్ని ఇప్పుడు 25 శాతానికి పెంచగా దానికీ అంగీకారం లభించడం ఆనందదాయకమని తెలిపారు. వక్ఫ్‌బోర్డు సీఈవో అబ్దుల్ ఖాదిర్ ఇతర అధికారుల పర్యవేక్షణలో పరిష్కారం రూపొందించామని తెలిపారు. బాధ్యతను దర్గా ముజావర్ల కమిటీ అధ్యక్షుడు ముస్తాక్ అహమ్మద్ , సభ్యులకు అప్పగించినట్లు ఖాదర్‌బాషా వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యురాలు షబ్నంఅ ఫ్రోజ్, దర్గా ముజావర్లు పాల్గొన్నారు.


ముజావర్లకు బాధ్యతలు అప్పగిస్తున్న వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ ఖాదర్‌బాషా

## పావనీ.. పాహిమాం

దసరా ఉత్సవాలు ముగిసినా ఇంద్ర కీలాద్రిపై భక్తుల రద్దీ తగ్గలేదు. భవానీలతో పాటు సాధారణ భక్తులు కూడా అమ్మవారి దర్శనానికి తరలి వస్తుండటంతో క్యూలైన్లు భక్తజనంతో నిండిపోయాయి. జై భవానీ నామస్మరణ చేస్తూ భవానీలు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రసాదాల కౌంటర్ల వద్ద భక్తులు బారులు తీరి కనిపించారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







## దీక్షగా.. శుభ్రత

అమ్మవారి దర్శనానికి వస్తున్న భవానీ దీక్షాధారులు వారి దీక్షా వస్త్రాలను ఘాట్ల వద్ద వదిలేస్తున్నారు. వాటిని అక్కడ నుంచి తొలగించడానికి పారిశుద్ధ్య సిబ్బంది దీక్షగా.. విధులు నిర్వహిస్తున్నారు. ఘాట్లలోని వస్త్రాలను లారీలో ఎక్కించి తరలిస్తున్నారు. తర్వాత ఘాట్లను సిబ్బంది శుభ్రం చేస్తున్నారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







# బ్లడ్ గ్రూపులు వేరైనా.. కిడ్నీ మార్పిడి

లబ్బీపేట(విజయవాడతూర్పు): కిడ్నీ దాత, రోగి వేర్వేరు బ్లడ్ గ్రూపులైనా, ఏబీఓ ఇన్కంపేటబుల్ విధానంలో 14ఏళ్ల బాలికకు విజయవంతంగా కిడ్నీ మార్పిడి చేసినట్లు డాక్టర్ శరత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆస్పత్రి నెఫ్రాలజిస్ట్ జి. శరత్‌బాబు తెలిపారు. సూర్యారావుపేటలోని ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు కిడ్నీలు పాడైన 14 ఏళ్ల బాలికను చికిత్స నిమిత్తం తమ ఆస్పత్రికి తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఆమెకు డయాలసిస్ లేకుండా ప్రీ ఎంప్టివ్ కిడ్నీ మార్పిడి చేయాలని నిర్ణయించామన్నారు. బాలిక అమ్మమ్మ కిడ్నీ దానానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. బాలికది 'ఒ' బ్లడ్ గ్రూపు కావడంతో అదే బ్లడ్ గ్రూపు వారి నుంచి కిడ్నీ పొందాల్సి ఉందన్నారు. దానం చేసేందుకు ముందుకు వచ్చిన అమ్మమ్మది బి గ్రూపు అయినా అనేక ముందస్తు చికిత్సల ద్వారా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ తమ ఆస్పత్రిలో వేర్వేరు బ్లడ్ గ్రూపులు ఉన్న వారికి కిడ్నీ మార్పిడి చేయడం ఇది ఆరోసారని డాక్టర్ శరత్ బాబు తెలిపారు. సమావేశంలో ఆస్పత్రి ఎండీ వెంకట్రావు, రేడియాలజిస్ట్ డాక్టర్ ప్రశాంతి, యూరాలజిస్ట్ డాక్టర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ శరత్‌బాబు, ఇతర వైద్యులు, రోగి

## వెంకటస్వామికి నివాళి

భవానీపురం(విజయవాడ పశ్చిమ): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పీజీ సెంటర్, డిగ్రీ కాలేజీ, లా కాలేజీ వంటి విద్యాసంస్థలను స్థాపించి వెనుకబడిన వర్గాల ప్రజలకు విద్యను అందించిన విద్యాదాత జి. వెంకటస్వామి చిరస్మరణీయులని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమి హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్.సత్యనారాయణ కొనియాడారు. స్వాతంత్య్ర సమర యోధుడు, కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి (కాకా) జయంతి పురస్కరించుకుని గొల్లపూడి గ్రామంలోని అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్లో శుక్రవారం నివాళి కార్యక్రమం జరిగింది. తొలుత వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ 20 ఏళ్ల వయసులోనే సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్న వెంకటస్వామి ఏడుసార్లు ఎంపీగా గెలిచి 30 ఏళ్లపాటు లోక్‌సభలో కొనసాగారని గుర్తు చేశారు. వేలాది మంది పేదలకు గుడిసెలు వేయించి గుడిసెల వెంకటస్వామిగా పేరు పొందారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.డేవిడ్‌రాజు, డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సివిల్స్ అభ్యర్థులకు ఉచిత వర్క్‌షాపు

లబ్బీపేట(విజయవాడతూర్పు): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు మొదటి ప్రయత్నంలోనే సివిల్స్ సాధించడం ఎలా అనేఅంశంపై ఐదు రోజుల ఉచిత వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఛైర్మన్ పి.కృష్ణప్రదీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య పర్యవేక్షణలో నిర్వహించే వర్క్‌షాపులో యువ ఐఏఎస్‌లు రాహుల్ రెడ్డి, మకరంద్, ప్రతీక్‌షా, రాజర్షి, ముజ్జామిల్‌ఖాన్‌లు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. సదస్సులో సివిల్స్ సబ్జెక్ట్స్, ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ గైడెన్స్, ఆప్షనల్ ఎంపిక వంటి అంశాలపై అవగాహన కలిగించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 86862 33879లో సంప్రదించాలని సూచించారు.

# ఓపెన్‌ఫోరం, ఎల్ఆర్ఎస్ మేళాలో 6 అర్జీలు

పటమట(విజయవాడ తూర్పు): నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ఓపెన్‌ఫోరం, ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం)మేళాలో 6 అర్జీలు వచ్చాయి. చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఓపెన్‌ఫోరం విభాగంలో ఒక దరఖాస్తు వచ్చింది. సత్యనారాయణపురం సర్కిల్-2 కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఓపెన్‌ఫోరానికి 2 రాగా, ఎల్ఆర్ఎస్‌కు 2 దరఖాస్తులు రాగా పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎల్ఆర్ఎస్ మేళాకు ఒక దరఖాస్తు వచ్చింది. ఈ కార్యక్రమాల్లో వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అర్జీదారుల సందేహాలను నివృత్తి చేశారు. ఆయా కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమంలో టీపీవోలు, టీపీబీవోలు, టెక్నికల్ పర్సన్‌లు, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.


సర్కిల్-3 కార్యాలయంలో ఓపెన్‌ఫోరం, ఎల్ఆర్ఎస్ మేళాలో అర్జీలు స్వీకరిస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం అధికారి

## రేపు ఆధార్ అనుసంధానం ప్రత్యేక కార్యక్రమం

విజయవాడరూరల్: ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం ప్రత్యేక కార్యక్రమం ఆదివారం పోలింగ్ బూత్‌లలో ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ బి.సాయి శ్రీనివాస నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్క ఓటరూ ఆధార్ అనుసంధానం చేసుకోవాలని చెప్పారు.
ఆధార్‌కార్డు, ఏదైనా నివాసముంటున్నట్లుగా ధ్రువీకరణ పత్రం చూపించి అనుసంధానం చేసుకోవచ్చునని చెప్పారు. రేషన్‌కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, వంటగ్యాస్ కనెక్షన్, విద్యుత్ బిల్లు, ఇంటిపన్ను రసీదు, బ్యాంక్ పాస్‌పుస్తకం తదితర వాటిని కూడా పోలింగ్ కేంద్రాల్లో చూపించి మీ ఓటరు కార్డును అనుసంధానం చేసుకోవచ్చని వివరించారు. దీన్ని వినియోగించుకోవాలని కోరారు.



## వీడని వర్షం

అల్పపీడన ప్రభావంతో శుక్రవారం కూడా నగరంలో వర్షం కురిసింది. రోడ్లపై వాన నీరు నిలిచిపోయింది. వర్షం ఆగడం, మళ్లీ కురుస్తుండటంతో పాఠశాలలు, కాలేజీలు, కార్యాలయాల వేళల్లో నగర ప్రజలు ఇబ్బంది పడ్డారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







## క్లుప్తంగా

### తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఏపీ సర్కిల్ పరిధిలోని తపాలా ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎన్ఎఫ్‌పీఈ విజయవాడ డివిజన్ కన్వీనర్ ఎ.శ్రీనివాసరెడ్డి అన్నారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్, ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ సర్కిల్‌లో లేని విధంగా ఏపీలో ఉద్యోగులకు టార్గెట్లను పెట్టడం దారుణమన్నారు. ప్రైవేట్ సంస్థలతో పోటీగా ముందుకు సాగుతున్న ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమన్నారు. ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలను నిర్దేశిస్తూ కింది స్థాయి ఉద్యోగులను ఇబ్బందుల పాల్జేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

### మహాలక్ష్మి ఆలయంలో అన్నప్రసాద వితరణ



చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): దసరా ఉత్సవాల ముగింపు పురస్కరించుకుని చిట్టినగర్‌లోని మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు పూజలు చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. మహాలక్ష్మిని రైల్వే అధికారి డీఎస్ రామారావు దర్శించుకోగా, ఆలయ కమిటీ కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, ఇతర సభ్యులు ప్రసాదాలను అందజేశారు. సుమారు నాలుగు వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో పొట్నూరి దుర్గాప్రసాద్, పోతిన సాంబశివరావు, మజ్జి శ్రీనివాసరావు, పణుకు రమా, తొత్తడి భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వికేంద్రీకరణతో సమగ్ర అభివృద్ధి

సీఎం సంకల్పం నెరవేరాలని ప్రత్యేక పూజలు



చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం నెరవేరాలని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి కోరారు. డివిజన్‌లోని శివనాగ మందిరం, అమ్మవారి ఆలయంలో ఆదిలక్ష్మి ఆధ్వర్యాన శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో ఒక ప్రాంతమే అభివృద్ధి చెందాలని భావిస్తున్న నాయకుల మనసు మారాలని పూజలు నిర్వహించారు. అమ్మవారికి పెద్ద ఎత్తున కొబ్బరి కాయలు కొట్టి వికేంద్రీకరణ జరగాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, చిచ్చా, అయితా కిశోర్, బెవర రాము, రాళ్లపల్లి లక్ష్మి, టి.వరలక్ష్మి, ఆర్. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### జీవ వైవిధ్య సంరక్షణలో భాగస్వాములవుదాం



లబ్బీపేట(విజయవాడతూర్పు): జీవ వైవిధ్య సంరక్షణలో దేశ పౌరులుగా మనందరం భాగస్వాములు కావాలని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా స్టేట్ డైరెక్టర్ ఫరీదా టంపాల్ అన్నారు. జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఏపీ అటవీశాఖ, అమరావతి బోటింగ్ క్లబ్ సమన్వయంతో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా సంస్థ శుక్రవారం విజయవాడ సిటిజన్ ఫర్ బయోడైవర్సిటీ అనే కార్యక్రమం నిర్వహించింది. మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు. ఫరీదా టంపాల్ మాట్లాడుతూ నగరంలోని ఇంద్రకీలాద్రి చాలా అరుదైన మొక్కలు, పక్షులు సరీసృపాలకు నిలయంగా ఉందన్నారు. ఈ వైవిధ్య జాబితాను కళాశాల విద్యార్థులు తయారు చేయాలని పిలుపునిచ్చారు. ప్రకృతిలో జీవ వైవిధ్యాన్ని ఎలాంటి అంశాలు దెబ్బతీస్తున్నాయో తెలుసుకోవాలన్నారు. పక్షులు, రకరకాల కీటకాలు మొక్కలను ఎలా గుర్తించాలో వివరించారు. ఎన్టీఆర్ జిల్లా అటవీశాఖ అధికారి అప్పన్న, పీబీ సిద్ధార్థ కాలేజీ డైరెక్టర్ బాబూరావు, ప్రిన్సిపాల్ మేకా రమేష్, జంతుశాస్త్ర విభాగాధిపతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## స్కూళ్లలో డిజిటల్ తరగతుల ఏర్పాటుకు సన్నాహాలు

### వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో నాడు – నేడు కింద తొలి విడతలో అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాలల్లోని ఇంగ్లీష్ ల్యాబ్‌లలో బోధనకు కంటెంట్ సిద్ధమైందని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఇంగ్లీష్ మీడియం అమలు చేస్తున్న ప్రభుత్వం.. విద్యార్థులకు బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి టీచర్లకు శిక్షణ కూడా ఇచ్చిందని, మరోవైపు డిజిటల్ తరగతుల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతంలో కొత్తగా అభివృద్ధి చేస్తున్న ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక పార్కుల్లో పరిశ్రమలకు నీరందించేందుకు సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసిందని, సీమ ముఖ చిత్రాన్ని మార్చే ఈ రెండు పారిశ్రామిక పార్కులకు రూ.759 కోట్లతో శాశ్వత నీటి వసతి కల్పిస్తుందని వెల్లడించారు. పరిశ్రమల స్థాపనకు అన్ని విధాలుగా సాయం అందించే ఆంధ్రప్రదేశ్‌కి ప్రధాన తయారీదారులు రావాలని ఆయన కోరారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా కర్ణాటకలో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ షూ లేసులు ఊడిపోతే.. రాహుల్‌గాంధీ వాటిని సరి చేశారని, అయితే రాహుల్ తన ప్రేమాభిమానాలను తన తల్లి, చెల్లి, ఇతర కుటుంబ సభ్యులకే పరిమితం చేయకుండా కోట్లాది మంది భారతీయుల పైనా చూపితే బాగుంటుందని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

## మూడు రాజధానుల కోసం ముందడుగు

# బైక్‌లతో భారీ ర్యాలీ



అనకాపల్లిలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో ఎంపీ సత్యవతి



తణుకులో కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న గుబ్బల తమ్మయ్య, పార్టీ శ్రేణులు



మరకతలింగేశ్వరుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

- వర్షాన్ని సైతం లెక్కచేయక ముందుకు సాగిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- అయ్యన్న కుట్రను భగ్నం చేయాలి : ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్
- చింతలపూడిలో ర్యాలీలో ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు
- అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం : మంత్రి అమర్‌నాథ్
- మూడు రాజధానులకు మద్దతుగా అనకాపల్లి మండల సమావేశంలో తీర్మానం
- తణుకు, ఇరగవరం, అత్తిలిలో కొవ్వొత్తుల ర్యాలీలు

నాతవరం/అనకాపల్లి రూరల్/తణుకు అర్బన్/ఇరగవరం/ అత్తిలి/ప్రొద్దుటూరు : రాష్ట్రాన్ని విడదీసేందుకు చంద్రబాబు కుట్రలో భాగంగా సాగుతున్న అమరావతి పాదయాత్రను ఉత్తరాంధ్రలోకి అడుగు పెట్టకుండా అడ్డుకుంటామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. శుక్రవారం ఆయన వికేంద్రీకరణకు మద్దతుగా అనకాపల్లి జిల్లా నాతవరం మండలం పి.జగ్గంపేట నుంచి 1500 బైక్‌లతో గన్నవరం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా చేపట్టిన ర్యాలీకి ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభించింది. అడుగడుగునా మహిళలు హారతులిచ్చి సంఘీభావం తెలిపారు. పాదయాత్ర వచ్చే సమయానికి నర్సీపట్నం ప్రాంతంలో రౌడీలతో అల్లర్లు సృష్టించేందుకు మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కుట్ర పన్నారని, దానిని అందరూ కలిసి తిప్పికొట్టాలని ఎమ్మెల్యే గణేష్ పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా, అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం చింతలపూడిలో మూడు రాజధానులకు మద్దతుగా చేపట్టిన ర్యాలీలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొన్నారు. గిరిజనులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థులు, యువతీ యువకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కాగా, పాలనా వికేంద్రీకరణతోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి సాధ్యమనేది తమ ప్రభుత్వ విధానమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శుక్రవారం జరిగిన అనకాపల్లి మండల పరిషత్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మూడు రాజధానులకు మద్దతుగా అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. ఈ సమావేశంలో అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, జెడ్పీటీసీ వరలక్ష్మి హాజరయ్యారు.

**వికేంద్రీకరణతోనే అభివృద్ధి**

వికేంద్రీకరణతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజలు స్పష్టం చేశారు. మూడు రాజధానులకు మద్దతుగా పశ్చిమగోదావరి జిల్లా తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శనలు నిర్వహించారు. తణుకులో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు మండల అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, ఇరగవరంలో పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, అత్తిలిలో ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. దేవుడా.. బాబుకు మంచి బుద్ధి ప్రసాదించు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి మంచి బుద్ధిని ప్రసాదించాలని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పెన్నానది ఒడ్డునున్న అమృతేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానని తెలిపారు.

## బౌన్సర్లకు రూ.1,000.. నడుస్తున్న వారికి రూ.2,000

- రైతుల ముసుగులో పెయిడ్ ఆర్టిస్టులతో అమరావతి పాదయాత్ర
- ఓ సామాజికవర్గం ప్రయోజనాల కోసమే : మాల మహానాడు



సాక్షి, అమరావతి : టీడీపీ నిర్వహిస్తున్న అమరావతి పాదయాత్రలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న బౌన్సర్లకు రోజువారీగా రూ.వెయ్యి, నడిచేవాళ్ల ఇంటికి వారానికి రూ.రెండు వేలు పంపించి వారికి భోజన ఏర్పాట్లు చేస్తున్నారని.. ఇది ముమ్మాటికీ రైతుల ముసుగులో జరుగుతున్న పెయిడ్ ఉద్యమమేనని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు విమర్శించారు. ఈ విషయమై ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబుకు రాజకీయ లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో ఒక సామాజికవర్గం పథకం ప్రకారం ఈ యాత్రను తన భుజానికెత్తుకుని నిర్వహిస్తోందని, ఇందుకోసం రూ.వందల కోట్లు ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. నిజమైన రైతులు పాదయాత్ర నిర్వహిస్తే పెద్ద సంఖ్యలో బౌన్సర్లు ఎందుకని ఆయన ప్రశ్నించారు. అనేక ప్రాంతాల నుంచి డబ్బులిచ్చి జనాన్ని పాదయాత్రకు తరలిస్తున్నారని విమర్శించారు. మొత్తం పాదయాత్ర ఖర్చులు, ఏర్పాట్లు చేస్తున్న పెద్దలు ఏసీ కార్లలో కూర్చుని యాత్రను అనుసరిస్తున్నారని, ఊళ్లు లేని చోట వారు తమ తమ ఇళ్లకు వెళ్లి.. ఊళ్లు ఉన్న చోట జరిగే పాదయాత్రకు తిరిగి వస్తున్నారని తెలిపారు. అమరావతి నుంచి వచ్చే రైతులు లేకపోవడంతో పశ్చిమగోదావరి జిల్లాలో జరుగుతున్న పాదయాత్రకు టీడీపీ శ్రేణులను వాహనాలు పెట్టి డబ్బులిచ్చి తరలించారని పేర్కొన్నారు. అధికారం కోల్పోయిన అక్కసుతో చంద్రబాబు తన రాజకీయ లబ్ధి కోసం కుల, మత, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొడుతూ లబ్ధి పొందేందుకు ఇప్పుడు అమరావతి ప్రాంత వాసులను బలిచేస్తున్నారని ఆరోపించారు. అది అమరావతి కాదని, కమ్మరావతి అని యోనారాజు ఆరోపించారు.

## దొంగయాత్ర నవ్వుల పాలు కాక తప్పదు

740వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: అమరావతి పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారులు, టీడీపీ వర్గాలు చేస్తున్న దొంగయాత్ర నవ్వుల పాలు కాక తప్పదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 740వ రోజుకు చేరుకున్నాయి. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. రైతుల హక్కుల కోసమంటూ కొన సాగుతున్న పాదయాత్రలో ఉన్న హైఫై కంటైనర్ సౌకర్యాలు, ఫైవ్‌స్టార్ వసతులు చూసిన ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అమరావతి పేరుతో చంద్రబాబు అటు రైతులను ఇటు ప్రజలను మోసం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారంతో లక్షల కోట్లు దోపిడీ చేశాడని మండిపడ్డారు. అందరికీ సమాన ఫలాలు అందాలంటే పరిపాలనా వికేంద్రీకరణ తప్పదని, ఏపీలో సీఎం జగన్ ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయాన్ని యావత్ దేశం స్వాగతిస్తుందని తెలిపారు. తన అవినీతిని కాపాడుకునేందుకు చంద్రబాబు సృష్టించిన కృత్రిమ ఉద్యమమే అమరావతి అన్నారు. బాబు అండ్ కో ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ హక్కుల కోసం పోరాటం ఆగదన్నారు. గురునాథం, జోషి, దాసు, సాంబయ్య పాల్గొన్నారు.

# వికేంద్రీకరణ కోసం రాజీనామాకు సిద్ధం

- సీఎం అనుమతిస్తే మంత్రి పదవి వదిలేసి ఉద్యమం
- మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టీకరణ
- విపక్షాల విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపు
- మా ప్రాంతానికి వస్తూ మా అభివృద్ధికి అడ్డమేస్తారా?



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుమతిస్తే వికేంద్రీకరణకు మద్దతుగా మంత్రి పదవికి రాజీనామా చేసి ఉద్యమంలో చేరేందుకు సిద్ధంగా ఉన్నానని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రకటించారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా గార మండలం అంపోలులో శ్రీకాకుళం మార్కెట్ కమిటీ కార్యవర్గ అభినందన సభలో ఆయన మాట్లాడారు. రాజధాని మద్రాసులో ఉన్నప్పుడు 1,100 కిలోమీటర్లు, కర్నూలుకు వచ్చాక 800 కిలోమీటర్లు, హైదరాబాద్‌కు వచ్చాక 750 కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత వెంటనే రాజధాని వెతుక్కోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. పెద్ద నగరాల నిర్మాణం వద్దని, ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ విశాఖలో పెట్టండని అప్పట్లో కేంద్రం నియమించిన కమిటీలు చెప్పాయని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే విశాఖలో పాలన రాజధాని, కర్నూలులో హైకోర్టు, అమరావతిలో శాసన రాజధాని ఏర్పాటు చేసే దిశగా సీఎం జగన్ శ్రీకారం చుట్టారని తెలిపారు.

**చంద్రబాబుది రియల్ ఎస్టేట్ ఆలోచన**

అమరావతి రైతుల యాత్ర వెనుక చంద్రబాబు రియల్ ఎస్టేట్ ఆలోచన ఉందని మంత్రి ధర్మాన విమర్శించారు. విశాఖకు రాజధాని వస్తే మన ప్రాంతం విశేషంగా అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖకు రాజధాని అవకాశం వస్తే చంద్రబాబు వద్దనడం భావ్యం కాదన్నారు. ఆ ఆలోచన ప్రకారమే అక్కడి రైతుల పేరుతో కొందరు ఇక్కడికి యాత్రగా వస్తున్నారని చెప్పారు. అక్కడి నుంచి వస్తూ ఇక్కడి వారి నోట్లో మట్టి కొడితే ఎలా అని ప్రశ్నించారు.

**ఏమిటీ అన్యాయం?**

'ఈ ప్రాంతం యువత ఎక్కువ మంది ఉపాధి కోసం వలసపోతే.. వారి తల్లిదండ్రులు ఇక్కడే ఉంటూ కొన్ని సందర్భాల్లో మరణిస్తున్న దాఖలాలు ఉన్నాయి. వలస బతుకుల్లో శ్రీకాకుళం జిల్లా వాసులే అధికం. భవనాలు, బ్రిడ్జిలు ఎక్కడ కూలినా మన జిల్లా వాసులు ఉంటున్నారంటే మన పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలి. ఇంతటి దయనీయ పరిస్థితుల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు మాకు అన్యాయం చేస్తామనడం చంద్రబాబుకు తగదు' అని ధర్మాన మండిపడ్డారు. ప్రజలు ఎవరి దగ్గర తల వంచాల్సిన అవసరం లేదని, విపక్షాల విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

**అరసవిల్లి వచ్చి మా అభివృద్ధి వద్దంటారా?**

అరసవిల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకోవడానికి వస్తూ మా అభివృద్ధిని వద్దంటారా అని ధర్మాన ప్రశ్నించారు. దేశం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారని, అందుకు తామంతా సంతోషిస్తున్నామని, అలా అని మమ్మల్ని బాగుపడొద్దు అనడం సమంజసమా? అని ప్రశ్నించారు. అమరావతి యాత్ర వెనుక రాజకీయ కార్పొరేట్ శక్తులు ఉన్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ఉత్తరాంధ్ర వాసులు గళం వినిపించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో గార ఎంపీపీ, శ్రీకాకుళం రూరల్ ఎంపీపీలు గొండు రఘురామ్, అంబటి నిర్మలా శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ రాజధాని కోసం నేటి నుంచి రిలే దీక్షలు

- పెయిడ్ ఆర్టిస్టుల పాదయాత్రను అడ్డుకుంటాం
- ఈ ప్రాంత టీడీపీ నేతలు వాస్తవాలు ఆలోచించాలి
- మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

పోలాకి/సాక్షి, విశాఖపట్నం : మూడు రాజధానులకు మద్దతుగా శనివారం నుంచి శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట నియోజకవర్గ కేంద్రంలో రిలే దీక్షలు చేపడతామని మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రకటించారు. వికేంద్రీకరణలో భాగంగా విశాఖను పరిపాలనా రాజధానిగా చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కుట్రలతో అడ్డుకోజూస్తున్న వారిని అడ్డుకుని తీరతామని హెచ్చరించారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా పోలాకిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదుపై క్షేత్ర స్థాయిలో జరిగిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడు రాజధానులకు మద్దతుగా అవసరమైతే రాజీనామాలకు సైతం వెనుకాడబోమని స్పష్టం చేశారు. అమరావతి ఏకైక రాజధాని అంటూ వికేంద్రీకరణకు వ్యతిరేకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పెయిడ్ ఆర్టిస్టులతో జరుగుతున్న పాదయాత్రను జిల్లాలో అడుగుపెట్టనివ్వబోమని స్పష్టం చేశారు. చంద్రబాబు అండ్ కో ఇప్పుడు కూడా ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటే చూస్తూ ఊరుకోమన్నారు. పాలనా వికేంద్రీకరణపై తప్పుడు ప్రచారాలు చేస్తూ ఉత్తరాంధ్ర వెన్నెముక విశాఖను దొంగ దెబ్బ తీయాలని ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. రాష్ట్ర విభజనతో హైదరాబాద్‌ను కోల్పోయిన తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ.. తాత్కాలిక రాజధాని అంటూ కాలక్షేపం చేసిందన్నారు. అమరావతి కోసం లక్షల కోట్లు వెచ్చించే అవకాశం లేనప్పుడు ఊహల్లో బతకటం కన్నా అద్భుతమైన నగరం విశాఖను అభివృద్ధి చేయటంలో తప్పేంటని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రులైన టీడీపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు సైతం విశాఖ రాజధాని అవకాశాన్ని వినియోగించుకోవాలని, లేకపోతే రాజకీయంగా అవకాశం కల్పించిన ప్రజలకు అన్యాయం చేసినవారవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ సీనియర్ నాయకుడు బుర్రా ఆదినారాయణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

**అందరిబాగే మా అభిమతం ; మంత్రి కారుమూరి**

వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ బావుండాలని, అందులో అమరావతిలోని 29 గ్రామాలూ ఉండాలని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆకాంక్షించారు. అందరి బాగే తమ అభిమతమని చెప్పారు. విశాఖలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.లక్షల విలువ చేసే రిస్ట్ వాచ్‌లు, బెంజ్ కార్లు ఉన్న వాళ్లు మాత్రమే అమరావతి పేరుతో పాదయాత్రలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. భార్యలు మాత్రమే పాదయాత్రలు చేస్తున్నారని, వారి భర్తలెందుకు ఇందులో పాల్గొనడం లేదని ప్రశ్నించారు. పాదయాత్రలో పాల్గొన్న మహిళల భర్తలు బయటికి వస్తే రైతుల ముసుగులో టీడీపీ నేతలు చేస్తున్న యాత్ర అసలు రంగు బయట పడుతుందన్నారు. నాడు అమరావతి రైతుల తరఫున పోరాటాలు చేసి.. టీడీపీ వైఖరిని వ్యతిరేకించిన జనసేన, సీపీఐ, సీపీఎం, బీజేపీ.. ఇప్పుడు చంద్రబాబుకు వత్తాసు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

**అన్ని ప్రాంతాలు బాగుండాలన్నదే సీఎం ఆకాంక్ష**

మూడు రాజధానుల ఏర్పాటుతో మరోసారి రాష్ట్రం విడిపోకుండా అన్ని ప్రాంతాల్లోనూ సమానాభివృద్ధి జరగాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని మంత్రి కారుమూరి తెలిపారు. ఎన్ని పార్టీలు ఏకమైనా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వచ్చే నష్టమేమీ లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ వ్యతిరేక ఓటు చీలిపోకూడదంటూ పదే పదే పవన్ కల్యాణ్ మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. జాతీయ పార్టీ అంటూ కేసీఆర్ వచ్చినా.. కేసీఆర్ తాత దిగి వచ్చినా.. తమకు వచ్చే నష్టమేమీ లేదని స్పష్టం చేశారు. ఎంతమంది కలిసి వచ్చినా, వైఎస్ జగన్ సింహంలా సింగిల్‌గానే వస్తారని.. మరోసారి క్లీన్ స్వీప్ చేసి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఎడతెగని వర్షాలు

**ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో విస్తారంగా వానలు**

- పొంగిప్రవహిస్తున్న వాగులు, వంకలు, నదులు
- మరో 3 రోజులు వర్షాలు



వైఎస్సార్ జిల్లా కమలాపురంలోని పాపాగ్ని నదిపై పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా ఎడతెగని వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో బుధవారం మొదలైన వర్షాలు శుక్రవారం కూడా కొనసాగాయి. శ్రీకాకుళం, విజయనగరం, ఏలూరు, తూర్పుగోదావరి, ప్రకాశం, వైఎస్సార్, అనంతపురం, శ్రీసత్యసాయి, అనకాపల్లి జిల్లాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉంది. వైఎస్సార్ జిల్లా దువ్వూరులో అత్యధికంగా 13.98 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు జిల్లాల్లో వాగులు, వంకలు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. వరదలో ఒక వ్యక్తి గల్లంతయ్యాడు. ప్రస్తుతం కోస్తాంధ్ర నుంచి గుజరాత్ వరకు తెలంగాణ, మహారాష్ట్ర మీదుగా సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. దక్షిణ కోస్తాంధ్ర పరిసర ప్రాంతాల మీద ఏర్పడిన మరో ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం తెలంగాణకు ఆనుకుని ఉన్న విదర్భ మీద సగటు సముద్రమట్టానికి 1.5 నుంచి 3.1 కిలోమీటర్ల మధ్య ఎత్తులో కొనసాగుతోంది. కోస్తాంధ్ర నుంచి ఉత్తరాఖండ్ వరకు, తెలంగాణకు ఆనుకుని ఉన్న విదర్భ, మధ్యప్రదేశ్-ఉత్తరప్రదేశ్‌పై సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో మరో ద్రోణి వ్యాపించింది. వీటి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావాలతో మరో మూడురోజులు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుక్రవారం నివేదికలో తెలిపింది. అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని తెలిపింది.

**430 మండలాల్లో సగటున 10 మిల్లీమీటర్ల వర్షపాతం**

రాష్ట్రంలోని 670 మండలాలకుగాను 656 మండలాల్లో శుక్రవారం వర్షం కురిసింది. 430 మండలాల్లో సగటున 10 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 78 మండలాల్లో 5 నుంచి 10 మిల్లీమీటర్లలోపు, 55 మండలాల్లో 2.5 నుంచి 5 మిల్లీమీటర్లలోపు, 64 మండలాల్లో 2.5 మిల్లీమీటర్లలోపు వర్షపాతాలు నమోదయ్యాయి. పామూరులో 10.5 సెంటీమీటర్లు, దేవరాపల్లిలో 9.2, లక్ష్మీపురంలో 8.9, పోలవరంలో 5.6, చీడికాడలో 5.5, శ్రీకాకుళం 5.4, మార్కాపురంలో 5.2, పాలకొండలో 4.9, పెందుర్తిలో 4.3, లింగసముద్రంలో 4.3, గుడివాడలో 4.2, వంగరలో 4 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

### లోతట్టు ప్రాంతాలు మునక

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ఏజెన్సీ ప్రాంతంలో కొండ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇసుక కాలువ, పేడ్రాల కాలువ, గుంజవరం కాలువ పొంగాయి. వరద నీరు వచ్చి కలుస్తుండడంతో బలివే వద్ద తమ్మిలేరులో వరద ఉధృతి పెరిగింది. బలివే, దాని శివారు గ్రామం రంగంపేట, వలసపల్లి వద్ద, లోపూడిలోని ఉప్పువాగు చప్టా, ఇతర ప్రమాదకర వాగులున్న ప్రదేశాల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయంలోకి భారీగా చేరుతున్న వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. టి.నర్సాపురంలో ఏజెన్సీ ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద నీరు ఎర్రకాలువలోకి భారీగా చేరిన నీరు రోడ్లపై ప్రవహించింది. విజయనగరం జిల్లాలో చెరువులు పూర్తిస్థాయిలో నిండిపోయాయి. చంపావతి, నాగావళి నదులు ఉగ్రరూపం దాల్చాయి. సముద్ర తీరంలో అలజడి నెలకొంది. వేటకు వెళ్లొద్దంటూ భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లోని తీరగ్రామాల మత్స్యకారులను అధికారులు శుక్రవారం అప్రమత్తం చేశారు. అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతుండడంతో ముక్కాంలో తీరప్రాంతం కోతకు గురైంది. వైఎస్సార్ జిల్లాలో పాపాఘ్ని నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నదిలో అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో కడప-ఎర్రగుంట్ల ప్రధాన రహదారిపై రాకపోకలను నిలిపేశారు. ప్రకాశం జిల్లాలో ముసి, అట్లేరుల్లో వరద పెరిగింది. దోర్నపువాగు పొంగింది. కొండపి మండలం అనకర్లపూడి వద్ద ముసి ఏరులో పడి ప్రభాకర్ అనే వ్యక్తి గల్లంతయ్యాడు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మత్స్యగెడ్డ, రాళ్లగెడ్డ, పెద్దగెడ్డ, చాపరాయి గెడ్డ, దిగుడుపుట్టు గెడ్డ, కోడిమామిడి గెడ్డ, శారద, గోస్తనీ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అనకాపల్లి జిల్లా చోడవరంలో స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం గర్భగుడిలోకి నీరు ప్రవేశించింది. విగ్రహం సగం వరకు మునిగిపోయింది. శారదానది ఉధృతంగా ప్రవహిస్తోంది. కోనాం, కల్యాణపులోవ, రైవాడ జలాశయాలు నిండడంతో దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కేంద్రం విజయవాడలో శుక్రవారం భారీవర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్నిచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. జిల్లాతో పాటు తెలంగాణలోను వర్షాలు కురవడంతో తోటమూల-వినగడప గ్రామాల మధ్య కట్టలేరు పొంగి రాకపోకలు నిలిచిపోయాయి.

# వికేంద్రీకరణతోనే బీసీల అభివృద్ధి

- సీఎం వైఎస్ జగన్ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు
- ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్ స్పష్టీకరణ
- 30 కుల సంఘాల నేతలతో రాష్ట్ర సమావేశం



సాక్షి, అమరావతి : పరిపాలన వికేంద్రీకరణతోనే బీసీల అభివృద్ధి ముడిపడి ఉందని, మూడు రాజధానులతో మూడు ప్రాంతాలకు మేలు జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ స్పష్టం చేశారు. 'వికేంద్రీకరణతోనే మూడు ప్రాంతాల్లోని బీసీల అభివృద్ధి' అనే అంశంపై విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని 30కి పైగా కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలనే మహోన్నత లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న పరిపాలన వికేంద్రీకరణ నిర్ణయానికి ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. ఉత్తరాంధ్ర మొత్తం జనాభాలో 70 శాతంపైగా బీసీలు ఉన్నారని, అటువంటి ప్రాంతాన్ని పరిపాలన రాజధానిగా చేయడం వల్ల బీసీలకు అన్ని రకాలుగా మేలు జరుగుతుందన్నారు. తద్వారా బీసీలు పరిపాలనలో భాగస్వాములు కావడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆ ప్రాంతంలో వచ్చే ఉపాధి అవకాశాల వల్ల బీసీలకు ఆర్థిక భరోసా వస్తుందన్నారు. ఉత్తరాంధ్ర తర్వాత బీసీలు అధికంగా ఉన్న ప్రాంతం రాయలసీమ అన్నారు. ఆ ప్రాంతానికి కూడా రాజధాని హోదా ప్రకటించడం వల్ల అక్కడ పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగి.. బీసీలు కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు.


**పాలన వికేంద్రీకరణతో విభేదాలకు తావుండదు**

కోస్తాంధ్రను శాసన రాజధానిగా చేయడం వల్ల ఇక్కడున్న బీసీలకూ మేలు జరుగుతుందని మారేష్ అన్నారు. ప్రధానంగా పరిపాలన వికేంద్రీకరణ వల్ల భవిష్యత్తులో ప్రాంతాల మధ్య ప్రాంతీయ విభేదాలు, ఉద్యమాలు రావన్నారు. గతంలో హైదరాబాద్‌లోనే అభివృద్ధి కేంద్రీకృతం కావడం వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు ముక్కలు అయ్యిందని గుర్తించాలన్నారు. అటువంటి పరిస్థితి మళ్లీ రాకుండా ఉండాలంటే పరిపాలన, అభివృద్ధి వికేంద్రీకరణకే అందరూ మద్దతు పలకాలని ఆయన కోరారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సామాజిక న్యాయాన్ని కొన్ని వర్గాలు జీర్ణించుకోలేక కృత్రిమ ఉద్యమాలు నడిపిస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అన్ని వర్గాల వారు సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలుస్తున్నారని, మరో 30 ఏళ్లు ఆయనే సీఎంగా కొనసాగుతారని మారేష్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీ రాణి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి రాము, రేగళ్ల శ్రీనివాసరావు, తదితరులు మాట్లాడారు.

# వర్షాలతో ప్రాజెక్ట్‌లు కళకళ

**పోటెత్తిన కృష్ణా ఉప నది భవనాసి, వాగులు, వంకలు**

- శ్రీశైలంలోకి 1,60,738 క్యూసెక్కులు.. మళ్లీ ఐదు గేట్లు ఎత్తివేత
- ప్రకాశం బ్యారేజ్ నుంచి 90 వేల క్యూసెక్కులు కడలిలోకి
- వెలిగొండలో అంతర్భాగమైన కాకర్ల డ్యామ్‌లోకి వరద నీరు
- కాకర్ల డ్యామ్ గేట్లు ఎత్తి చెరువులను నింపుతున్న అధికారులు



శ్రీశైలం 5 గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్ : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం వల్ల నల్లమల అటవీ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కృష్ణా ఉప నది భవనాసి, వాగులు వంకలు పోటెత్తి శ్రీశైలం ప్రాజెక్టులోకి ప్రవహిస్తున్నాయి. జూరాల, సుంకేశుల, హంద్రీల నుంచి వస్తున్న 87,950 క్యూసెక్కులకు.. పోతిరెడ్డిపాడు దిగువన భవనాసి, వాగులు, వంకల ద్వారా 72,788 క్యూసెక్కులు తోడవుతుండటంతో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలంలోకి 1,60,738 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 2,451 క్యూసెక్కులు, హంద్రీ-నీవా ద్వారా 426 క్యూసెక్కులు తరలిస్తున్నారు. కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 65,979 క్యూసెక్కులు, స్పిల్ వే ఐదు గేట్లను పది అడుగుల మేర ఎత్తి 1,39,915 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో 884.8 అడుగుల్లో 214.84 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. నాగార్జున సాగర్‌లోకి 2,12,889 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ఇక్కడ గరిష్ట స్థాయిలో నీరు నిల్వ ఉంది. దీంతో 20 క్రస్ట్ గేట్ల ద్వారా వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదిలేస్తున్నారు. పులిచింతలలో కూడా గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేస్తూ.. మిగులు జలాలను వదిలేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్‌లోకి 95,235 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఇక్కడి నుంచి కృష్ణా డెల్టాకు 5,145 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 90,090 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. నల్లమల అడవుల్లో గుండ్లబ్రహ్మేశ్వరం ప్రాంతంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వెలిగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన నల్లమల సాగర్‌లోని కాకర్ల డ్యామ్‌లోకి 0.3 టీఎంసీల నీరు చేరింది. ప్రాజెక్టు ఎగువన గ్రామాలకు రవాణా స్తంభించిపోవడంతో కాకర్ల డ్యామ్ గేట్లు ఎత్తి.. మార్కాపురం నియోజకవర్గంలోని జంగంగుంట్ల, తిప్పాయిపల్లి, కాకర్ల తదితర చెరువులను నింపుతున్నామని వెలిగొండ ప్రాజెక్టు సీఈ మురళీనాథ్‌రెడ్డి చెప్పారు.

వాస్తవ చిత్రం

# అవమానాలలో పుట్టిన అగ్నిశిఖ

సుస్మితాసేన్ శ్రీగౌరి సావంత్ బయోపిక్ 'తాళీ'లో నటిస్తోంది.
ఈ వెబ్ సిరీస్‌కు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది సేన్.
'రకరకాల కారణాలరీత్యా ఈ ప్రాజెక్ట్ నాకు ప్రత్యేకం. పోరాట స్ఫూర్తి మూర్తీభవించిన శ్రీగౌరి సావంత్‌ను ప్రపంచానికి పరిచయం చేసే పాత్రలో నటించడం కంటే గొప్ప విషయం ఏముంటుంది' అని తన మనసులోని భావాన్ని బయటపెట్టింది సేన్. ఇంతకీ ఎవరీ శ్రీగౌరి సావంత్?


● సుస్మితా సేన్
● శ్రీగౌరి సావంత్

కొన్ని సంవత్సరాల క్రితం...

బాలీవుడ్ వెండితెర కలలను నిజం చేసుకోవడానికి ముంబైలోకి అడుగు పెట్టింది సితార. 21 సంవత్సరాల సితార కలలు ఆవిరైపోవడానికి ఎంతో కాలం పట్టలేదు. కొందరు చేసిన మోసం వల్ల ముంబైలోని ఖరీదైన స్టూడియోలలో భారీ లైట్ల వెలుగులో ఉండాల్సిన సితార కామాటిపుర చీకటిలోయల్లో పడిపోయింది.

సెక్స్‌వర్కర్‌గా జీవితాన్ని నరకప్రాయం చేసుకుంది. కొంతకాలానికి ఆమె తల్లి అయింది.

'నా బిడ్డను సమాజం ఎంత ఈసడించుకుంటుందో, ఎన్ని రకాలుగా అవమానపరుస్తుందో' అనే భయంతో పిల్లలు లేని దంపతులకు పాపను రెండు లక్షలకు అమ్ముకుంది.

ఆ తరువాత...తట్టుకోలేని బాధ.

ఆ డబ్బును తీసుకువెళ్లి ఒక ఆలయ నిర్మాణానికి విరాళంగా ఇచ్చింది.

ఇలాంటి సితారాలు చాలామంది ఉంటారు. శ్రీగౌరి సావంత్‌లాంటి వాళ్లు మాత్రం చాలా తక్కువగా ఉంటారు. సితారలాంటి వాళ్ల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కంకణం కట్టుకుంది ట్రాన్స్‌జెండర్ శ్రీగౌరి. సెక్స్‌వర్కర్‌లకు అండగా నిలవాలనేది తన ఆశయం.

సెక్స్‌వర్కర్‌ల పిల్లల ఆలనాపాలనా గాలిలో దీపం అయింది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. ఈ నేపథ్యంలో వారి కోసం భద్రతను ఇచ్చే ఆశ్రమాన్ని కట్టాలనుకుంది శ్రీగౌరి.

కల బాగానే ఉందిగానీ, డబ్బులు ఎక్కడివి!

'సంకల్పం మంచిదైనప్పుడు డబ్బులు వెదుక్కుంటూ వస్తాయట. చూద్దాం' అనుకుంది.

మిలాప్ ఫండ్ రైజింగ్ వెబ్‌సైట్, కౌన్ బనేగా కరోడ్‌పతి టీవీషో... మొదలైన వాటి ద్వారా తన కల సాకారం అయింది.

'అజీచ ఘర్' పేరుతో నిర్మించిన ఈ ఇల్లు యాభై మందికి పైగా సెక్స్‌వర్కర్‌ల పిల్లలకు ఆశ్రయం ఇస్తుంది. భద్రంగా వారి ఆలనాపాలన చూసుకుంటుంది.

ట్రాన్స్‌జెండర్‌ల యోగక్షేమాల కోసం 'సఖీ చార్ చౌగీ' అనే స్వచ్ఛందసంస్థను ప్రారంభించి ఎంతోమందికి అండగా నిలబడింది శ్రీగౌరి.

గతంలోకి వెళితే... నాగ్‌పూర్‌లో పుట్టి గణేశ్ పేరుతో పెరిగింది. తన నడక, మాట తీరువల్ల లెక్కలేనన్ని అవమానాలు ఎదుర్కొంది. మరోవైపు తల్లి చనిపోయింది. తండ్రి పోలీస్ అధికారి. తన వల్ల తండ్రిని తక్కువ చేసి చూడకూడదని పద్నాలుగు సంవత్సరాల వయసులో ఇల్లు విడిచింది.

ఎన్ని అవమానాలు ఎదుర్కొందో. ఎన్ని కష్టాలు పడిందో. అయితే వాటి వల్ల తాను మానసికంగా బలపడిందే తప్ప ఏరోజూ వెనకడుగు వేయలేదు.

2014లో శ్రీగౌరి పేరు జాతీయ మీడియాను ఆకర్షించింది. అప్పుడు తాను ఒక చారిత్రక అడుగు వేసింది. ట్రాన్స్‌జెండర్‌లకు పిల్లలను దత్తత తీసుకునే హక్కు కోసం సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది.

గాయత్రి అనే అమ్మాయిని దత్తత తీసుకుంది. గాయత్రి తల్లి ఎయిడ్స్‌తో చనిపోయింది.

గతంలో వచ్చిన ఒక దక్షిణాది చిత్రంలో శ్రీగౌరి పాత్ర కనిపించింది. అయితే అందులో కల్పన ఎక్కువ. శ్రీగౌరి పాత్రపై 'తాళీ' పేరుతో పూర్తిస్థాయిలో బయోపిక్ రావడం అనేది ఇదే మొదటిసారి.

చిన్న చిన్న విషయాలకే డిప్రెషన్ బారిన పడుతున్న వారికి శ్రీగౌరి బయోపిక్ కచ్చితంగా ధైర్యాన్ని ఇస్తుంది. పోరాటస్ఫూర్తిని అందిస్తుంది. సందేహం లేదు!

ఫ్యాషన్

# ర్యాప్.. డ్రేప్

టాప్ టు బాటమ్
ఒకే రంగుతో ఆకట్టుకోవడం ఈ డ్రెస్ ప్రత్యేకత
ఇండియన్ శారీ లుక్‌ను తలపిస్తూనే
వెస్ట్రన్ గౌన్‌లా అనిపించే స్టైలిష్ డ్రెస్.
వేడుకలలో వెరైటీ మార్కులు కొట్టేస్తుంది.
క్యాజువల్ వేర్‌గా కంఫర్ట్‌ని సొంతం చేస్తుంది.
సింగిల్‌పీస్ అయినప్పటికీ
ఇంద్రధనుస్సును మరిపించే హంగులు ఉన్న డ్రెస్‌గా
నవతరం మనసులను దోచేస్తుంది
ఈ ర్యాప్ డ్రేప్ డ్రెస్.







ప్లెయిన్ లేదా
చిన్న చిన్న ప్రింట్లు ఉన్న
సిల్క్ మెటీరియల్‌ను లాంగ్ ఫ్రాక్ మోడల్ వచ్చేలా
డిజైన్ చేసి, కింది అంచు భాగంలో చీర కుచ్చిళ్లను
తలపించేలా డ్రేప్ చేసి, నడుము దగ్గర బెల్ట్‌తో
ర్యాప్ చేయడం ఈ డ్రెస్ ప్రత్యేకత.
ధోతీ టాప్ కాంబినేషన్ సెట్‌లా కూడా
ఈ స్టైల్ మనల్ని ఆకట్టుకుంటుంది.

నోబెల్ విజేత

# స్వీయ అనుభవాలే సాహిత్యం

**ఆనీ ఎర్నాకు 23 ఏళ్లు ఉండగా అవాంఛిత గర్భం వచ్చింది. దాంతో చట్టవిరుద్ధంగా అబార్షన్ చేయించుకోవాల్సి వచ్చింది. ఇది జరిగింది 1963లో. 1999లో ఈ అనుభవాన్ని ఆమె నవలగా రాసింది. 130 పేజీల ఈ నవల 2000 సంవత్సరంలో 'హ్యేపెనింగ్' పేరుతో వెలువడి సంచలనం రేపింది. కాల్పనిక సాహిత్యం రాసే ఫ్రెంచ్ రచయిత్రి ఆనీ ఎర్నా ఆ రకమైన సాహిత్యాన్ని వదిలిపెట్టి స్వీయ జీవితంలోని పరాభవాలు, ఆందోళనలు దాపరికం లేకుండా రాయడం కూడా సాహిత్యమేనని గ్రహించింది. 2022 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక నోబెల్ ప్రైయిజ్ గెలుచుకున్న ఆనీ ఎర్నా ఇంగ్లీష్‌లో రాయకున్నా ఈ బహమతి గెలుచుకున్న అతి కొద్దిమంది మహిళల్లో ఒకరు. ఆమె గురించి... ఆమె పుస్తకాల గురించి...**

'ఇది పురుషాధిక్య ప్రపంచం. దీనిని బోనెక్కించాల్సిన సమయం వచ్చినప్పుడు బోనెక్కించాల్సిందే' అంటుంది 82 సంవత్సరాల ఫ్రెంచ్ రచయిత్రి ఆనీ ఎర్నా.

తన జీవితంలో జరిగిన ఒక సంఘటన- చట్ట విరుద్ధంగా అబార్షన్ చేయించుకోవాల్సి రావడాన్ని- 1999లో ఫ్రెంచ్‌లో 'ఇవెన్మో' పేరుతో నవలగా రాస్తే మరుసటి సంవత్సరం అది 'హ్యాపెనింగ్' పేరుతో ఇంగ్లిష్‌లో అనువాదం అయ్యి వెలువడింది. ఆ సందర్భంగా ఆనీ ఎర్నా అన్న మాట అది. 'నా జీవితంలో నాకు జరిగింది రాయడం ఎందరో స్త్రీలకు గొంతునివ్వడమే' అని ఆమె అంది. 'నాకు అవాంఛిత గర్భం వచ్చినప్పుడు అది నా వ్యక్తిగతమైన విషయంగా మిగల్లేదు. బయటపడితే నా కుటుంబం మొత్తం సామాజిక నీతిలో విఫలమైందన్న విమర్శను మోయాల్సి వచ్చేది' అంటుందామె.

కాకతాళీయమే అయినా ఇండియాలో అబార్షన్ గురించి సుప్రీంకోర్టు స్త్రీలకు సంపూర్ణ హక్కులు ఇచ్చిన సందర్భంలోనే అబార్షన్ గురించి, స్త్రీల దైహిక వేదనల గురించి, మనో సంఘర్షణల గురించి, వారికి మాత్రమే ఎదురయ్యే అనుభవాల గురించి అది కూడా శ్రామిక వర్గ కోణం నుంచి విస్తృతంగా రాసిన ఆనీ ఎర్నాకు నోబెల్ సాహిత్య బహుమతి లభించింది. ఇప్పటి వరకు 119 మంది నోబెల్ సాహిత్య బహుమతి లభిస్తే వారిలో కేవలం 16 మందే స్త్రీలు. ఆనీ ఎర్నా 17వ రచయిత్రి.

## బాల్యం నుంచి గుణపాఠాలే

ఫ్రాన్స్‌లోని ఇవెట్తో అనే ఊళ్లో చిన్న పచారీ కొట్టు నడిపేవారు ఆనీ తల్లిదండ్రులు. తండ్రికి పట్టకపోయినా జీవితాలు మారాలంటే చదువు ముఖ్యం అని ఆమె తల్లి గట్టిగా భావించింది. దాంతో తమ స్థాయికి చెందకపోయినా కాస్త మంచిబడిలో ఆనీని చేర్పించింది. ఆ బడికి కలిగిన పిల్లలు వచ్చేవారు. 'అక్కడే నాకు తొలి పాఠం తెలిసింది. శ్రామిక వర్గానికి దక్కే మర్యాదలు కూడా తెలిశాయి. నిన్ను నువ్వు చిన్నబుచ్చుకుంటూ బతకాల్సి రావడం కంటే ఘోరమైన విషయం లేదు. మన స్థాయికి మించిన విషయాల్లో అడుగు పెట్టకూడదని నాకు గట్టిగా అందిన సందేశం అందింది' అంటుందామె. ఆమె తన స్వీయానుభవాల ఆధారంగా 'ఏ గర్ల్స్ స్టోరీ' (2016) అనే నవల రాసింది. '18 ఏళ్ల అమ్మాయి స్టూడెంట్స్ క్యాంప్‌లో లైంగిక అనుభవం పొందితే అది సంతోషకరంగా ఉండాలి. కాని ఇది తెలిసిన వెంటనే మగ విద్యార్థులు ఆ అమ్మాయిని గేలి చేశారు. ఆమె అద్దం మీద అసభ్యకరంగా రాసి వెక్కిరించారు. ఎన్నాళ్లు గడిచినా నైతికంగా పతనమైన భావనను కలిగించారు' అని రాసిందామె. చదువు ముగిశాక ఆమె టీచర్‌గా మారి ఆనీ ఎర్నా 2000 సంవత్సరంలో రిటైరయ్యి పూర్తి కాలం రచయిత్రిగా రచనలు కొనసాగిస్తూ ఉంది.






### స్వీయ అనుభవాలే రచనలు

ఆనీ ఎర్నా ఏవో ఊహించి కథలు అల్లడం కన్నా తన జీవితంలో జరిగినవే రాయాలని నిర్ణయం తీసుకుంది. దాంతో ఆమె జ్ఞాపకాల రచయిత్రి అయ్యింది. మన జీవితంలో జరిగినదాన్ని రాయడం వల్ల మిగిలినవారు పోల్చుకోవడానికో, సహానుభూతి చెందడానికో అది ఉపయోగపడుతుంది అంటుందామె. మనుషులు వేరే చోట్ల ఉన్నా వారు భావోద్వేగాలు ఒకటే కదా. ఆనీ ఎర్నా రాసిన 'హ్యాపనింగ్' నవల ఒక కాలపు ఫ్రాన్స్‌లో స్త్రీల సంఘర్షణను సూటిగా నిలపడంతో ఆమెకు ప్రశంసలు వచ్చాయి. 1963లో ఆమె అబార్షన్ చేయించుకోవాల్సి వస్తే ఆ తర్వాత 12 ఏళ్లకు కాని ఫ్రాన్స్‌లో (అవివాహితులకు) అబార్షన్‌ను చట్టబద్ధం చేయలేదు. 'అబార్షన్ హక్కు లేకపోవడం అంటే.. చట్టం, సంఘపరమైన నియమాలు వ్యక్తి స్వేచ్ఛను పూర్తిగా ధ్వంసం చేయడమే' అంటుందామె.

## సూటిగా, సులభంగా

ఆనీ ఎర్నా రచనా శైలి సూటిగా సులభంగా ఉంటుంది. నేరుగా పాఠకులకు అందేలా ఆమె వచనశైలి ఉంటుంది. నోబెల్ కమిటీ కూడా ఇదే మాట అంది. 'ఆమె సాహిత్యం అత్యంత సాధారణ భాషలో అత్యంత పరిశుభ్రంగా ఉంటుంది' అని అభిప్రాయపడింది. ఆనీ ఎర్నా రాసిన పుస్తకాల్లో 'క్లీన్డ్ ఔట్' (1974), 'షేమ్' (1997), 'గెటింగ్ లాస్ట్' (2001), 'ది ఇయర్స్' (2008) ముఖ్యమైనవి. 1988లో పారిస్‌లో ఉద్యోగం చేస్తున్న ఒక సోవియెట్ దౌత్యవేత్తతో ఆనీ ఎర్నా బంధం ఏర్పరుచుకుంది. అతడు ఆమె కంటే 12 ఏళ్ల చిన్నవాడు. కొంత కాలానికి ఆ బంధం ముగిసింది. ఆ సమయంలో తన భావోద్వేగాలను 'గెటింగ్ లాస్ట్' పేరుతో నవల రాసిందామె. అలాగే తన గురించి, ఫ్రాన్స్ సమాజం గురించి రెండో ప్రపంచ యుద్ధం నాటి నుంచి ఇటీవలి కాలం వరకూ జరిగిన ఘటనలను 'ది ఇయర్స్'గా రాసింది. ఒక రకంగా ఇది స్వీయ చరిత్ర, ఫ్రాన్స్ చరిత్ర కూడా.

## స్త్రీ పక్షపాతి

ఆనీ ఎర్నా తనను తాను 'రచనలు చేసే మహిళ'గా చెప్పుకున్నా ఆమె స్త్రీ పక్షపాతి. స్త్రీవాద ఉద్యమానికి ప్రోత్సాహకురాలు. 'రాజకీయాలు భ్రష్టుపట్టిన ఈ సమయంలో ఫెమినిస్టులే సరిహద్దులను ప్రశ్నిస్తూ కొత్త ఆలోచనలను చేస్తూ ఆశలు రేకెత్తిస్తున్నారు' అంటుందామె. ఇటీవల జరిగిన మీటూ ఉద్యమం ఆమెకు చాలా సంతోషాన్నిచ్చింది. 'తమతో ఎలాగైనా వ్యవహరించవచ్చనే స్థితిని స్త్రీలు ఇక మీద ఏ మాత్రం అంగీకరించరు' అంటారామె.

'నేను రాయగలను కాబట్టే నాకు వినూత్న అనుభవాలు ఎదురవుతున్నాయి' అని చెప్పుకున్న ఆనీ రాయగలిగే మహిళలంతా తమ జీవన అనుభవాలను బెరుకు లేకుండా చెప్పడాన్ని ప్రోత్సహిస్తుంది. అప్పుడే స్త్రీలు, స్త్రీలతో ఉన్న సమాజం మరింత మెరుగ్గా అర్థమవుతాయి.

కొంతమంది ఎప్పుడూ బాడీ పెయిన్స్ తో ఇబ్బంది పడుతుంటారు. అసలు ఇవి ఎందుకు వస్తాయన్న సంగతి చాలా మందికి తెలియదు. కానీ ఈ నొప్పులు ఏ పనులను చేయనీయవు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బాడీ పెయిన్స్ ఎందుకు వస్తాయో తెలుసుకుందాం...

# తరచు ఒళ్లు నొప్పులా? కారణాలు ఇవి కావొచ్చు..!



### విటమిన్ డి లోపం

మన శరీరం సక్రమంగా పని చేయడానికి విటమిన్ డి చాలా అవసరం. ఇది ఎముకలను, దంతాలను బలంగా ఉంచడానికి సహాయపడుతుంది. విటమిన్ డి మన శరీరంలో లోపిస్తే ఒళ్లు నొప్పులు తరచు వేధిస్తుంటాయి.

**■ నిద్రలేమి**

మనం 6 నుంచి 8 గంటలు పడుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతారు. ఎందుకంటే నిద్రపోయేటప్పుడే శరీరం శక్తి వనరులను పునరుత్పత్తి చేసుకుంటుంది. నిద్ర మనల్ని రీఫ్రెష్ చేస్తుంది. అయితే ఈ రోజుల్లో చాలామంది నిద్రలేమితో బాధపడుతున్నారు. తగినంత నిద్ర లేకపోవడం వల్ల శరీరం శక్తి వనరులను భర్తీ చేసుకోక పోవడంతో వళ్ళు నొప్పులు వస్తాయి.

**■ డీహైడ్రేషన్**

శరీరంలో నీరు తగ్గిపోవడం వల్ల నొప్పులకు దారితీస్తుంది. శరీరానికి అవసరమైన నీటిని తాగకపోవడం.. దానికితోడు శరీరం లోంచి నీరు బయటకు పోవడం వల్ల డీహైడ్రేషన్ బారిన పడతారు. దీనివల్ల అలసట, వళ్లంతా నొప్పులు వస్తాయి.

**■ ఐరన్ లోపం**

రక్తంలో ఐరన్ చాలా ముఖ్యమైన మూలకం. ఇది తక్కువ మొత్తంలో ఉండటం వల్ల శరీరంలోని వివిధ భాగాలకు పోషకాలు, ఆక్సిజన్ సరిగ్గా అందవు. దీనివల్ల అలసటతో పాటుగా బాడీపెయిన్స్ కూడా వస్తాయి.

**■ ఆర్థరైటిస్**

ఆర్థరైటిస్ లేదా కీళ్ల వాపు సమస్యలు వల్ల వళ్లు నొప్పులు వస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వీటిని తగ్గించుకుంటే బాడీ పెయిన్స్ తగ్గుతాయి.

### మానసిక ఒత్తిడి

ఒత్తిడి మనల్ని శారీరకంగానే కాదు.. మానసికంగా కూడా ప్రభావితం చేస్తుంది. ఒత్తిడి ఎక్కువైతే శరీరం బాగా అలసిపోతుంది. దీంతో మీరు మరింత బలహీనంగా మారిపోతారు. దీనివల్ల రోగ నిరోధక శక్తి కూడా తగ్గుతుంది. దీంతో మీ శరీరం ఎన్నో రోగాలకు ఆవాసంగా మారుతుంది. ఇవన్నీ శరీర నొప్పులకు కారణం అవుతాయి.

**■ జలుబు, ఫ్లూ**

చలి, వానకాలాల్లో జలుబు, ఫ్లూ సమస్యలు సర్వసాధారణం. అయితే ఈ వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల కూడా విపరీతంగా వళ్లు నొప్పులు వస్తాయి.

పై వాటిలో మన సమస్య ఏమిటో తెలుసుకుని దానికి తగిన చికిత్స చేయించుకోవడం వల్ల వళ్లు నొప్పుల నుంచి విముక్తి లభిస్తుంది. అంతేకానీ బాడీ పెయిన్స్ రాగానే పారాసిటమాల్ లేదా ఎసిక్లోఫినాక్ వేసుకోవడం వల్ల తగిన ఫలితం రాదు.



అధిక రక్తపోటు ప్రాణాలకు కూడా ముప్పేననడంలో ఎలాంటి సందేహం లేదు. చాపకింద నీరులా గుండె కవాటాలను పూడ్చివేసి, గుండె పనితీరును మందగింపజేసే బీపీని దుపులో ఉంచుకోకపోతే చాలా ప్రమాదం. అయితే అది మందుల ద్వారానే కాదు, నిత్యం కొన్ని రకాల ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా కూడా నియంత్రణలో ఉంచుకోవచ్చునంటున్నారు ఆహార నిపుణులు. అదెలాగో చూద్దామా?

# హై బీపీనా..? ఆందోళన వద్దు!

ప్రస్తుత కాలంలో జీవనశైలి మూలాన వస్తున్న సమస్యలలో బీపీ, షుగర్, థైరాయిడ్, గ్యాస్, ఎసిడిటీ, కడుపులో పుండ్లు వంటివి ముఖ్యమైనవి. వాటిలో అతి ముఖ్యమైనది బీపి. దీనికి వయసుతో కూడా సంబంధం ఉండటం లేదు. తక్కువ వయసు వారు కూడా హైబీపితో బాధపడుతున్నారు. రక్తపోటు పెరిగిపోవడం వల్ల ఒక్కోసారి ప్రాణాల మీదకు కూడావస్తుంటుంది. బీపీని అదుపులో ఉంచుకోవాలంటే కొన్నిరకాల ఆహారాలను తీసుకోవడం ప్రయోజనకరం. అవేంటో తెలుసుకుందాం..

పల్లీలు, బాదం, జీడిపప్పు అధిక రక్తపోటును అదుపు చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే వాటిని ఎలా తీసుకోవాలో చూద్దాం.

సాధారణంగా అధిక బరువు ఉన్నవారు నట్స్ ను దూరం పెడుతుంటారు. వీటిని తింటే మరింత బరువు పెరిగిపోతామేమోననే అపోహతో అయితే అది సరి కాదు. ఎందుకంటే వేరుశెనగ, బాదం పప్పుల వల్ల బరువు పెరగరు.ఇవి మీ శరీర బరువు మరింత పెరగకుండా అడ్డుకుంటాయి కూడా.



### బాదం పప్పు

శరీరంలో ఉన్న అదనపు కొవ్వును తొలగించేందుకు బాదం పప్పులు ఎంతో సహాయపడతాయి. గుప్పెడు వేరుసెనగ గింజలను, నాలుగైదు బాదం పప్పును రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే పరిగడుపున తింటే బీపీ, డయాబెటిస్ అదుపులో ఉంటాయి. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మధుమేహాన్ని, అధిక రక్తపోటునూ నియంత్రణలో ఉంచడానికి సహాయపడతాయి. వీటిని తినడం వల్ల మీ శరీర బలం పెరుగుతుంది.



### పల్లీలు

పల్లీలు లేదా వేరుసెనగ గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ప్రతిరోజూ గుప్పెడు వేరువెనగ గింజలు తినడం వల్ల వంటి పనితీరు బాగుంటుంది. అలాగే అధిక రక్తపోటు సమస్య కూడా తొలగిపోతుంది. కొలెస్ట్రాల్ వంటి రోగాల ప్రమాదం తప్పుతుంది. ఎందుకంటే ఈ గింజలు శరీరంలో పేరుకుపోయిన కొవ్వును తొలగించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. వేరుశెనగల్లో విటమిన్ బి3 పుష్కలంగా ఉంటుంది. ఇది మెదడును ఆరోగ్యంగా ఉంచుతుంది. ప్రతిరోజూ వేరుశెనగలను తినడం వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది. ఈ గింజలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. బీపీని పెంచే కారకాలలో కొలెస్ట్రాల్ ముందుంటుంది. కొలెస్ట్రాల్ అదుపులో ఉంటే రక్తపోటుకు కళ్లెం వేయడం సులభం అవుతుంది కాబట్టి రోజూ నానబెట్టిన పల్లీలు తీసుకోవడం మంచిది.

### జీడిపప్పులు

జీడిపప్పులు తింటే బరువు పెరిగిపోతామని వీటిని ముట్టని వారు చాలా మందే ఉన్నారు. నిజానికి అది సరికాదు.. జీడిపప్పులు బరువును పెంచడానికి బదులుగా.. బరువును కంట్రోల్ లో ఉంచడానికి సహాయపడతాయి. శీతాకాలంలో 2 నుంచి 3 జీడిపప్పులను తినడం శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. అలాగే శరీర శక్తిని కూడా పెంచుతుంది. వీటిలో పిస్తాపప్పు, ఇతర గింజల కంటే ఎక్కువ పోషకాలుంటాయి. ఇది రుచిగానే కాదు.. మన శరీరానికి ఎన్నో రకాలుగా మేలు చేస్తుంది. ఈ గింజలు తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. అధిక బరువు కూడా తగ్గుతుంది. అలాగే రక్తంలో చక్కెర స్థాయులు కూడా నియంత్రణలో ఉంటాయి. ముఖ్యంగా కొలెస్ట్రాల్ కూడా అదుపులో ఉంటుంది.

డ్రై ఫ్రూట్స్‌లో చాలావరకు విటమిన్ ఎ, విటమిన్ బి1, విటమిన్ బి6, విటమిన్ ఇ ,మెగ్నీషియం, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు, చర్మానికి ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిని రోజూ తింటే రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతాయి. సమస్యలు కూడా అదుపులో ఉంటాయి.

వీటన్నింటితోపాటు కంటినిండా నిద్రపోవడం, నిత్యం వాకింగ్ చేయడం కూడా చాలా అవసరం అని గుర్తుంచుకోవాలి.



# షేవింగ్... వయసుకు సేవింగ్

ప్రస్తుత కాలంలో నున్నగా షేవ్ చేసుకునే వారికంటే నిండుగా గడ్డం పెంచుకునే వాళ్లే ఎక్కువగా కనిపిస్తున్నారు. గడ్డం పెంచుకోవడం... లేదా రెగ్యులర్‌గా షేవింగ్ చేసుకోవడం... ఎవరిష్టం వాళ్లది. అయితే రోజూ షేవింగ్ చేసుకోవడం వల్ల కొన్ని లాభాలున్నాయి. అవేంటో చూద్దాం..



కొన్ని ఇంటర్వ్యూలకు హాజరయ్యేటప్పుడు నీట్‌గా షేవింగ్ చేసుకుని రమ్మనడం మామూలే. మిలటరీలో అయితే రెగ్యులర్ షేవింగ్ తప్పనిసరి. ఇంతకీ రెగ్యులర్ షేవింగ్ లాభాలేమిటంటారా... అక్కడికే వస్తున్నాం....

షేవింగ్ చేసుకోవడం వల్ల యంగ్‌గా... ఎనర్జిటిక్‌గా కనిస్తారు. ముఖంపై ఉండే జుట్టు శుభ్రపడుతుంది.

ఇది చర్మ సమస్యలను కొన్నింటిని తగ్గిస్తుంది. అలాగే చర్మంపై ఉండే మృత కణాలను తొలగిస్తుంది.

షేవింగ్‌కు సంబంధించిన ఒక అధ్యయనం ప్రకారం.. ఉదయం నిద్రలేచి షేవింగ్ చేసుకునే వారు మరింత ఉత్సాహంగా ఉంటారట. అలాగే పనులకు వెళ్లే వారు ఉదయాన్నే షేవ్ చేసుకోవడం వల్ల ఆ పనిని సక్రమంగా.. మరింత సామర్థ్యంతో పనిచేస్తారని కొన్ని పరిశోధనలలో తేలింది.

గడ్డంలో ఎన్నో రకాల బ్యాక్టీరియా ఉంటుంది. ఇది చర్మాన్ని పాడుచేస్తుంది. దీంతో ముఖంపై మచ్చలు ఏర్పడతాయి. రోజూ షేవింగ్ చేయడం వల్ల ఈ బ్యాక్టీరియా తొలగిపోతుంది.

షేవింగ్ చేసేటప్పుడు ఉపయోగించే ప్రీషేవ్ ఆయిల్, షేవింగ్ క్రీమ్, జెల్ లేదా బామ్ వంటివన్నీ మీ చర్మ పీహెచ్ స్థాయిని సమతుల్యం చేయడానికి సహాయపడతాయి.

సినిమా


● రజనీకాంత్

# సూపర్ స్పీడ్

యాభై ఏళ్ల కెరీర్‌లో రజనీకాంత్ నూటయాభై చిత్రాలకు పైగా చేశారు. ప్రస్తుతం 169 చిత్రంగా 'జైలర్'లో నటిస్తున్నారు. ఏడు పదుల వయసులో ఉన్న సూపర్ స్టార్ సూపర్ స్పీడ్ మీద ఉన్నారు. 'జైలర్'లో నటిస్తూనే మరో రెండు చిత్రాలు అంగీకరించారట. ఆ విశేషాల్లోకి వస్తే...

రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో సన్ పిక్చర్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'జైలర్'. ఆగస్టులో ఈ చిత్రం షూటింగ్ ఆరంభమైంది. రజనీ ఫస్ట్ లుక్‌ని కూడా విడుదల చేశారు. ఈ చిత్రంలో రజనీ స్టయిలిష్ జైలర్‌గా కనిపించనున్నారని లుక్ స్పష్టం చేసింది. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తమిళ సంవత్సరాది సందర్భంగా ఈ చిత్రం విడుదలయ్యే అవకాశం ఉంది. మరో మూడు నాలుగు నెలల్లో ఈ సినిమా షూటింగ్ పూర్తయిపోతుంది. ఈలోపు తన రెండు కొత్త చిత్రాల షూటింగ్స్‌లో పాల్గొనడానికి రెడీ అవుతున్నారట రజనీకాంత్. అయితే ఈ రెండు చిత్రాలను ఒకే సంస్థ నిర్మించనుండటం విశేషం.

**లైకాతో మళ్లీ...** రజనీకాంత్ సూపర్ హిట్ చిత్రాల్లో ఒకటైన '2.0'ని నిర్మించిన లైకా ప్రొడక్షన్స్ రజనీతో 'దర్బార్' కూడా నిర్మించిన విషయం తెలిసిందే. ఈ రెండు చిత్రాలతో రజనీకి, లైకాకి మంచి అనుబంధం ఏర్పడింది. అందుకే రజనీతో మరో రెండు సినిమాలు నిర్మించాలనుకుని సూపర్ స్టార్‌తో ఒప్పందం కుదుర్చుకుందట లైకా సంస్థ. ఇటీవల మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్'ని లైకా సంస్థనే విడుదల చేసింది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి రజనీ ఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇదిలా ఉంటే.. లైకా సంస్థకు రజనీ చేయనున్న చిత్రాల దర్శకులు కూడా దాదాపు ఖరారయినట్లే. ఒకరు సిబి చక్రవర్తి, మరొకరు దేసింగు పెరియస్వామి.


**యువదర్శకులతో...** తొలి చిత్రం 'డాన్' (2022)తో సూపర్ హిట్ డైరెక్టర్ అనిపించుకున్నారు సిబి చక్రవర్తి. ఈ యువదర్శకుడికి రజనీ చాన్స్ ఇవ్వడం విశేషం. ఇక మరో దర్శకుడు దేసింగు పెరియస్వామి కూడా యువ దర్శకుడే. 'కన్నుమ్ కన్నుమ్ కొల్లైయడిత్తాల్' (2020) వంటి హిట్ చిత్రంతో పెరియస్వామి దర్శకుడిగా పరిచయం అయ్యారు. తెలుగులో 'కనులు కనులను దోచాయంటే'గా రిలీజైంది. పెరియస్వామికి కూడా రజనీ చాన్స్ ఇచ్చారట. ఇలా ఒకే బేనర్లో ఇద్దరు అప్‌కమింగ్ డైరెక్టర్లతో రజనీ చేయనున్న చిత్రాల గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# దేవుడిలా అండగా నిలబడ్డారు - విశ్వక్ సేన్

విశ్వక్ సేన్, మిథిలా పార్కర్, ఆశా భట్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఓరి దేవుడా..!'. వెంకటేశ్ ఓ లీడ్ రోల్ చేశారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో ప్రసాద్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. శుక్రవారం ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''నా తొలి చిత్రం


● ఆశా భట్, ప్రసాద్ వి. పొట్లూరి, విశ్వక్ సేన్, మిథిలా, అశ్వత్ మారిముత్తు

'ఫలక్‌నుమా దాస్'కు ఎవరైనా సపోర్ట్ చేస్తే బాగుంటుందనుకుంటున్న సమయంలో వెంకటేశ్‌గారు దేవుడిలా అండగా నిలబడి ఆ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇప్పుడు ఈ సినిమాలో ఆయన దేవుడి పాత్రలో నటించారు. కల్మషం లేని మనిషి ఆయన. నాకు బ్రదర్ ఉంటే ఆయనలా ఉండాలనిపించింది. వెంకటేశ్‌గారికి థ్యాంక్స్. ఇక 'ఓరి దేవుడా..!' సినిమాపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. 'ఓరి దేవుడా..!' సినిమాకు ముందు, ఆ తర్వాత అన్నట్లుగా నా కెరీర్ ఉంటుందనుకుంటున్నాను. ఇంత మంచి సినిమాను ఇచ్చిన పీవీపీగారికి థ్యాంక్స్. ఈ సినిమాతో విశ్వక్ ఎమోషన్స్‌ను ఇంకా బాగా క్యారీ చేయగలడని మాట్లాడుకుంటారు'' అన్నారు. ''తెలుగు సినిమా చేయాలన్న నా డ్రీమ్ 'ఓరి దేవుడా..!'తో నెరవేరింది. ఇందులో విశ్వక్ కొత్తగా కనిపిస్తాడు. ట్రైలర్‌ను ఎలా ఎంజాయ్ చేశారో, సినిమాను అలానే ఎంజాయ్ చేస్తారు'' అన్నారు అశ్వత్ మారిముత్తు. ''దేవుడి పాత్రలో వెంకటేశ్‌గారు అద్భుతంగా నటించారు. 'బొమ్మరిల్లు', 'తొలి ప్రేమ' సినిమాల అంతటి హిట్ విశ్వక్ సేన్‌కు ఈ సినిమాతో వస్తుంది'' అన్నారు నిర్మాత ప్రసాద్ వి. పొట్లూరి.


● కార్తీ

# దీపావళికి సర్దార్

కార్తీ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'సర్దార్'. రాశీ ఖన్నా, రజీషా విజయన్ హీరోయిన్లు. దీపావళి సందర్భంగా ఈ నెల 21న ఈ చిత్రం థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. అక్కినేని నాగార్జున అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమాను తెలుగులో విడుదల చేయనుంది. ఇటీవల ఈ సినిమా టీజర్ విడుదలైన సంగతి తెలిసిందే. ''టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. ఈ చిత్రంలో కార్తీ ఆరు గెటప్స్‌లో నటించారు. భారీ నిర్మాణ విలువలతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. 'మీరు వెతుకుతున్న స్పై పేరు ఏంటి?', 'అతనికి ఎనిమిది దేశాల పాస్‌పోర్ట్స్ ఉన్నాయి', 'ఆరువందల సార్లు ఇంట్రాగేట్ చేశాం. ప్రతిసారీ ఒక్కో లాంగ్వేజ్.. ఒక్కో కథ.. ఇవన్నీ నిజమేనని మిషన్ చెబుతోంది', 'ఆ ఆరుమంది ఒక్కరే..' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి.


● సుమన్

# మహారాజు కథ

సుమన్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'మహారాజు'. శ్రీ వెంకట లక్ష్మీ నరసింహ ప్రొడక్షన్స్‌పై వెంకట నరసింహ రాజ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని నిర్మించడంతో పాటు కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం కూడా వహిస్తున్నారు వెంకట నరసింహ రాజ్. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకట నరసింహ రాజ్ మాట్లాడుతూ– ''ఇంతకుముందు 'అల్లుడు బంగారం', 'అంతేనా.. ఇంకేం కావాలి' వంటి చిత్రాలు నిర్మించాం. సుమన్ గారితో ఒక వైవిధ్యమైన కథతో మూడో చిత్రాన్ని రూపొందించనున్నాం. వచ్చే నెల రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. ప్రముఖ నటీనటులతో పాటు నూతన నటీనటులు కూడా ఈ సినిమాలో నటిస్తారు'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ వెంకట్, కెమెరా: పీఆర్ చందర్ రావు, సహనిర్మాత: సి. ఈశ్వర్ రెడ్డి.

# రోజు రోజుకూ ఆదరణ పెరుగుతోంది

- నాగవంశీ


● లక్ష్మణ్, నాగవంశీ, గణేష్, వర్ష

బెల్లంకొండ గణేష్, వర్ష బొల్లమ్మ జంటగా నటించిన చిత్రం 'స్వాతిముత్యం'. లక్ష్మణ్ కె. కృష్ణ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 5న రిలీజైంది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా సక్సెస్ మీట్‌లో బెల్లంకొండ గణేష్ మాట్లాడుతూ – ''తెరపై గణేష్ కాదు.. బాలమురళీయే (సినిమాలో గణేష్ పాత్ర) కనిపిస్తున్నాడన్నప్పుడు నటుడిగా ఓ పది మార్కులు సాధించాననే తృప్తి కలిగింది. ఈ కథను నా దగ్గరకు తీసుకు వచ్చి, నా నుంచి నటనను రాబట్టుకున్న లక్ష్మణ్‌కు థ్యాంక్స్. ఈ కథను ఎక్కువగా నమ్మి, నిర్మించిన నాగవంశీగారికి రుణపడి ఉంటాను'' అని అన్నారు. ''ఓ సాధారణ కుటుంబంలో అనుకోని సమస్య వస్తే వారు ఏ విధంగా స్పందిస్తారు? అనే అంశం ఆధారంగా ఈ సినిమా చేశాం. కథ చెప్పగానే అంగీకరించిన గణేష్‌కు, కథను నమ్మి.. అదే నమ్మకాన్ని మా అందరిపై ఉంచిన నాగవంశీగారికి ధన్యవాదాలు'' అన్నారు లక్ష్మణ్ కె. కృష్ణ. ''స్వాతిముత్యం' రిలీజ్‌కు ముందు చిరంజీవిగారు శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పుడు చిరంజీవిగారి 'గాడ్‌ఫాదర్', 'స్వాతిముత్యం' చిత్రాలు విజయాలు సాధించినందుకు హ్యాపీగా ఉంది. 'స్వాతిముత్యం' సినిమాకు రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది'' అన్నారు నాగవంశీ. దివ్య శ్రీపాద, సురేఖా వాణి పాల్గొన్నారు.


● అమీ జాక్సన్

# ఎంట్రీ... రీ ఎంట్రీ.. ఒకేలా!

విక్రమ్ 'ఐ', రజనీకాంత్ '2.ఓ', రామ్ చరణ్ 'ఎవడు' చిత్రాలతో అమీ జాక్సన్ సుపరిచితురాలే. 2019లో ఇంగ్లీష్ వ్యాపారవేత్త జార్జ్‌ను పెళ్లాడారామె. అమీ ఓ బాబుకు జన్మనిచ్చారు. మూడేళ్ల బ్రేక్ తర్వాత ఆమె తిరిగి నటిగా మేకప్ వేసుకోనున్నారు. ఏఎల్ విజయ్ దర్శకత్వంలో అరుణ్ విజయ్ హీరోగా రూపొందనున్న 'అచ్చమ్ ఎన్నదు ఇల్లయే' అమీ రీ ఎంట్రీ మూవీ కానుంది. ఈ చిత్రంలో ఓ బ్రిటిష్ యువతి పాత్రలో కనిపించనున్నారు అమీ. కాగా అమీ వెండితెరకు ఎంట్రీ ఇచ్చిన తమిళ చిత్రం 'మద్రాస పట్టినమ్'కు దర్శకుడు అయిన ఏఎల్ విజయ్‌నే ఆమె రీ ఎంట్రీ ఫిల్మ్‌కు దర్శకుడు కావడం విశేషం. అంతేకాదు.. 'మద్రాస పట్టినమ్'లో బ్రిటిష్ యువతిగా నటించిన అమీ ఇప్పుడు అదే దర్శకుడు తీస్తున్న 'అచ్చమ్ ఎన్నదు..'లో కూడా సేమ్ బ్రిటిష్ యువతి పాత్రే చేస్తుండటం విశేషం.

# లక్ష్యం కోసం...


● తుషార, సత్యకృష్ణ, నాగ హాసిని, కాశీ విశ్వనాథ్

'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ కిషోర్, సత్యకృష్ణ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'తార'. మల్లిబాబు దర్శకత్వంలో పి. పద్మావతి సమర్పణలో పసుపులేటి వెంకటరమణ నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ఆరంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు–నిర్మాత సాయి వెంకట్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుల సంఘం అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్ క్లాప్ ఇచ్చారు. గూడ రామకృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మల్లిబాబు మాట్లాడుతూ– ''ఓ పదేళ్ల బాలిక సినిమా తార కావాలనుకునే లక్ష్యంతో ఇండస్ట్రీకి వచ్చి ఎన్ని కష్టాలు పడింది? ఫైనల్‌గా తన లక్ష్యాన్ని ఎలా నేరవేర్చుకుంది? అన్నదే ఈ చిత్రం కథాంశం'' అని అన్నారు. ''ఈ సినిమాతో మా అబ్బాయి మల్లిబాబును దర్శకుడిగా పరిచయం చేస్తున్నాను'' అన్నారు వెంకటరమణ. ఈ కార్యక్రమంలో జగన్, సహనిర్మాత సాయిమల్లి అరుణ్‌రామ్ పాల్గొన్నారు.


● శ్రీసింహా, నేహా సోలంకి

# అనుకున్నది సాధించాలి

శ్రీ సింహా, నేహా సోలంకి జంటగా నటించిన తాజా చిత్రం 'భాగ్ సాలే'. ప్రణీత్ సాయి దర్శకత్వంలో అర్జున్ దాస్యన్, యశ్ రంగినేని, కళ్యాణ్ సింగనమల నిర్మించిన ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్స్‌ను రిలీజ్ చేశారు. ''థ్రిల్లింగ్ క్రైమ్ కామెడీ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో అర్జున్ అనే పాత్రలో నటించారు శ్రీ సింహా. ఏం చేసైనా సరే అనుకున్నది సాధించాలనుకునే ఓ యువకుడి పాత్ర చుట్టూ తిరిగే కథ ఇది. జాన్ విజయ్, నందినీ రాయ్ నెగటివ్ రోల్స్‌లో కనిపిస్తారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అశ్వత్థామ, గిప్సన్ కొరబండి.

# సాక్షి బిజినెస్

శనివారం
8-10-2022

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ 31 | 58,191 | |
| నిఫ్టీ ▽ 17 | 17,315 | |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 10,684 | ▽ | 389 |
| డోజోన్స్ | 29,356 | ▽ | 571 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 6,991 | ▽ | 6 |
| డాక్స్ | 12,273 | ▽ | 198 |
| షాంఘై (సెప్టెంబర్ 30 ముగింపు) | 3,024 | ▽ | 17 |
| నికాయ్ | 27,116 | ▽ | 195 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్



## హీరో 'విదా' ఈవీ ఇదిగో..



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ద్విచక్ర వాహనాల తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్.. విదా బ్రాండ్ తొలి ఎలక్ట్రిక్ స్కూటర్‌ను భారత మార్కెట్లో శుక్రవారం ఆవిష్కరించింది. విదా వీ1 ప్లస్, విదా వీ1 ప్రో పేరుతో రెండు వేరియంట్లలో ఇది లభిస్తుందని సంస్థ చైర్మన్ పవన్ ముంజాల్ తెలిపారు. ధరల శ్రేణి ఎక్స్‌షోరూంలో రూ.1.45–1.59 లక్షలు. అక్టోబర్ 10 నుంచి బుకింగ్స్ మొదలు. బుకింగ్ కింద రూ.2,499 చెల్లిస్తే చాలు. డిసెంబర్ రెండవ వారం నుంచి డెలివరీలు ప్రారంభం. ఇకో, రైడ్, స్పోర్ట్స్‌తోపాటు కస్టమ్ మోడ్స్‌లో రూపొందించారు. వేరు చేయడానికి వీలుండే ఐపీ–68 రేటెడ్ బ్యాటరీ ప్యాక్ పొందుపరిచారు. వీ1 ప్రో ఒకసారి చార్జింగ్ చేస్తే 165 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని కంపెనీ ప్రకటించింది. వీ1 ప్లస్ 143 కిలోమీటర్లు పరుగెడుతుందని వెల్లడించింది.

## ఐడీబీఐ బ్యాంక్ విక్రయం షురూ

**బిడ్స్‌కు ఆహ్వానం పలికిన ప్రభుత్వం**

**న్యూఢిల్లీ:** ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటైజేషన్ ప్రక్రియకు ప్రభుత్వం తాజాగా తెరతీసింది. ఎల్‌ఐసీతో కలసి మొత్తం 60.72 శాతం వాటాను విక్రయించనుంది. ఇందుకు ఆసక్తి వ్యక్తీకరణ బిడ్స్(ఈవోఐ)కు ఆహ్వానం పలికింది. ఆసక్తి గల సంస్థలు బిడ్స్ దాఖలు చేసేందుకు డిసెంబర్ 16 వరకూ గడువును ప్రకటించింది. ప్రస్తుతం బ్యాంకులో బీమా రంగ పీఎస్‌యూ ఎల్‌ఐసీకి 49.24 శాతం వాటా ఉంది. ప్రభుత్వం 45.48 శాతం వాటాను కలిగి ఉంది. వెరసి సంయుక్తంగా 94.72 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ప్రైవేటైజేషన్‌లో భాగంగా ప్రభుత్వం 30.48 శాతం, ఎల్‌ఐసీ 30.24 శాతం చొప్పున వాటాలు విక్రయించనున్నాయి. వాటాలతోపాటు బ్యాంకులో యాజమాన్య నియంత్రణను సైతం బదిలీ చేయనున్నట్లు బిడ్స్‌కు ఆహ్వానం పలికిన దీపమ్ వెల్లడించింది. ఇందుకు పలు నిబంధనలు వెల్లడించింది. డీల్ తదుపరి సంయుక్త వాటా 34 శాతానికి పరిమితంకానుంది.




**నిబంధనలివీ..:** ఐడీబీఐ కొనుగోలుకి ఈవోఐ దాఖలు చేసే కంపెనీలు కనీసం రూ. 22,500 కోట్ల నెట్‌వర్త్‌ను కలిగి ఉండాలి. అంతేకాకుండా గత ఐదేళ్లలో మూడేళ్లపాటు లాభాలు ఆర్జించిన కంపెనీకి మాత్రమే బిడ్డింగ్‌కు అర్హత లభిస్తుంది. కన్సార్షియంగా ఏర్పాటైతే నాలుగు కంపెనీలను మించడానికి అనుమతించరు. విజయవంతమైన బిడ్డర్ కనీసం ఐదేళ్లపాటు బ్యాంకులో 40% వాటాను తప్పనిసరిగా లాకిన్ చేయాలి. భారీ పారిశ్రామిక, కార్పొరేట్ హౌస్‌లు, వ్యక్తులను బిడ్డింగ్‌కు అనుమతించరు.

**ఈ వార్తల నేపథ్యంలో ఐడీబీఐ బ్యాంక్ షేరు 0.7 శాతం బలపడి రూ. 43 వద్ద ముగిసింది. ఈ ధరలో 60.72 శాతం వాటాకు రూ. 27,800 కోట్లు లభించే వీలుంది.**

## బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఐపీవోకు క్యూ

**చివరి రోజుకి 72 రెట్లు అధికంగా బిడ్స్**


**న్యూఢిల్లీ:** కన్జూమర్ వస్తు రిటైల్ చైన్ ఎలక్ట్రానిక్స్ మార్ట్ ఇండియా పబ్లిక్ ఇష్యూ సూపర్ సక్సెస్ సాధించింది. ఇష్యూ చివరి రోజు శుక్రవారానికల్లా 72 రెట్లు అధికంగా స్పందన లభించింది. షేరుకి రూ. 56–59 ధరలో చేపట్టిన ఇష్యూలో భాగంగా 6.25 కోట్ల షేర్లను కంపెనీ విక్రయానికి ఉంచింది. అయితే ఏకంగా 449.53 కోట్ల షేర్లకు బిడ్స్ దాఖలయ్యాయి. బజాజ్ ఎలక్ట్రానిక్స్ బ్రాండుతో కంపెనీ రిటైల్ స్టోర్లను నిర్వహిస్తోంది. అర్హత గల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 169.54 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 63.59 రెట్లు అధికంగా బిడ్స్ దాఖలయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్లు సైతం 19.7 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు.




## రోజంతా నష్టాల్లోనే

- చివర్లో కోలుకున్న మార్కెట్లు
- స్వల్ప నష్టాలతో ముగింపు
- సెన్సెక్స్ 31, నిఫ్టీ 17 పాయింట్లు డౌన్

**ముంబై:** ప్రపంచ మార్కెట్ల బలహీనతలతో రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. నష్టాలతో ప్రారంభమైన దేశీ స్టాక్ మార్కెట్లు రోజంతా నేలచూపులకే పరిమితమయ్యాయి. అయితే తొలి సెషన్‌తోపాటు, చివరి సెషన్లలో నామమాత్రంగా కోలుకున్నాయి. చివరికి స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 31 పాయింట్లు క్షీణించి 58,191 వద్ద నిలవగా.. నిఫ్టీ 17 పాయింట్లు తక్కువగా 17,315 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 371 పాయింట్లు కోల్పోయి 57,851 వద్ద కనిష్టానికి చేరింది. చమురు దేశాల (ఒపెక్) సరఫరా కోతలతో క్రూడ్ ధరలు పెరిగాయి. ఇది రూపాయిని దెబ్బతీసింది. యూఎస్‌సహా విదేశీ మార్కెట్లు ఆటుపోట్లను చవిచూస్తుండటంతో ఇన్వెస్టర్లలో ఆందోళనలు కొనసాగుతున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.



**టైటన్ జోరు:** ఎన్‌ఎస్‌ఈలో ఐటీ, ఆయిల్, ఫార్మా రంగాలు 0.75 శాతం క్షీణించగా.. కన్జూమర్ డ్యూరబుల్స్ 1.3 శాతం ఎగసింది. నిఫ్టీ దిగ్గజాలలో టైటన్ 5.3% జంప్‌చేయడం ఇందుకు సహకరించింది. ఇతర బ్లూచిప్స్‌లో పవర్‌గ్రిడ్, గ్రాసిమ్, ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ, ఇండస్‌ఇండ్, మారుతీ 1.5–1% మధ్య పుంజుకోగా.. టాటా కన్జూమర్, బీపీసీఎల్, ఎంఅండ్‌ఎం, అల్ట్రాటెక్, ఎస్‌బీఐ, జేఎస్‌డబ్ల్యూ, టీసీఎస్, ఐషర్, సీఐఎల్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్ 2–1% మధ్య నష్టపోయాయి.

## డిజిటల్ రూపాయి.. వచ్చేస్తోంది

- సీబీడీసీలపై అవగాహనకు కాన్సెప్ట్ నోట్
- విడుదల చేసిన ఆర్‌బీఐ

**ముంబై:** దేశీ డిజిటల్ ఎకానమీకి మరింత ఊతమిచ్చే దిశగా డిజిటల్ రూపాయిని త్వరలో ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తేనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. నిర్దిష్ట అవసరాల కోసం వినియోగించేలా ఈ–రూపీని పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొంది. పేమెంట్ వ్యవస్థలను మరింత సమర్థమంతమైనవిగా తీర్చిదిద్దేందుకు, మనీ లాండరింగ్‌ను నిరోధించేందుకు ఇది తోడ్పడగలదని తెలిపింది. దీనికి సంబంధించి అవగాహన కల్పించేందుకు కాన్సెప్ట్ నోట్‌ను రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం విడుదల చేసింది. డిజిటల్ రూపాయి నేపథ్యం, ప్రత్యేకతలు, ఇతరత్రా విధాన పరమైన అంశాలు మొదలైన వివరాలను ఇందులో పొందుపర్చింది. 'అధునాతనమైన, సులభమైన, సమర్థమంతమైన, సురక్షితమైన పేమెంట్ సిస్టమ్‌ల సహకారంతో డిజిటల్ రూపాయి .. దేశ డిజిటల్ ఎకానమీకి మరింత ఊతమిస్తుంది. త్వరలో నిర్దిష్ట అవసరాల కోసం పైలట్ ప్రాతిపదికన దీన్ని అందుబాటులోకి తెస్తాం. క్రమంగా పరిధిని విస్తరిస్తాం. ఈ–రూపీ ప్రయోజనాలు, ఫీచర్ల గురించి ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉంటాం' అని ఆర్‌బీఐ పేర్కొంది. ఇది వివిధ రూపాల్లో ప్రస్తుతం చలామణీలో ఉన్న నగదు, చెల్లింపు విధానాలకు అదనంగా మరో విధానం మాత్రమే తప్ప వాటి స్థానంలో ప్రవేశపెడుతున్నది కాదని స్పష్టం చేసింది.



**రెండు రకాలు..**

రిజర్వ్ బ్యాంక్ అధికారికంగా ప్రవేశపెట్టే సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) ప్రధానంగా రిటైల్, హోల్‌సేల్ అని రెండు రకాలుగా ఉండనుంది. రిటైల్ సీబీడీసీ సాధారణంగా ప్రజలందరూ వినియోగించుకునేందుకు ఉద్దేశించినది. హోల్‌సేల్ సీబీడీసీ అనేది ప్రత్యేకంగా నిర్దిష్ట ఆర్థిక సంస్థల వినియోగం కోసం ఉంటుంది. కేవలం కొన్ని దేశాలు మాత్రమే ఈ తరహా డిజిటల్ కరెన్సీని ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్న నేపథ్యంలో.. ద్రవ్యపరపతి విధానంపై సీబీడీసీ చూపబోయే ప్రభావాలు ప్రస్తుతానికి ఊహాజనితమైనవేనని ఆర్‌బీఐ తెలిపింది.

### పతన బాటనే రూపాయి

డాలర్ మారకంలో రూపాయి చరిత్రాత్మక పతన రికార్డు కొనసాగుతోంది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో శుక్రవారం 13 పైసలు పడిపోయి, రికార్డు కనిష్టం 82.30 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ఒక దశలో 82.43 స్థాయినీ చూసింది. ఈ రెండు దిగువ స్థాయిలనూ రూపాయి చూడ్డం ఇదే తొలిసారి. డాలర్ బలోపేతం, మళ్లీ క్రూడ్ ధరల జోరు, మార్కెట్ల బలహీనత, ద్రవ్యోల్బణం సవాళ్లు, దిగుమతులు పడిపోవడం, తగ్గుతున్న ఫారెక్స్ నిల్వల వంటి అంశాలు రూపాయి బలహీనతకు కారణమవుతున్నాయి. వారంలో రూపాయి 90 పైసలు (1.11%) పతనమైంది.

**ఫారెక్స్ నిల్వలు... 9వ వారమూ డౌన్**

భారత్ విదేశీ మారకపు ద్రవ్య నిల్వలు వరుసగా తొమ్మిదవ వారమూ దిగజారాయి. సెప్టెంబర్ 30తో ముగిసిన వారంలో 4.854 బిలియన్ డాలర్లు తగ్గి 532.664 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి. 2021 అక్టోబర్‌లో ఫారెక్స్ నిల్వలు ఆల్‌టైమ్ గరిష్టం 645 బిలియన్ డాలర్ల స్థాయిని తాకాయి.

**బులియన్** రూ.లలో

| ముంబై | | | |
|---|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 51,908 | ▲ | 70 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 51,700 | ▲ | 70 |
| వెండి (కిలో) | 61,154 | ▲ | 484 |

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 8-10-2022 | |
|---|---|
| విశాఖ | 430–00 |
| చిత్తూరు | 423–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 430–00 |
| విజయవాడ | 430–00 |
| రిటైల్ ధర (డజను) | 66.00 |
| **7-10-2022 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 406–00 |
| వరంగల్ | 408–00 |
| రిటైల్ ధర | 4.60 |

## అమెజాన్‌లో విశాఖ వాసుల సూపర్ షాపింగ్

**ల్యాప్‌టాప్‌లు, ఆడియో ఉత్పత్తులకు అధిక డిమాండ్**

**విశాఖపట్నం:** అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్‌లో (అమెజాన్ జీఐఎఫ్ 2022) విశాఖ వాసులు అదరగొట్టారు. హైఎండ్ గేమింగ్, బిజినెస్ ల్యాప్‌టాప్‌లు, వేరబుల్స్, కెమెరాలు, వైర్‌లెస్ ఇయర్ ఫోన్లు, వైర్, వైర్‌లెస్ స్పీకర్లు, బ్లూటూత్ స్పీకర్లు, సౌండ్‌బార్లను అధికంగా కొనుగోలు చేస్తున్నారు. రూ.10–20వేల శ్రేణిలోని స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. డిమాండ్ పరంగా మంచి పనితీరు చూపించిన పట్టణాల్లో విశాఖపట్నం కూడా ఉన్నట్టు అమెజాన్ ఇండియా ప్రకటించింది. సెప్టెంబర్ 23 నుంచి జీఐఎఫ్‌ను అమెజాన్ నిర్వహిస్తోంది. స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు, కన్జూమర్ ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, గృహోపకరణాలపై ఆకర్షణీయమైన డీల్స్, ఆఫర్లను అందిస్తోంది. అమెజాన్ ఇండియా కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, పర్సనల్ కంప్యూటింగ్ డైరెక్టర్ అక్షయ్ అహుజా మాట్లాడుతూ.. ''ఆంధ్రప్రదేశ్‌లోని కస్టమర్ల నుంచి మంచి స్పందన అందుకుంటున్నాం. ఈ అద్భుత స్పందనకు గాను వారికి మా ధన్యవాదాలు. ఆంధ్రప్రదేశ్ రీజియన్ నుంచి కస్టమర్లు టెక్నాలజీ ఉత్పత్తులు అయిన ల్యాప్‌టాప్‌లు, కెమెరాలు, ఆడియో ఎక్విప్‌మెంట్‌లు కొనుగోలు చేస్తున్నారు. నెలరోజుల పాటు జరిగే గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్‌లో ఇదే డిమాండ్ కొనసాగుతుందని భావిస్తున్నాం''అని పేర్కొన్నారు.




## కెనరా బ్యాంకు ప్రత్యేక డిపాజిట్ స్కీమ్

**హైదరాబాద్:** ప్రభుత్వరంగ కెనరా బ్యాంకు ప్రత్యేక టర్మ్ డిపాజిట్ స్కీమ్‌ను తన కస్టమర్ల కోసం ప్రకటించింది. 666 రోజుల కాల వ్యవధికి డిపాజిట్ చేస్తే 7 శాతం వార్షిక రేటును ఆఫర్ చేస్తోంది. 60 ఏళ్లు నిండిన వృద్ధులకు ఇదే డిపాజిట్‌పై అర శాతం అధికంగా 7.50 శాతం రేటును ఆఫర్ చేస్తోంది. రూ.2 కోట్లలోపు ఉండే డిపాజిట్‌లకు ఇది వర్తిస్తుందని కెనరా బ్యాంకు ప్రకటించింది. ప్రభుత్వరంగ బ్యాంకు నుంచి ఇది అత్యధిక రేటుగా పేర్కొంది.




# సాక్షి స్పోర్ట్స్



### 'లక్నో' జట్టు గ్లోబల్ మెంటార్‌గా గంభీర్

భారత మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ బాధ్యతలు పెరిగాయి. రాజీవ్ ప్రతాప్ సంజీవ్ గోయెంకా (ఆర్‌పీఎస్‌జీ) గ్రూప్‌నకు చెందిన టి20 క్రికెట్ జట్లకు అతను ఇకపై గ్లోబల్ మెంటార్‌గా వ్యవహరించనున్నాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను రెండుసార్లు చాంపియన్‌గా నిలిపిన ఈ మాజీ కెప్టెన్‌ను తొలుత లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్‌జీ) మార్గనిర్దేశకుడు (మెంటార్)గా నియమించింది. అనంతరం దక్షిణాఫ్రికా టి20 లీగ్‌లోకి ప్రవేశించిన ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ డర్బన్ ఫ్రాంచైజీని కొనుగోలు చేసింది. ఇప్పుడు గ్లోబల్ మెంటార్ బాధ్యతలు అప్పగించడంతో గంభీర్ డర్బన్ సూపర్ జెయింట్స్‌కు కూడా మార్గనిర్దేశకుడిగా ఉంటాడు. దీనిపై స్పందించిన గంభీర్ 'నాపై నమ్మకంతో కట్టబెట్టిన అదనపు బాధ్యతల్ని సమర్థంగా నిర్వర్తించేందుకు కృషిచేస్తా. ఆటగాళ్లకు మార్గదర్శనం చేస్తూ జట్లకు విజయాలు అందించడంపైనే దృష్టిసారిస్తా' అని అన్నాడు.

## వ్రిత్తి ఖాతాలో మరో పతకం



**అహ్మదాబాద్:** జాతీయ క్రీడల్లో తెలంగాణ ఖాతాలో మరో పతకం చేరింది. మహిళల స్విమ్మింగ్ 400 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో వ్రిత్తి అగర్వాల్ కాంస్య పతకం సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగిన ఈ విభాగంలో వ్రిత్తి 4 నిమిషాల 34.96 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచింది. ఈ జాతీయ క్రీడల్లో వ్రిత్తికిది మూడో పతకం కావడం విశేషం. ఇప్పటి వరకు తెలంగాణ ఏడు స్వర్ణాలు, ఏడు రజతాలు, నాలుగు కాంస్యాలతో కలిపి మొత్తం 18 పతకాలతో 14వ స్థానంలో ఉంది.

## కేరళ బ్లాస్టర్స్ విజయం

**కొచ్చి:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో గత సీజన్ రన్నరప్ కేరళ బ్లాస్టర్స్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో కేరళ బ్లాస్టర్స్ 3–1 గోల్స్ తేడాతో ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టును ఓడించింది. కేరళ తరఫున ఇవాన్ కలియుజినీ (82వ, 89వ ని.లో) రెండు గోల్స్ సాధించగా ... అడ్రియన్ లూనా (72వ ని.లో) ఒక గోల్ చేశాడు. ఈస్ట్ బెంగాల్ జట్టుకు అలెక్స్ లీమా (88వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. బెంగళూరులో నేడు జరిగే మ్యాచ్‌లో బెంగళూరు ఎఫ్‌సీతో నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ ఆడుతుంది.

## భారత మహిళలకు షాక్

- పాకిస్తాన్ చేతిలో అనూహ్య ఓటమి
- ఆసియా కప్ టి20 టోర్నీ

**సిల్హెట్ (బంగ్లాదేశ్):** ఆసియా కప్ మహిళల టి20 టోర్నీలో జోరుగా దూసుకుపోతున్న భారత బృందానికి బ్రేక్ పడింది. ఫేవరెట్‌గా ఉన్న హర్మన్‌ప్రీత్ సేన పాకిస్తాన్ చేతిలో అనూహ్యంగా పరాజయం పాలై ఆశ్చర్యపర్చింది. శుక్రవారం మ్యాచ్‌కు ముందు టి20ల్లో పాక్‌తో 12 సార్లు తలపడి 10 సార్లు గెలిచిన భారత్... చివరిసారిగా 2016లో ఆ జట్టు చేతిలో ఓడింది. ఇప్పుడు ఆరేళ్ల తర్వాత పాకిస్తాన్ మన జట్టుపై విజయం సాధించింది. చివరి వరకు ఆసక్తికరంగా సాగిన పోరులో పాక్ 13 పరుగుల తేడాతో భారత్‌పై గెలుపొందింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేయగా, భారత్ 19.4 ఓవర్లలో 124 పరుగులకే ఆలౌటైంది. గురువారం అనూహ్యంగా థాయ్‌లాండ్ చేతిలో ఓడిన పాక్ కోలుకొని ఆసియాకప్ టోర్నీలో తొలిసారి భారత్‌పై విజయాన్ని అందుకోవడం విశేషం.

ఓపెనర్లు మునీబా (17; 1 ఫోర్), సిద్రా (11; 1 ఫోర్)తో పాటు ఒమైమా (0) కూడా విఫలం కావడంతో ఆరు ఓవర్ల లోపే 33 పరుగుల వద్ద పాక్ 3 వికెట్లు కోల్పోయింది. అయితే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నిదా దార్ (37 బంతుల్లో 56 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ బిస్మా మారూఫ్ (35 బంతుల్లో 32; 2 ఫోర్లు) కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 58 బంతుల్లో 76 పరుగులు జోడించారు. దీప్తి శర్మ 27 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, పూజ వస్త్రకర్ 2 వికెట్లు తీసింది. ఛేదనలో ఓపెనర్లు సబ్బినేని మేఘన (15; 1 ఫోర్, 1 సిక్స్), స్మృతి మంధాన (17; 2 ఫోర్లు), హేమలత (20; 3 ఫోర్లు ) కొన్ని చక్కటి షాట్లు ఆడినా ఎక్కువ సేపు నిలవలేకపోయారు. ఫామ్‌లో ఉన్న జెమీమా (2) విఫలం కాగా, చెప్పుకోదగ్గ భాగస్వామ్యం ఒక్కటీ లేకపోయింది. బ్యాటింగ్ ఆర్డర్‌ను మారుస్తూ ఏడో స్థానంలో వచ్చిన హర్మన్‌ప్రీత్ (12) ప్రయోగం విఫలమైంది. తీవ్ర ఎండ కారణంగా కీపింగ్ వదిలి మధ్యలోనే మైదానం వీడిన రిచా ఘోష్ (13 బంతుల్లో 26; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు రావాల్సి వచ్చింది. చివరి 3 ఓవర్లలో 43 పరుగులు చేయాల్సి ఉండగా నష్రా బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లతో పాటు సాదియా ఓవర్లోనూ వరుసగా 6, 4 కొట్టి రిచా గెలుపుపై ఆశలు రేపింది. అయితే అదే ఓవర్లో ఆమెను సాదియా అవుట్ చేయగా... చివరి ఓవర్లో 18 పరుగులు కావాల్సి ఉండగా, భారత్ 4 పరుగులకే పరిమితమైంది. నష్రా 3 వికెట్లు తీయగా... నిదా, సాదియా చెరో 2 వికెట్లు పడగొట్టారు. **నేడు జరిగే ఐదో లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో భారత్ తలపడుతుంది. మధ్యాహ్నం ఒంటి గంటకు మొదలయ్యే ఈ మ్యాచ్ ను స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.**


నిదా దార్



## హర్మన్‌ప్రీత్‌కు 'ఎఫ్‌ఐహెచ్' అవార్డు

**వరుసగా రెండో ఏడాది 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపిక**

**న్యూఢిల్లీ:** భారత స్టార్ డిఫెండర్ హర్మన్‌ప్రీత్ సింగ్ వరుసగా రెండో ఏడాది కూడా అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు ఎంపికయ్యాడు. అతను నిలకడైన ఆటతీరుతో ఇంటాబయటా జట్టు విజయాల్లో కీలకభూమిక పోషిస్తున్నాడు. ఈ భారత వైస్‌కెప్టెన్ 2021–22 ఎఫ్‌ఐహెచ్ హాకీ ప్రో లీగ్‌లో విశేషంగా రాణించాడు. 16 మ్యాచ్‌లాడిన హర్మన్‌ప్రీత్ 18 గోల్స్ చేశాడు. దీంతో ఒక సీజన్‌లో అత్యధిక గోల్స్ చేసిన భారత ఆటగాడిగా రికార్డులకెక్కాడు. గతేడాది ఢాకాలో జరిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో అతని (6 మ్యాచ్‌ల్లో 8 గోల్స్) ప్రదర్శన వల్లే భారత జట్టు కాంస్యం గెలిచింది. ప్రతీ మ్యాచ్‌లోనూ గోల్ చేయడం విశేషం. ఈ ఏడాది బర్మింగ్‌హామ్‌లో జరిగిన ప్రతిష్టాత్మక 'కామన్వెల్త్ గేమ్స్'లో భారత్ రన్నరప్‌గా నిలువడంలోనూ అతని పాత్ర ఉంది. 'హర్మన్‌ప్రీత్ ఆధునిక హాకీ క్రీడలో సూపర్ స్టార్. అతని డిఫెన్స్ అద్భుతం. ప్రత్యర్థుల రక్షణ పంక్తిని బోల్తా కొట్టించడంలో అతను ఘనాపాటి. తన స్టిక్‌కు అందిన బంతిని చకచకా ఆడిస్తూ తీసుకెళ్లే సామర్థ్యం అతని సొంతం. అదే వేగంతో గోల్‌పోస్ట్‌లోకి పంపడంలోనూ హర్మన్ దిట్ట. అందుకే వరుసగా ఈ ఏడాది కూడా అతన్నే అవార్డు వరించింది' అని ఎఫ్‌ఐహెచ్ ఒక ప్రకటనలో కొనియాడింది. పురుషుల హాకీలో వరుసగా ఇలా అవార్డులు పొందిన నాలుగో ఆటగాడిగా హర్మన్ ఘనత వహించాడు. గతంలో డి నూయిజెర్ (నెదర్లాండ్స్), జేమీ డ్వెయర్ (ఆస్ట్రేలియా), ఆర్థర్ వాన్ డొరెన్ (బెల్జియం)లు రెండేళ్లు 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా నిలిచారు. తాజా అవార్డు బరిలో ప్యానెల్... హర్మన్ ప్రీత్ సింగ్‌కు 29.4 పాయింట్లు ఇవ్వగా, రేసులో ఉన్న బ్రింక్ మన్ (నెదర్లాండ్స్; 23.6), టామ్ బూన్ (బెల్జియం; 23.4) వెనుకబడ్డారు.




## వచ్చే ప్రపంచకప్ చివరిది: మెస్సీ

**బార్సిలోనా:** అర్జెంటీనా ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ లయనెల్ మెస్సీ తన కెరీర్‌లో చివరిసారి ప్రపంచకప్‌లో బరిలోకి దిగనున్నాడు. వచ్చే నెల 20 నుంచి డిసెంబర్ 18 వరకు ఖతర్‌లోని ఐదు నగరాల్లో నిర్మించిన ఎనిమిది వేదికల్లో ప్రపంచకప్ జరగనుంది. 'నా కెరీర్‌లో ఇదే ఆఖరి వరల్డ్‌కప్. దీనిపై నేను కచ్చితమైన నిర్ణయంతో ఉన్నాను' అని 35 ఏళ్ల మెస్సీ అన్నాడు. ఇది కేవలం ప్రపంచకప్‌కు సంబంధించిన అంశం. 2024లో కోపా అమెరికా కప్‌లో, అలాగే ప్రతిష్టాత్మక క్లబ్ లీగ్‌లలో ఈ అర్జెంటీనా స్ట్రయికర్ ఆడతాడు. తన కెరీర్‌లో ఇప్పటివరకు నాలుగు ప్రపంచకప్‌లు ఆడిన మెస్సీ 2014 ప్రపంచకప్‌లో తన కెప్టెన్సీలో అర్జెంటీనా జట్టును రన్నరప్‌గా నిలిపాడు. 2005 నుంచి అర్జెంటీనా సీనియర్ జట్టు తరఫున ఆడుతున్న మెస్సీ 164 మ్యాచ్‌ల్లో మొత్తం 90 గోల్స్ సాధించాడు. అత్యధిక గోల్స్ చేసిన ఆటగాళ్ల జాబితాలో టాప్–2లో కొనసాగుతున్నాడు. పోర్చుగల్ స్టార్ రొనాల్డో (117 గోల్స్) టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.



## పరాజయంతో మొదలు

**తొలి మ్యాచ్‌లో ఓడిన తెలుగు టైటాన్స్**

**బెంగళూరు:** ప్రొ కబడ్డీ లీగ్ తొమ్మిదో సీజన్‌ను తెలుగు టైటాన్స్ జట్టు పరాజయంతో ప్రారంభించింది. మాజీ చాంపియన్ బెంగళూరు బుల్స్‌తో శుక్రవారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 29–34 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. తెలుగు టైటాన్స్ తరఫున రెయిడర్లు వినయ్, రజనీశ్ ఏడు పాయింట్ల చొప్పున స్కోరు చేయగా... సిద్ధార్థ్ దేశాయ్ నాలుగు పాయింట్లతో నిరాశపరిచాడు. బెంగళూరు బుల్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. నీరజ్ నర్వాల్ (7 పాయింట్లు), భరత్ (5), వికాశ్ కండోలా (5), మహేందర్ సింగ్ (4), సౌరభ్ (4 పాయింట్లు) రాణించి బెంగళూరు విజయంలో కీలకపాత్ర పోషించారు. శుక్రవారమే జరిగిన మరో రెండు మ్యాచ్‌ల్లో దబంగ్ ఢిల్లీ 41–27తో యు ముంబాను ఓడించగా... యూపీ యోధాస్ 34–32 పాయింట్ల తేడాతో జైపూర్ పింక్ పాంథర్స్ జట్టుపై గెలుపొందింది.


టైటాన్స్ ప్లేయర్‌ను నిలువరిస్తున్న బెంగళూరు ఆటగాడు

## గెలుపుతో పాక్ బోణీ

**క్రైస్ట్‌చర్చ్:** ముక్కోణపు టి20 టోర్నీలో పాకిస్తాన్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో పాక్ 21 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మొహమ్మద్ రిజ్వాన్ (50 బంతుల్లో 78 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా, షాన్ మసూద్ (22 బంతుల్లో 31; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. తస్కిన్ అహ్మద్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 146 పరుగులే చేయగలిగింది. యాసిర్ అలీ (21 బంతుల్లో 42 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), లిటన్ దాస్ (26 బంతుల్లో 35; 4 ఫోర్లు, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. వసీమ్ 3, నవాజ్ 2 వికెట్లు పడగొట్టారు. టోర్నీలో భాగంగా నేడు జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో పాకిస్తాన్ తలపడుతుంది.


రిజ్వాన్

## ఆసీస్‌దే రెండో టి20

**బ్రిస్బేన్:** వెస్టిండీస్‌తో రెండు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను ఆస్ట్రేలియా 2–0తో క్లీన్‌స్వీప్ చేసింది. శుక్రవారం జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 31 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 7 వికెట్లకు 178 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డేవిడ్ వార్నర్ (41 బంతుల్లో 75; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో అదరగొట్టాడు. టిమ్ డేవిడ్ (20 బంతుల్లో 42; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా దూకుడుగా ఆడాడు. విండీస్ బౌలర్లలో అల్జారి జోసెఫ్ (3/21), మెకాయ్ (2/33) రాణించారు. అనంతరం 179 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 147 పరుగులు చేసి ఓడిపోయింది. చార్లెస్ (29; 2 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆసీస్ బౌలర్ స్టార్క్ (4/20) తన అంతర్జాతీయ టి20 కెరీర్లో ఉత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేశాడు.


స్టార్క్

# ఈనెల 26న ఎంఎల్‌హెచ్‌పీ నియామక పరీక్ష

**1,681 పోస్టులకు ఆన్‌లైన్‌లో టెస్ట్ • సుమారు 12 వేల మంది దరఖాస్తు**

**సాక్షి, అమరావతి:** ఈనెల 26వ తేదీన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) నియామక పరీక్షను ఏపీ ఆన్‌లైన్ ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహించనుంది. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో వైద్య సేవలు అందించడానికి 1,681 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీకి గత ఆగస్టులో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 12 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య ఆధారంగా జిల్లాకు ఒకటి నుంచి రెండు పరీక్ష కేంద్రాలు గుర్తించారు. నియామక పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. బీఎస్సీ నర్సింగ్ సిలబస్ నుంచి 200 ప్రశ్నలకు మల్టిపుల్ ఆప్షనల్స్ ఉంటాయి. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే పరీక్షకు సమయం 3 గంటలు ఉంటుంది. నెగిటివ్ మార్కులు ఉండవు.

### రాష్ట్ర వ్యాప్తంగా 10,032

గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయడం కోసం 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. వీటిలో వైద్య సేవలు అందించడానికి బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత కలిగిన వారిని ఎంఎల్‌హెచ్‌పీలుగా నియమిస్తున్నారు. ఇప్పటికే 8,351 పోస్టులను భర్తీ చేశారు. మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది.

### జోన్‌ల వారీగా ఖాళీలు ఇలా..

జోన్‌-1 (ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ): 233
జోన్‌-2 (ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా): 658
జోన్‌-3 (ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు): 494
జోన్‌-4 (ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్, అనంతపురం, కర్నూలు): 296





# అన్ని జిల్లాలకు ఫోర్టిఫైడ్ బియ్యం

**మంత్రి కారుమూరి**



**సాక్షి, విశాఖపట్నం:** పోషక విలువలున్న ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రస్తుతం ఏడు జిల్లాల్లోని ప్రజలకు సరఫరా చేస్తున్నామని, మార్చి 2023 నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వెంకటనాగేశ్వరరావు చెప్పారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల డీఎస్‌వో, డీఎంలు, లీగల్ మెట్రాలజీ అధికారులతో ధాన్యం సేకరణ, విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ తదితర అంశాలపై విశాఖ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్లో 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా పెట్టుకున్నట్టు మంత్రి తెలిపారు. రైతులకు నష్టం కలగకుండా.. గిట్టుబాటు ధరతో సంతోషంగా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్న సీఎం జగన్ ఆలోచనలకు అనుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 93 వేబ్రిడ్జిల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్టు వివరించారు. ఒడిశా నుంచి ఒక్క ధాన్యం గింజ కూడా రాష్ట్రంలోకి రాకుండా సరిహద్దుల్లో గట్టి నిఘా పెట్టాలని విజిలెన్స్ అధికారుల్ని ఆదేశించారు. గతంలో 85 శాతమే రేషన్ పంపిణీ జరిగేదని, డోర్ టు డోర్ వాహనాలు ఏర్పాటు చేశాక 92 శాతం పంపిణీ జరుగుతోందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలతో పోల్చి చూసే ఏపీలోనే నిత్యావసర వస్తువుల ధరలు తక్కువ గా ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని మాల్స్ పైనా, థియేటర్ల వద్ద షాపుల పైనా ఏ క్షణంలోనైనా దాడులు చేసి.. నిబంధనలు మీరిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# మహారాజా ఆస్పత్రి పేరు తొలగింపు సరికాదు

**టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు**



**సాక్షి, అమరావతి:** విజయనగరంలోని మహారాజా ఆస్పత్రి పేరు తొలగింపు మరో తుగ్లక్ చర్య అని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు విమర్శించారు. హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరు తొలగించి ప్రభుత్వం తీవ్ర విమర్శల పాలైందని, మాన్సాస్ ట్రస్ట్, సింహాచలం దేవస్థానం చైర్మన్ పోస్టుల నుంచి అశోక్‌గజపతిరాజును ఇలాగే తప్పించి కోర్టుతో అక్షింతలు వేయించుకుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు సామాన్యుడి జీవి తాలను ఛిద్రం చేస్తున్నాయని తెలిపారు. ప్రజలను బాదేస్తున్న పన్నులు ఎటుపోతున్నాయని, లక్షలకోట్ల అప్పులు ఏమవుతున్నాయని ప్రశ్నించారు.

# విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు



**రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ):** ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటించారు. ఈ నెల 9న తిరుపతి-శ్రీకాకుళం (07451), 10న నాందేడ్-నర్సాపూర్ (07565), 18, 25 తేదీల్లో తిరునల్వేలి-ధనాపూర్ (06190), 21న ధనాపూర్-తిరునల్వేలి (06189), 28న ధనాపూర్-తాంబరం (06187) ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు అధికారులు వివరించారు.

**పలు మెమో రైళ్లు రద్దు**

విజయవాడ డివిజన్ చిన్నగంజాం స్టేషన్‌లో మూడో లైన్ నిర్మాణ పనుల కారణంగా పలు మెమో రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే డివిజనల్ పీఆర్వో నుస్రత్.ఎం.మండ్రూప్కర్ తెలిపారు.





# టీడీపీ నేత ఇంతియాజ్ అరెస్ట్

▶ మొదటి పేజీ తరువాయి



ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అంతకు ముందు తన తండ్రి సెల్‌ఫోన్‌లో తీసుకున్న సెల్ఫీ వీడియోలో తన ఆత్మహత్యకు ఇంతియాజే కారణమని పేర్కొంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని నల్లచెరువు మండలం సంజీవపల్లి వద్ద అరెస్ట్ చేసి.. రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా ఇంతియాజ్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ నల్లచెరువు మండలం దేవిరింటిపల్లి వద్ద ఉన్న మోడల్ కళాశాల విద్యార్థినులు అనంతపురం-చెన్నై జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సంధ్యారాణి ఫొటోలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ.. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు గంటపాటు రాస్తారోకో కొనసాగింది.

# అక్రమ వ్యాపారాలకు కేరాఫ్ అచ్చెన్న అనుచరుడు!

- తాజాగా నకిలీ పోలీసు నేమ్ బోర్డుతో ఒడిశాలో ప్రయాణం
- బరంపురంలో పట్టుబడ్డ వైనం

**సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:** టీడీపీ అధికారంలో ఉండగా యథేచ్ఛగా పలు అక్రమ వ్యాపారాలను నిర్వహిస్తూ పబ్బం గడుపుకున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అనుచరుడు కోరాడ సుబ్రహ్మణ్యం తాజాగా తన కారుకు నకిలీ పోలీసు నేమ్ బోర్డు పెట్టుకుని తిరుగుతూ ఒడిశా పోలీసులకు దొరికిపోయాడు. వివరాల్లోకి వెళితే.. కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కోరాడ సుబ్రహ్మణ్యం కింజరాపు అచ్చెన్నాయుడికి ప్రధాన అనుచరుడు. ఈయన కొత్తపల్లిలో ఇనుము, సిమెంట్ వ్యాపారం చేస్తుంటాడు. దీంతో పాటు ఫెర్టిలైజర్స్ డీలర్‌షిప్ ఉంది. ఒడిశా ప్రాంతం నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా సరుకులు రవాణా చేస్తుంటాడనే ఆరోపణలున్నాయి. టీడీపీ హయాంలో ఒడిశా నుంచి సిమెంట్, ఎరువులు, విత్తనాలను ఎటువంటి పత్రాలు లేకుండా లారీల్లో దిగుమతి చేస్తుండేవాడన్న వాదనలున్నాయి. 2021 ఆగస్టులో సుబ్రహ్మణ్యం గోడౌన్‌పై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. అక్కడ ఈ-వే బిల్లులు లేకుండా ఒడిశా నుంచి సిమెంట్ రవాణా చేసినట్లు గుర్తించి రూ.48 వేల జరిమానా విధించారు. అలాగే సిమెంట్ అక్రమ నిల్వలున్నాయన్న సమాచారంతో గోడౌన్‌లో దాడులు నిర్వహించగా అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన 122 యూరియా బస్తాలు బయటపడ్డాయి. ఇదిలా ఉండగా.. ఏపీ 39 ఎల్‌డబ్ల్యూఎస్ 123 నంబర్ గల కారుకు పోలీసు నేమ్ బోర్డు పెట్టుకుని ఒడిశాలోకి ప్రవేశించి పలు ప్రాంతాల్లో ఇటీవల యథేచ్ఛగా తిరుగుతున్నాడు. దీంతో బరంపురం పోలీసులకు అనుమానం వచ్చి ఆయనను విచారించడంతో నకిలీ పోలీసు నేమ్‌బోర్డు వ్యవహారమని తేలింది. దీంతో ప్రాథమిక విచారణలో భాగంగా ఈ నెల 2వ తేదీన వాహనాన్ని సీజ్ చేసి సుబ్రహ్మణ్యంను అదుపులోకి తీసుకుని మూడు రోజుల పాటు విచారించారు. 417, 419, 464 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అడ్డగోలు వ్యాపారాల కోసమే ఒడిశాకు వెళ్లారని, ఎవరూ తమను అడ్డుకోరాదనే ఉద్దేశంతోనే పోలీసు నేమ్ బోర్డు పెట్టుకుని తిరుగుతున్నారని వాదనలు వినిపిస్తున్నాయి.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.